ప్రభాతనవ

సింగిడి

SINGIDI
తెలుగు దినపత్రిక

ప్రతి రంగూ ఓ నిజం

site.singidinews.com

మంగళవారం 10 నవంబర్ 2026 | సంపుటి: 1 | సంచిక: 144 | పేజీలు 12 | వెల: 6.50

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

చర్చలు, దౌత్యంతోనే యుద్ధానికి ముగింపు!

మోదీతో జెలెన్ స్కీ ఫోన్ సంభాషణ

శాంతి పునరుద్ధరణకు భారత్ సహకారం.. అబూదాబీ ఎజెండాపై చర్చ

నల్ల సముద్రం ధాన్య ఎగుమతుల పునరుద్ధరణపైనా ప్రస్తావన

ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి ఇరువురు నేతల చర్చలు

2







దిగొచ్చిన క్యాన్సర్ మందుల ధరలు

కొత్త ధరలు నేటి నుంచే అమలు

క్యాన్సర్ చికిత్సలో వాడే 1,364 రకాల ఔషధాల ధరలను భారీగా తగ్గించిన కేంద్రం

2

ఎల్లమ్మ తల్లి మీద ఆన... కొడంగల్ పొలాలు

తడిపి తీరుతా

పచ్చని పంటలు పండేలా చేస్తా.. ఎవడడ్డొచ్చినా తొక్కుకుంటూ కృష్ణా నీళ్లు తెస్తా

ఇక్కడి ప్రజలు అండగా ఉంటే మోదీనైనా, కేడీనైనా ఎదిరిస్తా..

సంక్రాంతి తర్వాత ప్రజాబలం పేరుతో ప్రజల్లోకి వస్తాం

అందరం కలిసి ఎల్‌నినోను ఎదుర్కొందాం.. పది జన్మలెత్తినా కేటీఆర్ రేవంత్ కాలేడు

లగచర్ల ఇండస్ట్రియల్ కారిడార్ రైతు బహిరంగ సభలో సీఎం రేవంత్



పోలేపల్లి ఎల్లమ్మ తల్లిపై ఆన అని.. డిసెంబర్ నాటికి కొడంగల్ కు కృష్ణా నీళ్లు తీసుకొచ్చి బీడు భూములను తడుపుతానని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఎవడడ్డొచ్చినా తొక్కుకుంటూ వెళ్లి నీళ్లు తీసుకొచ్చి పచ్చని పంటలు పండిస్తానన్నారు. ఇక్కడి ప్రజలు అండగా ఉంటే మోదీనైనా, కేడీనైనా ఎదిరిస్తానని వ్యాఖ్యానించారు.

– కొడంగల్, నవంబర్ 9 (సింగిడి)

2

పాలమూరు నుంచి ఎంపీగా గెలిచిన కేసీఆర్ జిల్లా రుణం తీర్చుకుంటారని ఆశించామని, పాలమూరు జిల్లా నుంచి పోటీ చేసి కేసీఆర్ సీఎంగా గెలవాలని ఆశించారన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేసీఆర్ మన గుండెల మీద తన్ని నట్టేట్లో ముంచి కృష్ణా నదిలో కలిపేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలమూరు జిల్లా ప్రజల గుండెల మీద తన్ని గజ్వేల్‌కు వెళ్లారని, నాడు సాధించిన మక్తల్–నారాయణపేట ప్రాజెక్టును కేసీఆర్ పక్కన పెట్టారని విమర్శించారు.



డీపీఆర్ లేకుండానే టెండర్లు

ప్రజలు లేకుండానే పబ్లిక్ హియరింగ్

కాంగ్రెస్‌ది తుగ్లక్ పాలన.. కేటీఆర్ విమర్శలు!

మూసీ నది సుందరీకరణ ప్రాజెక్టు విషయంలో రాష్ట్ర ప్రభుత్వ తీరుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజలు లేకుండానే ప్రజాభిప్రాయ సేకరణ (పబ్లిక్ హియరింగ్) నిర్వహించడం, కనీసం సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) లేకుండానే టెండర్లు పిలవడంపై ఆయన ఎక్స్ (ట్విట్టర్) వేదికగా నిప్పులు చెరిగారు. "ప్రజలు లేకుండా పబ్లిక్ హియరింగ్.. డీపీఆర్ లేకుండానే ప్రాజెక్టు బిడ్లు పిలవడం.. ఇందులో విడ్డూరం ఏంటంటే, రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొన్న సమయంలో 'సుందరీకరణ' పేరుతో హడావుడి చేయడం. ఇది తుగ్లక్ ప్రభుత్వం కాకపోతే మరేం అనాలో అర్థం కావడం లేదు" అంటూ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. ప్రభుత్వం ఎటువంటి ప్రణాళిక, పారదర్శకత లేకుండా మూసీ ప్రాజెక్టు పేరుతో ముందుకు వెళ్తోందని, కనీస నిబంధనలు కూడా పాటించడం లేదని కేటీఆర్ తన ట్వీట్ ద్వారా ఎద్దేవా చేశారు.

-హైదరాబాద్, నవంబర్ 9 (సింగిడి)

పట్నం నరేందర్‌రెడ్డి అరెస్ట్ అక్రమం: కేటీఆర్

పోలీసుల అదుపులో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో ముందస్తుగా అరెస్టు చేసినట్లు వెల్లడి

2



పెరుగుతున్న చలి తీవ్రత

పడిపోతున్న ఉష్ణోగ్రతలు

ఏపీ, తెలంగాణలో వర్షాలు!

13న అల్పపీడనం ఏర్పడే అవకాశం

కోస్తాంధ్ర, రాయలసీమలో ఉరుములతో కూడిన వర్షాలు!

గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం

2

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. నవంబర్ 13న ఆగ్నేయ బంగాళాఖాతంలో ఇది ఏర్పడవచ్చని అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, యానాం ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. మరోవైపు, తెలంగాణలో చలి తీవ్రత క్రమంగా పెరుగుతోంది.

-హైదరాబాద్, నవంబర్ 9 (సింగిడి)

ప్రతి జిల్లాలో డీసీహెచ్ఎస్ కార్యాలయాలు



ఏర్పాటుపై విస్తృత కసరత్తు

జిల్లాల్లోనే పూర్తి వైద్య సేవలు అందించడమే లక్ష్యం: మంత్రి దామోదర రాజనర్సింహ

తెలంగాణ వైద్య విధాన పరిషత్ పునర్వ్యవస్థీకరణపై మంత్రి దామోదర రాజనర్సింహ సమీక్ష

కమ్యూనిటీ, ఏరియా, జిల్లా ఆసుపత్రుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

2

ఎన్నికలు ఎప్పుడూ జరిగిన 100 సీట్లు ఖాయం

రేవంతే మళ్లీ సీఎం: టీపీసీసీ మహేష్ గౌడ్

తెలంగాణలో ఎప్పుడూ ఎన్నికలు జరిగిన కాంగ్రెస్ పార్టీ 100 సీట్లు గెలవడం ఖాయమని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి మళ్లీ తెలంగాణ ముఖ్యమంత్రి అవుతారని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కేంద్రంలోనూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తోందని.. రాహుల్ గాంధీ దేశ ప్రధాని అవుతారని జోస్యం చెప్పారు. తెలంగాణలో మళ్లీ అధికారంలోకి వస్తామనే బీఆర్ఎస్ కలలు ఫలించవని అన్నారు. సోమవారం (నవంబర్ 9) వికారాబాద్ లగచర్ల వేదికగా ప్రభుత్వం రైతన్నతో ఆత్మీయ సభ నిర్వహించింది. టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు

-హైదరాబాద్, నవంబర్ 9 (సింగిడి)



2

పెద్ద నోట్ల అంశాన్ని మరోసారి తెరపైకి తెచ్చిన చంద్రబాబు

రూ.500 నోట్లను రద్దు చేయాలి

రూ.100, రూ.200 నోట్లను మాత్రమే చలామణిలో ఉంచాలన్న చంద్రబాబు

పెద్ద నోట్ల రద్దు, డిజిటల్ లావాదేవీల పెంపుతోనే అవినీతికి అడ్డుకట్ట పడుతుందని స్పష్టీకరణ

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఓట్ల శాతం పెరిగిందని వెల్లడి



దేశంలో రూ.500 నోట్లను రద్దు చేయాలంటూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం మరోసారి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మార్కెట్‌లో కేవలం రూ.100, రూ.200 విలువ కలిగిన కరెన్సీ నోట్లను మాత్రమే చలామణిలో కొనసాగించాలని ఆయన పేర్కొన్నారు. గతంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి డిజిటల్ కరెన్సీపై సమర్పించిన నివేదికను ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.

అమరావతి, నవంబర్ 9 (సింగిడి)

2

తెలంగాణ మహిళా కాంగ్రెస్ కార్యవర్గ విస్తరణ

22 జిల్లాల అధ్యక్షురాళ్ల నియామకం



తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్‌కు సంబంధించి నూతన రాష్ట్ర కార్యవర్గం మరియు 22 జిల్లాల అధ్యక్షుల మొదటి జాబితాను ప్రకటించారు. అఖిల భారత మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్కా లంబా ఆమోదంతో, టీపీసీసీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ సోమవారం ఈ ఉత్తర్వులను విడుదల చేశారు. రాష్ట్ర కార్యవర్గంలో 11 మంది ఉపాధ్యక్షులు, 10 మంది ప్రధాన కార్యదర్శులు, 5 గురు కార్యదర్శులకు చోటు కల్పించారు.

-హైదరాబాద్, నవంబర్ 9 (సింగిడి)

2

తెలంగాణ జనగణన తేదీలు ఖరారు

తెలంగాణలో జనగణన 2027 నిర్వహణకు తేదీలు ఖరారయ్యాయి. జనగణనపై తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2027 జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు జనాభా గణన జరగనుంది. జనవరి 10 నుంచి 24 వరకు స్వీయ గణనకు అవకాశం ఉంది.

-హైదరాబాద్, నవంబర్ 9 (సింగిడి)

2

భారత్‌లో భారీగా తగ్గిన పేదరికం!

ప్రపంచ బ్యాంకు నివేదికలో వెల్లడి

2011లో 27.1 శాతంగా ఉన్న తీవ్ర పేదరికం

2023 నాటికి 2.6 శాతానికి తగ్గుదల

దాదాపు 49.6 కోట్ల మందికి పేదరికం నుంచి విముక్తి

2



భారత్‌లో గత దశాబ్ద కాలంలో పేదరికం గణనీయంగా తగ్గిందని ప్రపంచ బ్యాంకు ప్రశంసించింది. ఈ విషయంలో అభివృద్ధి చెందుతున్న దేశాలు భారత్ అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకోవచ్చని ఓ నివేదిక వెల్లడించింది. 2011లో దేశంలో అత్యంత పేదరికంలో ఉన్నవారి సంఖ్య 27.1 శాతంగా ఉండగా.. 2023 నాటికి అది 2.6 శాతానికి తగ్గినట్లు ప్రపంచ బ్యాంకు గణాంకాలు చెబుతున్నాయి.

-న్యూఢిల్లీ, నవంబర్ 9 (సింగిడి)

పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్ ఖరారు!

ఏపీలో మూడు విడతల్లో 13,354 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు

ఈ నెల 13 నుంచి నోటిఫికేషన్ల విడుదల

తొలి విడత పోలింగ్ ఈ నెల 26న.. రెండో విడత 29న.. మూడో విడత డిసెంబర్ 2న

2

ఆంధ్రప్రదేశ్‌లో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధమైంది. రాష్ట్రవ్యాప్తంగా మూడు విడతల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నారు. మొత్తం 13,354 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు ఎన్నికల షెడ్యూల్‌కు సంబంధించిన వివరాలు వెల్లడయ్యాయి. తొలి విడత ఎన్నికల నోటిఫికేషన్ ఈ నెల 13న విడుదల కానుంది. ఈ విడతకు సంబంధించి నామినేషన్ల దాఖలుకు ఈ నెల 17 చివరి తేదీగా నిర్ణయించారు. ఈ నెల 26న పోలింగ్ నిర్వహించి, అదే రోజు ఫలితాలు ప్రకటించనున్నారు. రెండో విడత ఎన్నికల నోటిఫికేషన్ ఈ నెల 16న విడుదల కానుంది. ఈ విడతలో పోటీ చేసే అభ్యర్థులు ఈ నెల 20వ తేదీలోగా నామినేషన్లు దాఖలు చేయాలి. ఈ నెల 29న పోలింగ్ నిర్వహించనున్నారు. మూడో విడత ఎన్నికల నోటిఫికేషన్ ఈ నెల 19న విడుదల కానుంది.

అమరావతి, నవంబర్ 9 (సింగిడి)





కలెక్టర్‌కు 6 నెలల జైలు శిక్ష

తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు..

రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డికి 6 నెలల జైలు శిక్ష.. రూ.2 వేల జరిమానా విధించిన హైకోర్టు

కోర్టు ధిక్కరణకు పాల్పడినట్లు నిర్ధారణ

2

ఎల్లమ్మ తల్లి మీద ఆన... కొడంగల్ పాలాలు తడిపి తీరుతా



వికారాబాద్ జిల్లా లగచర్ల బహిరంగ సభలో రేవంత్ రెడ్డి మాట్లాడారు. తెలంగాణ వచ్చినా పాలమూరు వలసలు ఆగలేదని, కొడంగల్‌లో కల్తీ కల్లు తాగడం తప్పలేదని, కందులు పండించడం తప్ప మరో పంట వేయడం మనకు తెలియలేదని సీఎం పేర్కొన్నారు. 2023లో ముక్కోటి దేవతలు ఏకమై కొడంగల్ ప్రజల మొక్కులు తీర్చారని, దేశం గర్వించే విధంగా సీఎం హోదా కొడంగల్ శాసనసభకు దక్కిందని వ్యాఖ్యానించారు. మక్తల్-నారాయణపేట-కొడంగల్ పథకాన్ని



అడ్డుకుంటామని చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మా ప్రాజెక్టు పనులు చేపడుతుంటే మీకు ఎందుకు కడుపు మంట అని నిలదీశారు. సీఎంగా ప్రమాణం చేశాక ఒక్క రోజైనా సెలవు తీసుకోకుండా పని చేస్తున్నానని స్పష్టం చేశారు.
ప్రభుత్వం ఉద్యోగుల కష్టాలు చూసి 11 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులకు మొదటి తారీఖున జీతాలు ఇవ్వాలని ఆలోచన చేశాం. 2024, జనవరి 1 నుంచి ప్రతీ నెల మొదటి తారీఖున జీతాలు పడుతున్నాయ్. ప్రతీ సంవత్సరం కేసీఆర్ అప్పులకు తప్పులకు 80 వేల కోట్లు చెల్లిస్తున్నాం.
కేసీఆర్ అప్పులకు తప్పులకు ఈ 34 నెలల్లో 2 లక్షల కోట్లకు పైగా చెల్లించాం. మాట్లాడాలి రమ్మంటే కెసీఆర్ రాడు. ఆయన తింటే కుంభకర్ణుడు.. పంటే బకాసురుడు.

గడ్డం సరే.. బుద్ధికి ఎన్నేండ్లో మరి..

మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పనులు మేం మొదలు పెడితే.. కేసీఆర్, కేటీఆర్ అడ్డుకుంటా మంటున్నారు. కేటీఆర్ కు గడ్డం రావడానికి 50 ఏండ్లు పట్టింది. బుద్ధి రావడానికి ఎన్నేండ్లు పడుతుందో. పులిని చూసి నక్క వాతలు పెట్టుకుంటే ఎన్నటికీ నక్క పులి కాదు. కేటీఆర్ నువ్ గడ్డం పెంచుకున్నా.. గడ్డం మోకాల్ల వరకు పెంచుకున్నా ఎన్నటికీ రేవంత్ కాలేవు. రేవంత్ రెడ్డి కావాలంటే గుండె ధైర్యం ఉండాలి. నమ్ముకున్న వారి కోసం నిలబడే తెగువ కావాలి. పది జన్మలు ఎత్తినా నువ్వు రేవంత్ రెడ్డి కాలేవు.
మేం లిఫ్ట్ ఇరిగేషన్ పనులు చేసుకుంటే మీకు కడుపు మంట ఎందుకు? ఆనాడు కొడంగల్ బిడ్డలు చదువుకోవాలంటే పక్క జిల్లాలకు, పక్క రాష్ట్రాలకు వెళ్లాల్సి ఉండేది. ఇవాళ కొడంగల్ ను ఎడ్యుకేషన్ హబ్ గా చేసి.. ఉన్నత చదువులకు కొడంగల్ వచ్చేలా చేసుకుంటున్నాం. కొడంగల్ అభివృద్ధి జరుగుతుంటే కొందరు ఏడుపులు మొదలు పెట్టారు. ఇవాళ 9 వేల కోట్లతో కొడంగల్ లో అభివృద్ధి పనులు ప్రారంభించుకున్నాం.
రాబోయే రోజుల్లో వేల కోట్ల పెట్టుబడులు తెచ్చి... అభివృద్ధి పథంలో నడిపిస్తాం. కొడంగల్ ప్రజలు అండగా ఉంటే ఢిల్లీలో మోదీనైనా, కేడీనైనా ఎదిరిస్తా.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తా

నిరంతరం పనిచేసే తెలంగాణను దేశంలోనే నెంబర్ వన్ గా తీర్చిదిద్దే బాధ్యత నాది. ప్రజాబలంతో సునామీ సృష్టిస్తాం. ఆ సునామీలో మోడీ, కేడీ కొట్టుకుపోతారు. జర్నలిస్టులు అధైర్యపడొద్దు.. మీ సమస్యలు పరిష్కరించే బాధ్యత నాది అని రేవంత్ హామీ ఇచ్చారు.



చర్చలు, దౌత్యంతోనే యుద్ధానికి ముగింపు!

న్యూఢిల్లీ, నవంబర్ 9 (సింగిడి)

రష్యా-ఉక్రెయిన్ మధ్య కొనసాగుతున్న యుద్ధ సంక్షోభాన్ని కేవలం చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే పరిష్కరించుకోవాలని భారత ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ సోమవారం సాయంత్రం ప్రధాని మోదీతో టెలిఫోన్‌లో మాట్లాడారు. ఈ సంభాషణకు సంబంధించిన వివరాలను భారత ప్రధానమంత్రి కార్యాలయం అధికారికంగా విడుదల చేసింది. పీఎంఓ ప్రకటన ప్రకారం.. రష్యాతో నెలకొన్న ప్రస్తుత యుద్ధ పరిణామాలపై తన అభిప్రాయాలను అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రధాని మోదీతో పంచుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, సమస్యల పరిష్కారంలో భారత్ ఎల్లప్పుడూ అనుసరించే 'మానవతా దృక్పథాన్ని' పునరుద్ఘాటించారు. వివాదాలను కేవలం చర్చలు, దౌత్యం ద్వారానే పరిష్కరించుకోవాలనేది భారత్ యొక్క స్థిరమైన విధానమని స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలో శాంతిని పునరుద్ధరించేందుకు ఉద్దేశించిన అన్ని రకాల ప్రయత్నాలకు తమ వంతు సహకారం అందించేందుకు భారత్ సిద్ధంగా ఉందని ప్రధాని తెలిపారు. అలాగే, ఇరు దేశాల ప్రజల ప్రయోజనాల దృష్ట్యా వివిధ రంగాలలో భారత్-ఉక్రెయిన్ ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవడంపై కూడా నేతలిద్దరూ చర్చించారు. మరోవైపు, ఈ ఫోన్ సంభాషణపై ఉక్రెయిన్ అధ్యక్ష కార్యాలయం కూడా ఒక ప్రకటన విడుదల చేసింది. యుద్ధాన్ని ముగింపు దశకు తీసుకువచ్చేందుకు అవసరమైన దౌత్య ప్రక్రియలు, తదుపరి చర్యలపై ప్రధాని మోదీతో చర్చించినట్లు పేర్కొంది. రాబోయే అబూదాబీ సమావేశ ఎజెండా కోసం ఉక్రెయిన్ సిద్ధమవుతోందని జెలెన్‌స్కీ తెలిపారు. ఉక్రెయిన్ ఎల్లప్పుడూ నిర్మాణాత్మక వైఖరితోనే ఉందని, రష్యా నుంచి కూడా యుద్ధ ఉద్రిక్తతలను తగ్గించే విధంగా అలాంటి చొరవే అవసరమని ఆయన పేర్కొన్నారు.
"ఇది యుద్ధాన్ని కొనసాగించాల్సిన సమయం కాదు.. ముగించాల్సిన సమయం అని రష్యా నాయకత్వంతో సహా అందరికీ ప్రధాని మోదీ గతంలో పలుమార్లు స్పష్టంగా చెప్పారు. ఈ నేపథ్యంలో యుద్ధానికి ముగింపు పలికేలా భారత్ తన పంతుగా ఎలాంటి చర్యలు తీసుకోగలదో గుర్తించడం, ఇతర దేశాల నాయకులతో సంప్రదింపులు జరపడం ఎంతో కీలకం" అని జెలెన్‌స్కీ వ్యాఖ్యానించారు. నల్ల సముద్రంలో నిలిచిపోయిన ధాన్యపు ఎగుమతులు, ఆహార భద్రత అంశంపై కూడా ఇరువురు నేతలు చర్చించారు. ఆహార రవాణా కారిడార్ పునరుద్ధరణలో మధ్యవర్తిత్వం వహించేందుకు భారత్ సిద్ధంగా ఉందని, ఈ విషయంలో భారత్ చేసే ప్రయత్నాల కోసం తాము ఎదురుచూస్తున్నామని ఉక్రెయిన్ తెలిపింది. సముద్ర మార్గాలను అడ్డుకోవడం వల్ల రష్యా ఆర్థిక వ్యవస్థతో పాటు వివిధ దేశాల్లోని కోట్లాది మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జెలెన్‌స్కీ ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల అట్లాంటాలో జరిగిన జీ20 విదేశాంగ మంత్రుల సదస్సు సందర్భంగా భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ మాట్లాడుతూ, ఈ సంక్షోభ పరిష్కారం కోసం భారత్ నిరంతరం ప్రయత్నిస్తోందని వెల్లడించారు. పౌర నౌకలు మరియు నావికులపై దాడులు జరగకుండా చూడటం, నల్ల సముద్రం ద్వారా ధాన్యపు ఎగుమతులను పునరుద్ధరించడం, అలాగే ఇంధన మౌలిక వసతులపై దాడులు జరగకుండా చూడటం అనే మూడు ప్రధాన అంశాలపై భారత్ రష్యా, ఉక్రెయిన్ మరియు యూరప్ దేశాలతో చర్చిస్తోందని తెలిపారు.

తెలంగాణ జనగణన తేదీలు ఖరారు

ఇంటింటి జనగణనకు ముందు సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియ ఉంటుంది. మార్చి 1 నుంచి 5 వరకు రివిజనల్ రౌండ్ నిర్వహిస్తారు. 2027 మార్చి 1 అర్ధరాత్రి 12 గంటలను జనగణన రిఫరెన్స్ తేదీగా నిర్ణయం తీసుకున్నారు. కేంద్ర హోంశాఖ జారీ చేసిన నోటిఫికేషన్‌ను తెలంగాణ గెజిట్‌లో పునఃప్రచురణ చేస్తారు. జనగణన నిర్వహణకు సంబంధించి అన్ని శాఖలకు ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఎన్నికలు ఎప్పుడూ జరిగిన 100 సీట్లు ఖాయం

కాంగ్రెస్ అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలు దేశంలో మరెక్కడా లేవన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఫ్రీ కరెంట్, సబ్సిడీపై గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని చెప్పారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా రేషన్ ద్వారా పేదలకు సన్నబియ్యం పంపిణీ చేసే చారిత్రాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రైతాంగానికి పెద్దపీట వేస్తోందని చెప్పారు. రైతు రుణ మాఫీ, రైతు భరోసా, రైతు బీమా, సన్న వడ్లకు బోనస్ అందిస్తూ రైతన్నలకు అండగా నిలుస్తున్నామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఓర్వలేక ప్రతిపక్ష బీఆర్ఎస్ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేపట్టే ప్రతి పనికి అడ్డుపడుతూ అభివృద్ధి జరగకుండా కుట్రలకు పాల్పడుతోందని మండిపడ్డారు. సోషల్ మీడియాలో బీఆర్ఎస్ చేసే తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు.

ప్రతి జిల్లాలో డీసీహెచ్ఎస్ కార్యాలయాలు

హైదరాబాద్, నవంబర్ 9 (సింగిడి)

తెలంగాణలో సెకండరీ హెల్త్ కేర్ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ముమ్మర చర్యలు చేపట్టింది. ప్రజలు చిన్న సమస్యలకు కూడా రాజధాని హైదరాబాద్‌కు రావాల్సిన అవసరం లేకుండా, జిల్లాల్లోనే కార్పొరేట్ స్థాయి పూర్తి వైద్య సేవలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో తెలంగాణ వైద్య విధాన పరిషత్ పునర్వ్యవస్థీకరణపై మంత్రి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆసుపత్రుల్లో సేవల నాణ్యత, పనితీరును సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు ప్రతి జిల్లాలో జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి (డీసీహెచ్ఎస్) కార్యాలయాలను ఏర్పాటు చేసే ప్రతిపాదనపై అధికారులతో చర్చించారు. రాష్ట్ర స్థాయి డైరెక్టరేట్ నుంచి జిల్లా స్థాయి వరకు స్పష్టమైన పాలనా బాధ్యతలు ఉండాలని మంత్రి పేర్కొన్నారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల (సీహెచ్‌సీ), ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రుల అభివృద్ధిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని దామోదర రాజనర్సింహ ఆదేశించారు. రోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, మౌలిక వసతుల లోపాలు, సిబ్బంది కొరత వంటి సమస్యలను జిల్లా స్థాయిలోనే ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించాలని సూచించారు. వైద్య సేవల విస్తరణలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 1,616 మంది స్పెషలిస్ట్ వైద్యుల నియామకాలతో పాటు అవసరమైన నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్ల నియామక ప్రక్రియను ప్రభుత్వం చేపట్టినట్లు మంత్రి వెల్లడించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు నాణ్యమైన చికిత్సను చేరువ చేయడమే ప్రభుత్వ ధ్యేయమని ఆయన తెలిపారు.

పెద్ద నోట్ల అంశాన్ని మరోసారి తెరపైకి తెచ్చిన చంద్రబాబు

అమరావతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ.. పెద్ద నోట్లను రద్దు చేయాలనే అంశంపై తాను నిరంతరం మాట్లాడుతుంటానని స్పష్టం చేశారు. "రూ.500, రూ.1,000, రూ.2,000 నోట్లను పూర్తిగా రద్దు చేయాలి. కేవలం రూ.100, రూ.200 నోట్లను మాత్రమే ఉంచాలి" అని ఆయన డిమాండ్ చేశారు. పెద్ద నోట్ల రద్దుతో నగదు వినియోగాన్ని నియంత్రించి, డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించడం ద్వారా అవినీతిని సమర్థవంతంగా అరికట్టవచ్చని సీఎం అభిప్రాయపడ్డారు. సాంకేతికతను సమర్థవంతంగా వినియోగిస్తే సంపద సృష్టి, పేదరిక నిర్మూలన కష్టమేమీ కాదని ఆయన పేర్కొన్నారు. ఇటీవల ముగిసిన ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీయే కూటమి.. ధన బలాన్ని పూర్తిగా నియంత్రించగలిగిందని చంద్రబాబు తెలిపారు. ఈ ఎన్నికల ఫలితాలు కేవలం కూటమి విజయాన్ని మాత్రమే కాకుండా మంచి పాలన, సామాజిక న్యాయం, నూతన నాయకత్వం, ప్రజాస్వామ్య విలువల పట్ల ప్రజలకున్న విశ్వాసానికి నిదర్శనమని చెప్పారు. 2024 సార్వత్రిక ఎన్నికలతో పోలిస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీయేకు ప్రజా మద్దతు మరింత పెరిగిందని ఆయన వివరించారు. పట్టణ స్థానిక సంస్థలు, పరిషత్ ఎన్నికలు రెండింటినీ కలిపి ఎన్డీయే కూటమికి 58.9 శాతం ఓట్లు వచ్చాయని చంద్రబాబు వెల్లడించారు. 2024 ఎన్నికల్లో వచ్చిన 55.3 శాతం ఓట్లతో పోలిస్తే ఇది 3.6 శాతం పెరిగిందన్నారు. ఇదే సమయంలో వైసీపీ ఓట్ల శాతం 39.81 శాతం నుంచి 33.56 శాతానికి పడిపోయిందని, అంటే 6.25 శాతం తగ్గిందని చెప్పారు. ఫలితంగా స్థానిక సంస్థల పోరులో కూటమికి, వైసీపీకి మధ్య ఓట్ల తేడా 25.34 శాతంగా నమోదైందని వివరించారు. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీయే కూటమి 59.9 శాతం ఓట్లు సాధించగా, వైసీపీకి కేవలం 34.3 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయని సీఎం తెలిపారు. పట్టణాల్లో కూటమి ఏకంగా 94 శాతం స్ట్రైక్ రేట్ సాధించిందన్నారు. జడ్పీటీసీ ఎన్నికల్లో కూటమికి 57.6 శాతం, వైసీపీకి 39.7 శాతం ఓట్లు దక్కగా.. కూటమి 87.5 శాతం స్ట్రైక్ రేట్ నమోదు చేసిందని చెప్పారు. కూటమికి, వైసీపీకి మధ్య ఓట్ల వ్యత్యాసం పట్టణాల్లో 25.6 శాతంగా, గ్రామీణ ప్రాంతాల్లో 17.9 శాతంగా ఉందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 659 జడ్పీటీసీ స్థానాల్లో కూటమి ఏకంగా 575 స్థానాలను కైవసం చేసుకుందని ముఖ్యమంత్రి చెప్పారు. మొత్తం 28 జిల్లాల్లో 27 జిల్లాల్లో కూటమి పూర్తి ఆధిపత్యం సాధించిందని, ఒక్క అల్లూరి సీతారామరాజు జిల్లాలో మాత్రమే వైసీపీ అధిక జడ్పీటీసీ స్థానాలు గెలుచుకుందని పేర్కొన్నారు. ఏడు జిల్లాల్లో వైసీపీ ఒక్క జడ్పీటీసీ సీటును కూడా గెలవలేకపోయిందని వివరించారు. అలాగే, 9,818 ఎంపీటీసీ స్థానాల్లో కూటమి 7,803 స్థానాలను గెలుచుకుందని, రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 90 శాతం మండల పరిషత్ అధ్యక్ష పదవులు కూటమికే దక్కనున్నాయని తెలిపారు. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కూటమి తిరుగులేని ఆధిక్యాన్ని ప్రదర్శించిందని చంద్రబాబు పేర్కొన్నారు. మొత్తం 100 మేయర్, మున్సిపల్ చైర్‌పర్సన్ పదవుల్లో కూటమి 94 స్థానాలను గెలుచుకుంది. ఇందులో 13 మేయర్ స్థానాల్లో 12 స్థానాలు, 87 చైర్‌పర్సన్ స్థానాల్లో 82 స్థానాలు కూటమి ఖాతాలో పడ్డాయి. పార్టీల వారీగా చూస్తే తెలుగుదేశం పార్టీ 70, జనసేన 20, బీజేపీ 4 మేయర్/చైర్‌పర్సన్ స్థానాలను దక్కించుకున్నాయి. మొత్తం 3,941 వార్డుల్లో కూటమి 3,233 వార్డులను (82 శాతం) గెలుచుకుంది. 100 పట్టణ స్థానిక సంస్థల్లో 95 చోట్ల కూటమి కౌన్సిల్ మెజారిటీ సాధించగా, 16 మున్సిపాలిటీల్లోని అన్ని వార్డులనూ క్లీన్ స్వీప్ చేసింది. మరోవైపు, వైసీపీ కేవలం నాలుగు పట్టణ స్థానిక సంస్థలను, 558 వార్డులను మాత్రమే గెలుచుకుందని, 22 పట్టణాల్లో ఒక్క వార్డు కూడా గెలవలేకపోయిందని ముఖ్యమంత్రి తెలిపారు.

కలెక్టర్‌కు 6 నెలల జైలు శిక్ష

కోర్టు ఆదేశాలను ఉల్లంఘించిన కేసులో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డికి తెలంగాణ హైకోర్టు ఆరు నెలల సాధారణ జైలు శిక్ష విధించింది. రూ.2 వేల జరిమానా కూడా చెల్లించాలని ఆదేశించింది. జస్టిస్ కె.లక్ష్మణ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ మేరకు తీర్పు వెలువరించింది. అయితే అప్పీలు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తూ శిక్ష అమలును నాలుగు వారాల పాటు నిలిపివేసింది. రిజిస్ట్రేషన్ చట్టం-1908లోని సెక్షన్ 22-ఏ ప్రకారం నిషేధిత ఆస్తుల జాబితాలో ఉన్న కొన్ని ప్లాట్లను తొలగించాలంటూ బాధితులు గతంలో హైకోర్టును ఆశ్రయించారు. వారి వినతిని పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని 2025 ఆగస్టులో కలెక్టర్‌ను కోర్టు ఆదేశించింది. 60 రోజుల్లోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని స్పష్టం చేసింది. అయితే గడువు ముగిసినా కలెక్టర్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో బాధితులు 2025 అక్టోబరు 15న కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఆ తర్వాతే అధికారులు స్పందించారు. బాధితులకు నోటీసులు జారీ చేసి, 2026 ఫిబ్రవరి 26న వారి వినతిని తిరస్కరించారు. అనంతరం జులై 8న మరోసారి తిరస్కరణ ఉత్తర్వులు ఇచ్చారు. కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైన తర్వాతే అధికారులు స్పందించడం, కోర్టు ఆదేశించిన గడువులోగా నిర్ణయం తీసుకోకపోవడంపై ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఉద్దేశపూర్వకంగానే కలెక్టర్ కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించారని నిర్ధారించింది. ఐఏఎస్ స్థాయి అధికారి న్యాయస్థానం ఆదేశాలను నిర్లక్ష్యం చేయడం సమర్థనీయం కాదని స్పష్టం చేస్తూ ఆరు నెలల జైలు శిక్ష విధించింది.

పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్ ఖరారు!

ఈ విడత నామినేషన్ల దాఖలుకు ఈ నెల 23 చివరి గడువుగా నిర్ణయించారు. డిసెంబర్ 2న పోలింగ్ నిర్వహించి, అదే రోజు ఫలితాలు వెల్లడించనున్నారు. మొత్తంగా మూడు విడతల్లో 13,354 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికల సందడి నెలకొననుండటంతో ఆశావహులు, రాజకీయ నాయకులు ఇప్పటి నుంచే ఎన్నికల సన్నాహాలు ప్రారంభించనున్నారు.

తెలంగాణ మహిళా కాంగ్రెస్ కార్యవర్గ విస్తరణ

రాష్ట్ర కార్యవర్గ వివరాలు: ఉపాధ్యక్షులు: రేఖ బోయలపల్లి, అల్లూరి కృష్ణవేణి రెడ్డి, బి. లక్ష్మమ్మ, గాజుల సుకన్య, వేములకొండ పద్మ, మంగన్నగారి సుగుణ, అంగోతు సుగుణ, కనపర్తి కుమారి, గంగుల అంజలి యాదవ్, కె. శైలజ, బడ్డే ఇందిర ప్రధాన కార్యదర్శులు: అస్మా త బస్సుమ్, గోచికొండ శ్రీదేవి, బిందు గొంగటి, యాడ్ల విజయలక్ష్మి , కె. నాగమణి రెడ్డి, పుటుకూరు దివ్య, తెడ్డు సురక్ష, యోగేశ్వరి, వీర బోయిన రజిత , డుంగ్రోత్ నాగమణి

పట్నం నరేందర్‌రెడ్డి అరెస్ట్ అక్రమం: కేటీఆర్

హైదరాబాద్, నవంబర్ 9 ((సింగిడి)

కొడంగల్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నేత పట్నం నరేందర్‌రెడ్డి అరెస్టును ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. పార్టీ కార్యకర్త అంత్యక్రియలకు హాజరయ్యేందుకు వెళుతున్న నాయకుడిని పోలీసులు అక్రమంగా అదుపులోకి తీసుకోవడం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని ఆయన మండిపడ్డారు. వికారాబాద్ జిల్లా పరిగి సమీపంలోని బహార్‌పేట్ చౌరస్తా వద్ద పోలీసులు పట్నం నరేందర్‌రెడ్డి వాహనాన్ని అడ్డుకుని ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. ఆయన కోస్గిలో మరణించిన ఓ బీఆర్ఎస్ కార్యకర్త అంత్యక్రియలకు వెళుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఆ ప్రాంతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన ఉన్నందున, ముందస్తు జాగ్రత్త చర్యగానే నరేందర్



రెడ్డిని అదుపులోకి తీసుకున్నామని పోలీసులు తెలిపారు. ఈ అరెస్టుతో ఆగ్రహించిన బీఆర్ఎస్ కార్యకర్తలు పోలీసు వాహనాన్ని చుట్టుముట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై కేటీఆర్ స్పందిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ''పరామర్శించేందుకు వెళుతున్న నాయకుడిని అరెస్టు చేయాల్సిన అవసరం ఏముంది? బాధిత కుటుంబానికి అండగా నిలవడం కూడా ఇందిరమ్మ రాజ్యంలో నేరమైందా? నిర్బంధాలతో ప్రతిపక్షాలను భయభ్రాంతులకు గురిచేయడమే కాంగ్రెస్ పార్టీ పాలనగా మార్చుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వ కక్షసాధింపు చర్యలకు బీఆర్ఎస్ ఏమాత్రం భయపడదు. ప్రజల, కార్యకర్తల పక్షాన పోరాటం కొనసాగుతుంది. పట్నం నరేందర్‌రెడ్డిని ఎలాంటి షరతులు లేకుండా విడుదల చేయాలి'' అని డిమాండ్ చేశారు. మరోవైపు, పట్నం నరేందర్‌రెడ్డి అరెస్టును మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కూడా ఖండించారు. ప్రతిపక్ష నేతలను అకారణంగా నిర్బంధించడం ప్రజాస్వామ్య విరుద్ధమని పార్టీ నేతలు స్పష్టం చేశారు.

దిగొచ్చిన క్యాన్సర్ మందుల ధరలు

న్యూఢిల్లీ, నవంబర్ 9 (సింగిడి)

జాతీయ ఔషధ ధరల నియంత్రణ సంస్థ (ఎన్‌పీపీఏ) క్యాన్సర్ నిరోధక మందులపై ట్రేడ్ మార్జిన్‌ను 30 శాతానికి పరిమితం చేయడంతో, మార్కెట్లో లభించే దాదాపు 1,364 రకాల ఔషధ ఫార్ములేషన్ల గరిష్ఠ చిల్లర ధరలు (ఎంఆర్‌పీ) గణనీయంగా తగ్గాయి. నిపుణుల కమిటీ సిఫార్సుల మేరకు రసాయనాలు మరియు ఎరువుల మంత్రిత్వ శాఖ పరిధిలోని ఎన్‌పీపీఏ ఈ చర్యలు చేపట్టింది. మొత్తం 85 ఫార్మా కంపెనీలకు చెందిన 121 రకాల క్యాన్సర్ ఔషధాలు ఈ తాజా ధరల తగ్గింపు పరిధిలోకి వచ్చాయి. వీటిలో 679 బ్రాండ్ల ధరలు ఏకంగా 50 శాతం కంటే ఎక్కువగా తగ్గగా, కొన్ని మందులపై అత్యధికంగా 96.45 శాతం వరకు తగ్గింపు నమోదైంది. ఈ కీలక నిర్ణయం ద్వారా దేశవ్యాప్తంగా క్యాన్సర్ బాధితులకు మందుల కొనుగోలుపై ఏటా సుమారు రూ. 3,540.38 కోట్ల మేర ఆర్థిక భారం తగ్గనుందని అధికార వర్గాలు వెల్లడించాయి. దాదాపు 20 రకాలకు పైగా క్యాన్సర్ల చికిత్సలో ఉపయోగించే కీలకమైన ఇమ్యునోథెరపీ మరియు ఇతర ప్రాణరక్షక ఔషధాల ధరలు దిగివచ్చాయి. ముఖ్యంగా రొమ్ము క్యాన్సర్ చికిత్సలో వాడే 'అనస్ట్రోజోల్' (10 మాత్రలు) పాత ధర రూ. 695.76 ఉండగా, అది ఇప్పుడు కేవలం రూ. 73కే అందుబాటులోకి వచ్చింది. డాక్టర్ రెడ్డీస్‌కు చెందిన 'అజాసైటిన్' ఇంజెక్షన్ ధర రూ. 6,337 నుంచి రూ. 1,495.04కు తగ్గింది. అబోట్ సంస్థకు చెందిన 'బెవాసిజుమాబ్' (4 ఎంఎల్) ఇంజెక్షన్ పాత ధర రూ. 21,767.70 కాగా, తాజా మార్గదర్శకాలతో అది రూ. 5,930.13కు లభించనుంది. అలాగే ఆర్‌పీజీ లైఫ్ సైన్సెస్‌కు చెందిన 'డెఫ్రుమాబ్ 60 ఎంజీ' ఇంజెక్షన్ ధర రూ. 22,031.25 నుంచి రూ. 5,941కి, 'ఎనుటా' క్యాప్సూల్స్ (28 మాత్రలు) ధర రూ. 6,578.20 నుంచి రూ. 2,232కు పడిపోయాయి. వీటితో పాటు ఎర్లోటినిబ్, ఫ్లుడారాబిన్, ఫుల్వెస్ట్రాంట్ వంటి పలు కీలక ఔషధాల ధరలు

భారత్‌లో భారీగా తగ్గిన పేదరికం!

'ది బిజినెస్ స్టాండర్డ్' ప్రచురించిన నివేదిక ప్రకారం.. భారత్ దాదాపు 49.6 కోట్ల మందిని తీవ్ర పేదరికం నుంచి బయటపడేసింది. అమెరికా, రష్యా దేశాల మొత్తం జనాభా కంటే ఇది ఎక్కువ. ప్రపంచంలో పేదరికం అత్యంత వేగంగా తగ్గిన దేశాల్లో భారత్ ఒకటిగా నిలిచిందని నివేదిక పేర్కొంది.రోజుకు 4.2 డాలర్ల ఆదాయాన్ని ప్రాతిపదికగా తీసుకునే దిగువ మధ్య ఆదాయ దేశాల పేదరిక ప్రమాణం ప్రకారం కూడా భారత్‌లో పేదరికం 2011లో 57.7 శాతం ఉండగా.. 2023 నాటికి 16.1 శాతానికి తగ్గింది. అయితే పేదరికాన్ని కొలిచే విధానాల్లో వచ్చిన మార్పులు కూడా ఈ గణాంకాలపై కొంత ప్రభావం చూపి ఉండొచ్చని ప్రపంచ బ్యాంకు స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా పేదరికం తగ్గదల ఒకేలా లేదని నివేదిక తెలిపింది. ఉత్తరప్రదేశ్ నుంచి పశ్చిమ బెంగాల్ వరకు ఉన్న ప్రాంతంలోనే దేశంలోని పేదల్లో 57 శాతం మంది నివసిస్తున్నట్లు వెల్లడించింది.పేదరికం తగ్గడానికి ప్రధానంగా ఆర్థిక వృద్ధి, వినియోగం పెరగడం, ఉపాధి అవకాశాలు విస్తరించడం, సామాజిక భద్రతా పథకాలు దోహదపడ్డాయని నివేదిక వివరించింది. 2022-25 మధ్య భారత్



సగటున ఏటా 7 శాతానికి పైగా ఆర్థిక వృద్ధిని నమోదు చేసింది. 2015లో 1.24 లక్షల కోట్ల డాలర్లుగా ఉన్న కుటుంబాల ఖర్చు 2025 నాటికి 2.24 లక్షల కోట్ల డాలర్లకు చేరింది.మహిళలకు ఉపాధి అవకాశాలు పెరగడం కూడా పేదరికం తగ్గుదలకు తోడ్పడింది. 2014-24 మధ్య దేశంలో 17 కోట్లకు పైగా ఉద్యోగాలు కల్పించినట్లు నివేదిక పేర్కొంది. సగటున ఏటా 1.7 కోట్ల ఉద్యోగాలు వచ్చాయి. నిరుద్యోగిత రేటు 2015లో 7.6 శాతంగా ఉండగా.. 2025 నాటికి 4.2 శాతానికి తగ్గింది.ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో డిజిటల్ విధానాల విస్తరణ, మహిళా కేంద్రిత పథకాలు, వ్యవసాయం, గ్రామీణ రంగాలకు మద్దతు, సామాజిక భద్రతా కార్యక్రమాల విస్తరణ కూడా పేదరిక నిర్మూలనలో కీలక పాత్ర పోషించాయని నివేదిక వివరించింది.

పెరుగుతున్న చలి తీవ్రత

ఈశాన్య దిశ నుంచి వీస్తున్న పొడి గాలుల కారణంగా రాత్రి ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. హైదరాబాద్‌లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 17 నుంచి 19 డిగ్ర

ఘనంగ సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు



సిద్దిపేట ప్రతినిధి, నవంబర్ 09, (సింగిడి): తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను సిద్దిపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపల్లి చంద్రం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా తన కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేసి, నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య జన్మదిన వేడుకలను ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు.ఈ సందర్భంగా దరిపల్లి చంద్రం మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన అందిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని ఆకాంక్షించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయురారోగ్యాలతో, నిండు నూరేళ్లు ప్రజాసేవలో కొనసాగాలని, తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆర్టీఏ మెంబర్ సూర్య వర్మ, మాజీ కౌన్సిలర్ రియాజ్,

లబ్ధిదారుల ఇళ్లలో ఆనందోత్సాహాలు!

కామారెడ్డి ప్రతినిధి నవంబర్ 09 (సింగిడి)

గాంధారి: కామారెడ్డి జిల్లా గాంధారి మండలంలోని ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి పండుగ వేడుకలు అంబరాన్నంటాయి. సొంతింటి కల నెరవేరడంతో కొత్త ఇంటి ముంగిట దీపాలు వెలిగిస్తూ లబ్ధిదారుల కుటుంబాలు ఆనందంగా పండుగను జరుపుకున్నాయి. మండలంలోని వివిధ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో పాటు మండల స్థాయి కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొని దీపావళి సంబరాలను ఘనంగా నిర్వహించారు.గతంలో సొంత ఇల్లు లేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్న పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు ఒక గొప్ప వరంగా మారాయని లబ్ధిదారులు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. సొంతింటిలో దీపావళి జరుపుకోవడం జీవితంలో మరిచిపోలేని అనుభూతిని కలిగించిందని ఆనందం పంచుకున్నారు. నాయకులతో కలిసి దీపాలు వెలిగిస్తూ, మిఠాయిలు పంచుకుంటూ పండుగ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు తమ ఇళ్ల ముందు దీపాలు వెలిగించిన ఫొటోలు, కుటుంబ సభ్యులతో కలిసి దిగిన చిత్రాలను వాట్సాప్ గ్రూపుల్లో, సోషల్ మీడియాలో విస్తృతంగా షేర్ చేస్తూ స్టేటస్‌ల రూపంలో తమ ఆనందాన్ని పంచుకున్నారు. తమకు దక్కిన సొంతింటి ఆనందాన్ని బంధుమిత్రులతో పంచుకుంటూ ఈ దీపావళి తమ జీవితాల్లో ప్రత్యేకమైనదిగా నిలిచిందని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతోందని, అందులో భాగంగానే నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసే ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలవుతోందని స్థానిక నాయకులు పేర్కొన్నారు. పేదల ముఖాల్లో చిరునవ్వులు చూడటమే ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రధాన ఉద్దేశమని తెలిపారు.సొంతింటి వెలుగుల్లో కొత్త ఆశలు.. ఇందిరమ్మ ఇళ్లతో పేద కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఈ దీపావళి వేడుకలు గాంధారి మండలంలో ఇందిరమ్మ ఇళ్ల పథకంపై లబ్ధిదారుల సంతృప్తిని, వారి కుటుంబాల్లో నెలకొన్న సంతోషాన్ని చాటిచెప్పాయి.

పేదల ఇళ్లలో ఇందిరమ్మ వెలుగులు

ఇందిరమ్మ ఇళ్లలో లబ్ధిదారులతో కలిసి పండుగ సంబరాలు
సన్న బియ్యంతో భోజనం లబ్ధిదారుల కుటుంబంతో కలిసి ఆరగించిన మంత్రి శ్రీధర్ బాబు
నిరుపేదల సొంతింటి కల సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం



జయశంకర్ భూపాలపల్లి బ్యూరో/కాటారం, నవంబర్ 9 (సింగిడి): నిరుపేదల సొంతింటి కలను సాకారం చేస్తూ, వారి జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. పండుగ వెలుగులు పేదల గడపకు చేరాలనే సంకల్పంతో కాటారం మండలం ధన్వాడ, మేడిపల్లి గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమంలో మంత్రి పాల్గొని లబ్ధిదారుల నూతన గృహాలను ప్రారంభించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ధన్వాడ గ్రామానికి చెందిన ఏపూరి పుష్పలత, మేడిపల్లి గ్రామానికి చెందిన గుండ్ల రమ కుటుంబాలతో మంత్రి ఆత్మీయంగా మమేకమయ్యారు. కుటుంబ సభ్యులను పలకరిస్తూ పిల్లల చదువుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారికి దీపావళి శుభాకాంక్షలు తెలిపి బాణసంచా అందజేశారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి టపాసులు కాల్చి పండుగ సంబరాల్లో పాల్గొన్నారు. సొంతింటిలో తొలి దీపావళి జరుపుకుంటున్న లబ్ధిదారుల ఆనందంలో భాగస్వాములయ్యారు.ఈ సందర్భంగా మేడిపల్లిలో ప్రభుత్వం అందిస్తున్న ఉచిత సన్న బియ్యంతో లబ్ధిదారుల కుటుంబం వండిన భోజనాన్ని మంత్రి శ్రీధర్‌బాబు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ కలిసి ఆరగించారు. సన్న బియ్యం నాణ్యత, పథకం ద్వారా కుటుంబానికి కలుగుతున్న ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. భోజనం రుచిగా ఉందని, పేదలకు నాణ్యమైన ఆహారం అందించాలనే లక్ష్యంతోనే ఉచిత సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. ఒకప్పుడు ధనవంతులకే పరిమితమైన సన్న బియ్యం నేడు ప్రభుత్వ చర్యలతో పేదల ఇళ్లకూ చేరడం సంతోషకరమన్నారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఇళ్లు లేని నిరుపేదలకు దశలవారీగా సొంతింటిని అందించేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మంత్రివర్గ సహచరుల సమష్టి కృషితో పథకం ముందుకు సాగుతోందన్నారు. ఇందిరమ్మ రాజ్యం అంటే పేదల రాజ్యమని, ప్రతి నిరుపేద కుటుంబంలో సంతోషం నింపడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తయ్యేలా కలెక్టర్, గృహ నిర్మాణ శాఖ అధికారులు, మండల, గ్రామస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేస్తున్నారని అభినందించారు. కోవిడ్ సమయంలో ప్రజల సహకారంతో సమష్టిగా పోరాడినట్లుగానే ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే పరిస్థితులను కూడా ప్రభుత్వం, ప్రజలు కలిసికట్టుగా ఎదుర్కొంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం ధన్వాడ గ్రామ ప్రజలతో పాటు జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి జిల్లాలు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజలకు, రాష్ట్ర ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, సిరిసంపదలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజబాబు, గృహ నిర్మాణ శాఖ పీడీ శ్రీకాంత్, ఉపాధి హామీ పథకం రాష్ట్ర సభ్యుడు దండు రమేశ్, కాటారం మార్కెట్ కమిటీ చైర్మన్ పంతగాని తిరుమల, సర్పంచ్ ప్రవల్లిక, సింగిల్ విండో చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు

కాంగ్రెస్‌కు ఓటేసి పెద్ద తప్పు చేశాం..!

కామారెడ్డి ప్రతినిధి నవంబర్ 09 (సింగిడి)

గాంధారి: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి పెద్ద తప్పు చేశామని గిరిజన నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నమ్మి ఓట్లు వేస్తే, ఇప్పుడు తమ జీవనాధారమైన పోడు భూముల విషయంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని వారు వాపోయారు.కామారెడ్డి జిల్లా గాంధారి మండలం రామలక్ష్మణపల్లి గ్రామానికి చెందిన పలువురు గిరిజన రైతులు తమ పోడు భూముల సమస్యపై ఆందోళన వ్యక్తం చేశారు. తమ పూర్వీకుల కాలం నుంచి సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న భూముల విషయంలో అటవీశాఖ అధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ, సాగును నిలిపివేయాలని బెదిరిస్తున్నారని ఆరోపించారు.పోడు భూములే తమ కుటుంబాలకు ప్రధాన జీవనాధారమని, వాటిని కోల్పోతే తమ కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందని గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాల్సిన ప్రభుత్వం, గిరిజనుల హక్కులను కాపాడాలని వారు కోరారు.ఈ నేపథ్యంలో రామలక్ష్మణపల్లి గ్రామ సర్పంచ్ అనిల్ నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తమ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, సాగు చేసుకుంటున్న పోడు భూములను కాపాడేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అటవీశాఖ అధికారులతో మాట్లాడి తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.



హామీలు అమలు చేయాలి

గిరిజనుల జీవనాధారమైన పోడు భూముల సమస్యను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, అర్హులైన గిరిజన రైతులకు చట్టప్రకారం న్యాయం చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఒకవైపు గిరిజన సంక్షేమం గురించి మాట్లాడుతూనే మరోవైపు తమ సాగు భూముల విషయంలో ఇబ్బందులు ఎదురవుతుండటంపై వారు అసంతృప్తి వ్యక్తం చేశారు.ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి రామలక్ష్మణపల్లి గిరిజన రైతుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు. వారి వెంట గిరిజన నాయకులు ప్రకాష్ నాయక్ శీను కాంగ్రెస్ పార్టీ గ్రామ యూత్ అధ్యక్షులు గణేష్ శేఖర్ రాజు పాల్గొన్నారు.

రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు

కామారెడ్డి /లింగంపేట్ , నవంబర్ 09,(సింగిడి)

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి గౌరవ శ్రీ రేవంత్ రెడ్డి గారి జన్మదినం సందర్భంగా మండల్ అధ్యక్షులు సాయిరాం యాదవ్ గారి ఆధ్వర్యంలో ఈ సందర్భంగా గురుకుల పాఠశాలలో పిల్లల తో కేక్ కటింగ్ కార్యక్రమంలో పాల్గొని ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ముఖ్యమంత్రి జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాఠశాల పిల్లలు తో శుభాకాంక్షలు తెలియచయడం జరిగింది.ఇంటి కార్యక్రమం కి మండల్ అధ్యక్షులు సాయిరాం యాదవ్ లింగంపేట్ సర్పంచ్ కోవడ రవీందర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మైనారిటీ సెల్ రఫీయొద్దీన్ టౌన్ అధ్యక్షులు ఉపసర్పంచ్ ప్రసాద్ గౌడ్ ఇందిరమ్మ కమిటీ అధ్యక్షులు యాళ్లమయ్య వర్కింగ్ ప్రసిడెంట్ గుండా బాలకిషన్ మండల్ ప్రధాన కార్యదర్శి అర్షద్ sc సెల్ లీడర్ జల్దిపల్లి రాజు యాత్ నాయకులు సుప్పల రాజు శెంకర్ లక్ష్మినారాయణ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఓదార్పు యాత్రను విజయవంతం చేయండి

హనుమకొండ ప్రతినిధి నవంబర్ 9 (సింగిడి)



హనుమకొండ జిల్లా వ్యాప్తంగా మలిదశ తొలిదశ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఉద్యమించిన ఉద్యమకారుల ను ఒకతాటిపై తీసుకొచ్చి జిల్లా వ్యాప్తంగా ఓదార్పు యాత్రను నిర్వహించేందుకు ఈ నెల 13, 14,15 తేదీల్లో మూడు రోజులపాటు యాత్ర నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర చైర్మన్ గుడిమల్ల రవికుమార్ తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుల కోసం కేకే కమిటీని కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పటికీ ఉద్యమకారుల జీవితాల్లో వెలుగులు నిండలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా 250 గజాల ఇంటి స్థలం తో పాటు ఉద్యమకారులకు విద్య వైద్య పరంగా 10 శాతం రిజర్వేషన్ కల్పించాలని 25వేల రూపాయల పెన్షన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు అంతేకాకుండా కేకే కమిటీ ద్వారా నిజమైన మళ్లీ తొలి దశల్లో పోరాటాలు నిర్వహించిన ఉద్యమకారులను గుర్తించి వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యమ సమయంలో మృతి చెందిన ఉద్యమకారులను గుర్తించి వారి కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని గుర్తు చేశారు. ఉద్యమకారులకు ఇచ్చిన మాటను ప్రభుత్వం నిలుపుకోవాలని లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టి ప్రభుత్వానికి బుద్ధి చెప్పడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ మేడిపల్లి శ్యామ్ కృష్ణ మనోహర్, అశోక్ ,అనుముల రమేష్ ,స్వర్ణలత, పద్మ, ఉమా తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో 45 ఫిర్యాదులు స్వీకరణ

కామారెడ్డి ప్రతినిధి , నవంబర్ 9 (సింగిడి):



ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన ప్రతి ఫిర్యాదును అధికారులు బాధ్యతాయుతంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. విక్టర్ సూచించారు. కామారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి మొత్తం 45 ఫిర్యాదులను స్వీకరించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలకు పరిష్కారం లభిస్తుందనే ఆశతో ప్రజావాణికి వస్తారని, వారి సమస్యలను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా క్షుణ్ణంగా పరిశీలించాలని అన్నారు. ప్రతి ఫిర్యాదుపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, పరిష్కారానికి తీసుకున్న చర్యలను ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు.ప్రభుత్వ సేవలు ప్రజలకు పారదర్శకంగా, ఎలాంటి జాప్యం లేకుండా అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత సమయంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి చందర్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గుడిమెట్ వద్ద తృటిలో తప్పిన పెను ప్రమాదం!

అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు, కారు..
ఇద్దరికి స్వల్ప గాయాలు



కామారెడ్డి ప్రతినిధి , నవంబర్ 9 (సింగిడి): కామారెడ్డి జిల్లా గాంధారి మండలంలో సోమవారం ఉదయం రోడ్డు ప్రమాదం తృటిలో పెను విషాదాన్ని తప్పించింది. గుడిమెట్ గ్రామ శివారులో ఆర్టీసీ బస్సు, కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లాయి. ఈ ఘటనతో ప్రయాణికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు.వివరాల్లోకి వెళ్తే.. కామారెడ్డి నుంచి 16 మంది ప్రయాణికులతో ఆర్టీసీ బస్సు బాన్సువాడ వైపు వెళ్తోంది. ఈ క్రమంలో బస్సు వెనుక నుంచి వస్తున్న కారు ఓవర్‌టేక్ చేసే ప్రయత్నం చేయడంతో హడావుడి నెలకొంది. ఈ క్రమంలో రెండు వాహనాలు అదుపుతప్పి రోడ్డు కిందికి దూసుకెళ్లినట్లు సమాచారం.ఈ ప్రమాదంలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే వారిని చికిత్స నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే ఘటనా స్థలంలో అంబులెన్స్ అందుబాటులో లేక పోవడంతో క్షతగాత్రులను బస్సులోనే ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు సమాచారం.బస్సులో 16 మంది ప్రయాణికులు ఉండగా ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనతో గుడిమెట్ పరిసర ప్రాంతాల్లో కొద్దిసేపు ఆందోళన నెలకొంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.రోడ్లపై ఓవర్‌టేక్ చేసే సమయంలో వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో ప్రయాణికుల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టవద్దని స్థానికులు సూచిస్తున్నారు.

జిల్లాలో కరువు నివారణ చర్యలు చేపట్టాలి

తక్షణమే కరువు నివారణ చర్యలు అమలు చేయాలి

హనుమకొండ జిల్లా ప్రతినిధి నవంబర్ 9 (సింగిడి)



హనుమకొండ జిల్లా కార్యదర్శి వర్గ సమావేశం బొట్ల చక్రపాణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి జి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ..హనుమకొండ జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కరువు నివారణ చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.జిల్లాలో వర్షాభావ పరిస్థితులు, పంటల దిగుబడిపై ప్రభావం, సాగునీరు మరియు తాగునీటి కొరతతో రైతులు, వ్యవసాయ కార్మికులు, గ్రామీణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యవసాయం దెబ్బతినడంతో రైతులు ఆర్థికంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. హనుమకొండ జిల్లాలో కరువు మండలాలుగా ప్రకటించిన ప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లో కూడా గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని 14 రకాల వస్తువులను ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు అందించాలని ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు.రైతులకు పంట నష్టపరిహారం, పంట రుణాల రీషెడ్యూల్, వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ పనులు కల్పించడం, గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారం, పశువులకు మేత అందించడం వంటి చర్యలు వెంటనే చేపట్టాలి.ఈ నేపథ్యంలో జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, రైతులు, వ్యవసాయ కార్మికులు, గ్రామీణ ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు సిపిఎం హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నవంబర్ 12, 13 తేదీలలో జిల్లా వ్యాప్తంగా కరువు పర్యటనలు నిర్వహించనున్నది.ఈ పర్యటనల్లో సిపిఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొని కరువు పరిస్థితులను పరిశీలించి, ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లనున్నారు.ప్రభుత్వం ఇకనైనా నిర్లక్ష్యం వీడి తక్షణమే కరువు నివారణ చర్యలు చేపట్టాలని సిపిఎం హనుమకొండ జిల్లా కమిటీ డిమాండ్ చేస్తోంది.ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాగుల రమేష్, టి. ఉపులయ్య లు పాల్గొన్నారు



లబ్ధిదారుల ఇళ్లలో పండుగ వెలుగులు!
ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి దీపాలు వెలిగించిన గ్రామ ప్రజాప్రతినిధులు

బూర్గుల్‌లో 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి'

కామారెడ్డి నవంబర్ 09(సింగిడి)

కామారెడ్డి జిల్లా, గాంధారి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమం బూర్గుల్ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కుటుంబాలతో కలిసి గ్రామ ప్రజాప్రతినిధులు దీపావళి వేడుకల్లో పాల్గొని పండుగ సంబరాలను పంచుకున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సౌమ్య మోహన్, ఉపసర్పంచ్ శ్రీరామ్ సాయిలు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, సీనియర్ నాయకులు, పీఏసీఎస్ ఉత్తునూర్ డైరెక్టర్, గ్రామాభివృద్ధి కమిటీ పెద్దలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సర్పంచ్, ఇతర ప్రజాప్రతినిధులు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మమేకమై దీపాలు వెలిగించి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని పేర్కొన్నారు.సొంతింటి కల నెరవేరడంతో లబ్ధిదారుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తోందని, ఇల్లు అనేది కేవలం నాలుగు గోడల నిర్మాణం మాత్రమే కాదని, ప్రతి పేద కుటుంబానికి ఆత్మగౌరవం, భద్రతకు ప్రతీక అని నాయకులు అన్నారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నిండాలని, ప్రతి కుటుంబం సంతోషంగా పండుగలు జరుపుకోవాలనే ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంతో బూర్గుల్ గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.



రంగధాంపల్లిలో బాకీ రమేష్ కుటుంబానికి వంగ రాజేశ్వర్ రెడ్డి ఆర్థిక చేయూత

సిద్దిపేట ప్రతినిధి, నవంబర్ 09 (సింగిడి): సిద్దిపేట పట్టణంలోని రంగధాంపల్లి ప్రాంతానికి చెందిన బాకీ రమేష్ మృతి పట్ల వంగ రాజేశ్వర్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రమేష్ మృతి విషయం తెలుసుకున్న ఆయన బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా మృతుని కుటుంబానికి రూ.5,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కష్టకాలంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. కుటుంబానికి అండగా ఉంటానని, భవిష్యత్తులో ఏ అవసరం వచ్చినా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని భరోసా ఇచ్చారు.మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి మానవత్వాన్ని చాటుకున్న వంగ రాజేశ్వర్ రెడ్డిని స్థానికులు అభినందించారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడులు

కామారెడ్డి ప్రతినిధి నవంబర్ 09(సింగిడి)

కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండల పరిధిలో జూదం కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు ఆదివారం రాత్రి సదాశివనగర్ పోలీసులు మండలంలోని వివిధ గ్రామాల శివారుల్లో దాడులు నిర్వహించారు.విశ్వసనీయ సమాచారం మేరకు భూంపల్లి , పద్మాజీవాడి, మల్లుపేట్ గ్రామాల శివారుల్లో నిర్వహించిన దాడుల్లో జూదం ఆడుతున్న 13 మందిని పోలీసులు అదుపులోకి తీసుకుని, వారిపై మూడు కేసులు నమోదు చేశారు. ఈ దాడుల్లో నగదు, మొబైల్ ఫోన్లు, ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా ఎస్సై పుష్పరాజ్ మాట్లాడుతూ, జూదానికి బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని కుటుంబాలను రోడ్డున పడనీయొద్దని జూదం జీవితాన్ని చిన్నాభిన్నం చేసే వ్యసనాలకు యువత బంగారు భవిష్యత్తును పాడు చేసుకోవద్దని సదాశివ నగర్ ఎస్సై పుష్పరాజ్ సూచించారు చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై పోలీసుల నిఘా నిరంతరం కొనసాగుతుందని, జూదం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రజలు చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, ఇలాంటి కార్యకలాపాల గురించి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సదాశివ నగర్ ఎస్సై పుష్పరాజ్ కోరారు.

ఎడిటోరియల్

Editorial

పరమ విష్ణు భక్తుడు బలి

బలి పాడ్యమి సందర్భంగా?..

కార్తీక శుద్ధ పాడ్యమికి బలి పాడ్యమి అని పేరు. బలి చక్రవర్తికి ప్రీతికరమైన రోజు. బలి చక్రవర్తి కథను గూర్తి మహాభారతం, రామాయణం వంటి గ్రంధాలలోనే కాక బ్రహ్మపురాణం, కూర్మ పురాణం, మత్స్య పురాణం వంటి వానిలో కూడా ప్రస్తావన ఉంది. క్రీ.పూ 2వ శతాబ్దంలో పాణిని రాసిన అష్టాధ్యాయి 3. 1. 26 లో పతంజలి మహాభాష్యంలో బలి గురించి వివరణ ఉంది.

ప్రహ్లాదుని కొడుకు అయిన విరోచనుని కొడుకే బలి. మహా శూరుడు. ముల్లోకాలను గెలిచి దేవేంద్రుడు, తదితరులను అధీనంచేసుకుని వారి ఐశ్వర్యాలను కైవసం చేసుకున్నాడు. దాతృత్వంలో ప్రసిద్ధి చెందిన బలి వామన రూపంలో యాచన చేసిన విష్ణువుకు యాచన కోరుకోమని అంటాడు. అప్పుడు మూడడుగుల స్థలం ఇవ్వమని కోరుకుంటాడు. బలి వాగ్దానం చేసినంతనే విష్ణుమూర్తి త్రివిక్రమ రూపం ఎత్తి రెండు అడుగులతో ఆకాశం, భూగోళాన్ని వశం చేసుకుంటాడు. ఇక మూడో అడుగు ఎక్కడ పెట్టాలని అడిగినప్పుడు బలి తన శిరస్సును చూపుతాడు. దాంతో త్రివిక్రముడతనిని పాతాళానికి తొక్కేస్తాడు. బలి భార్య వింధ్యావళి పతిభిక్షను కోరగా విష్ణువు అనుగ్రహించి వారి కుటుంబానికి పాతాళలోకాన్ని వాసం చేసి, తాను అతడి వాకిట గదాధరుడుగా కావలికాచే వాడయ్యెను. బలి చక్రవర్తి చిరంజీవి.

వామనుడైన విష్ణువుకు మాట తప్పని మానధనుడైన బలిచక్రవర్తి తన సర్వస్వాన్ని దానం చేసిన సందర్భంగా సంతోషించిన విష్ణువు వరం కోరుకోమన్నాడు.
బలి చక్రవర్తి "దేవా!నా సర్వస్వాన్ని నీకు సమర్పించిన నాకోసం కోరడానికి ఏమి లేదు. లోకం కోసం ఒక వరం అర్థిస్తున్నాను. ఇష్టమైతే అనుగ్రహించు. నేను దానమిచ్చిన భూమిని వామనుడివై అంతటా ఆక్రమించావు. కనుక నీ మూడు అడుగులకు సంకేతంగా...ఆశ్వయుజ బహుళ చతుర్దశి, అమావాస్య, కార్తీక శుక్ల పాడ్యమి 3 రోజులు భూలోకంలో బలిచక్రవర్తి రాజ్యంగా ఉండాలి. నా రాజ్యంలో దీపదానం, దీప పూజ చేసే ఇంట్లో నీ భార్య లక్ష్మీదేవి శాశ్వతంగా ఉండాలి. నా రాజ్యంలో ఎవరి ఇంట అంధకారం ఉంటుందో వాళ్ళ ఇంట ఎప్పటికి చీకటే ఉండాలి" అన్నాడు.విష్ణువు తథాస్తు అన్నాడు.

బలిచక్రావర్తి కార్తీక శుద్ధ పాడ్యమి తాను పాలించిన భూలోకాన్ని చూడడానికి సాయంకాలం వస్తాడు. ఆయన వెంట గదాధరుడైన భగవంతుడు మహావిష్ణువు వస్తాడు. ఇలా భక్తుడూ, భక్తరక్షకుడైన భవంతుడు...ఇద్దరు వస్తారు కనుక వీధులు శుభ్రంగా ఉండి, ప్రతి ఇంటి ముంగిట దీపాలూ, మామిడి తోరణాలు, రంగు రంగుల ముగ్గులూ ఉండటం చూసి, తన రాజ్యంలో ప్రజలందరూ ఆనందం, ఉత్సాహం, భోగ భాగ్యాలతో హాయిగా ఉన్నారని బలి సంతోష పడతాడు. భగవంతుడు ఆనందిస్తాడు.అందుకే దీపావళి మరుసటి రోజు 'బలి పాడ్యమి 'అయ్యింది.

ఆ రోజు తెల్లవారు జామునే బలిచక్రవర్తిని పూజించాలి. బియ్యపు పిండితో బలిచక్రవర్తి బొమ్మ గీచి పూజ చేయవచ్చు. పూజ సమయంలో "బలిరాజ నమస్తుభ్యం విరోచనసుత ప్రభో, భవిష్యేంద్ర సురారాతే పూజేయం ప్రతిగృహ్యతాం" అని ప్రార్థించాలని, గోవర్ధన పూజ చేయాలని, ఆవులను అలంకరించి స్వేచ్ఛగా తిరగనివ్వాలని, శక్తి కొలది దానం చెయాలని చెప్తారు.

?-రాము కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494





శ్రీ కరమ్ ..శుభకరం ..కార్తీకం

కార్తీక మాసం లో ప్రతి పల్లె పట్టణం నగరంలోని ఆలయాలు హరిహరుల నామస్మరణతో మార్మోగనున్నాయి. రాత్రిళ్లు దీపాల వెలుగులు విరజిమ్మనున్నాయి. ఎంతో పవిత్రంగా భావించే కార్తీక మాసం నేటి నుండి ప్రారంభమైంది. శివకేశవులకు ప్రీతికరమైన మాసం వచ్చే నెల 8!వరకు కొనసాగనున్నది. ఈనెల రోజులు శైవ, వైష్ణవ క్షేత్రాలు పూజలు, భక్తుల సందడితో కిటకిటలాడనున్నాయి

కార్తీక మాసానికి సమానమైన మాసం లేదు. శ్రీమహావిష్ణువుకు సమానదేవుడు లేడు. వేదంతో సమానమైన శాస్త్రం లేదు. గంగతో సమానమైన తీర్థము లేదు..' సనాతన హిందూ ధర్మంలో కార్తీక మాసం విశిష్టత అర్థం చేసుకోవచ్చు. హైందవ మతంలో ఉత్తరాయణంలో మాఘ మాసం, దక్షిణాయనంలో కార్తీక మాసానికి ఎంతో విశిష్ట ఉంది. నేటి నుంచి కార్తీక మాసం ప్రారంభం కానుంది.

కార్తీకం తెలుగు మాసాల్లో చాలా ప్రత్యేకమైంది. దీన్ని ఆరోగ్య పరమైన మాసంగా, ప్రతిరోజూ పర్వదినంగా భావిస్తారు. పౌర్ణమి నాటి చంద్రుడు కృత్తిక నక్షత్రం సమీపంలో ఉదంటం వల్ల ఈ మాసానికి కార్తీక మాసంగా పేరు వచ్చింది. నెల రోజుల పాటు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు చేయనున్నారు. ఊరూరా శివాలయాలను ముస్తాబు చేస్తున్నారు. ప్రతి రోజూ ఉపవాసంతో పాటుగా దానాలు చేయడం రాత్రిళ్లు దీపాలు వెలిగించి శివున్ని పూజిస్తారు. అలాంటి పవిత్ర కార్తీక మాసం ఈ సంవత్సరం దీపావళి మరుసటి రోజున సోమవారం ప్రారంభం కాగా డిసెంబర్ 8 న ముగియనున్నది. ఈనెల రోజులు అత్యంత విశిష్టత కలిగి ఉంటాయి. స్నానాలు, ప్రతాలకు శుభకరం.

అయ్యప్ప దీక్ష కూడా ఈ నెలలోనే ప్రారంభమై మకర సంక్రాంతి వరకు కొనసాగుతుంది. హరిహరులను ఇద్దరినీ పూజించడం జరుగుతుంది. ఈ మాసంలో నారాయణ, కేదారేశ్వర స్వామి వ్రతాలు చేసుకుంటారు. ఏదాదశి, ద్వాదశి సోమవారాలు, పౌర్ణమి సోమవారం రోజు నియమ నిష్టలతో ఉపవాసం ఉండి 365ఒత్తులతో చేసే దీపారాధనతో పుణ్యఫలం సిద్ధిస్తుందని నమ్మకం. నువ్వుల నూనె దీపారాధనకు తప్ప ఏ అవసరాలకూ వాడకూడదు.దీపారాధనకు చాలా విశిష్టత ఉంది. ఒక్కరోజు దీపం వెలిగిస్తే ఎన్నో జన్మల పుణ్యం లభిస్తుందని నమ్మకం. ఆజ్ఞాన చీకట్లను తొలగించి జ్ఞానం అనే వెలుగులు నింపుకోవాలన్నదే దీపం ప్రత్యేకత. నలుగుతో స్నానం చేయరాదు. మహిళలకు ప్రత్యేకమైనదిగా కార్తీక మాసం నిలిచిపోతుంది. ఉసిరి చెట్టుకింద దీపాలను వెలిగించి పూజలు చేసుకుంటారు. ఉదయం, సాయంత్రం దీపారాధన చేస్తే చాలా మంచిది. సూర్యోదయం కంటే ముందుగా లేచి స్నానం చేయాలి. సోమవారాలు అత్యంత పవిత్రం. కనీసం సోమవారాలు పూజలు చేసినా ఫలం లభిస్తుంది. ఈసారి నాలుగు కార్తీక సోమవారాలు ఉంటాయి. శివుడికి ప్రత్యేకంగా రుద్రాభిషేకం, లక్షబిల్వార్చ, అమ్మవారికి లక్షకుంకుమార్చన జరిపిస్తారు.నవంబర్ 11 న యమ ద్వితీయ భగినీ హస్త భోజనం, 13 న నాగుల చవితి, నవంబర్ 14 నాగ పంచమి 15 న సుబ్రమణ్య షష్ఠి ,నవంబర్ 16 మొదటి కార్తీక సోమవారం 17 న గోపాష్టమి 20 న ఉత్పన ఏకాదశి 21 న క్షీరాబ్ధి ద్వాదశి
22 ప్రదోష వ్రతం 24 న కార్తీక పౌర్ణమి గురునానక్ జయంతి 30 న మూడవ సోమవారం డిసెంబర్ 4 న ఉత్పన్న ఏకాదశి డిసెంబర్ 8 న కార్తీక మాసం ముగింపు వుంటుంది మాసంలో చాలా మంది మద్యం,మాంసాహారానికి దూరంగా ఉంటారు.

లి తేలికైన ఆహారం భూజించడం
లి ఉల్లి, వెల్లుల్లి తీసుకోవద్దు.
లి పాలు, పండ్లు భుజించవచ్చు.
లి రాత్రి భోజనం చేయకూడదు.
అబద్ధాలు, దైవదూషణ చేయరాదు.

అసత్యాలు మాట్లాడకూడదని, తప్పుడు పనులు చేస్తే పాపమని పురాణాలు చెబుతున్నాయి.

ఓం నమశివాయ హర హర మహదేవ్ శంభో శంకర

-కామిడి సతీశ్ రెడి
భూపాల్‌పల్లి జిల్లా
9848445134

తెలుగు భాషకు చార్లెస్ బ్రౌన్ ఎనలేని సేవ

నవంబర్ 10...చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ జయంతి

పరదేశీయుడైనా, ఆంగ్ల భాష మాతృభాష అయినా, బహు భాషవేత్త అయి ఉండీ, ఈస్ట్ ఇండియా కంపెనీ ఉద్యోగిగా భారత దేశానికి వచ్చి, విధి నిర్వహణ కోసం తెలుగు భాష నేర్చుకుని, నాటికి కరడుగట్టి, మినుకు మినుకు మంటూ, ఆరి పోవడానికి సిద్ధంగా ఉన్న తెలుగు భాష ఉద్ధరణకు బ్రౌన్ తీసుకున్న చొరవ ప్రశంసనీయం. ఆంగ్లేయులు పురాణాలను ప్రచురించడం, వ్యాఖ్యానాలు రాయించడం, తెలుగు నేర్చు కోవడం కోసం వాచకాలు, వ్యాకరణ గ్రంథాలు రాయడం, ప్రచురించడం, సహస్రాధిక వేమన పద్యాలను వెలికితీసి ప్రచురిం చడం, పాఠశాలలు స్థాపించి, ఉచిత విద్య నేర్చుకునే అవకాశం కల్పించడం, ప్రాచీన గ్రంథాలను అర్థం చేసుకోవడానికి ఏకంగా నిఘంటువుని అందించడం ద్వారా తెలుగు భాషా, సాహిత్య వికాసానికి బ్రౌన్ అందించిన సేవ అమోఘం, అపూర్వం, అస మానం అనితర సాధ్యం.



చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ (నవంబర్ 10, 1798 – డిసెంబర్ 12, 1884) తెలుగు సాహిత్యమునకు విశేష సేవ చేసిన ఆంగ్లేయుడు. తొలి తెలుగు శబ్దకోశమును ఆయనే పరిష్కరించి ప్రచురించాడు. బ్రౌన్ డిక్షనరీని ఇప్పటికి తెలుగులో ప్రామాణికంగా ఉపయోగిస్తారు.

సి. పి. బ్రౌన్ 1798 నవంబర్ 10న కలకత్తాలో జన్మించాడు. ఈయన తండ్రి డేవిడ్ బ్రౌన్ పేరొందిన క్రైస్తవ విద్వాంసుడు. తండ్రి మరణించిన తరువాత బ్రౌను కుటుంబం ఇంగ్లండు వెళ్ళిపోయింది. తండ్రి ఇచ్చిన స్ఫూర్తితో సీపీ బ్రౌన్ గ్రీక్, లాటిన్, పారశీ, సంస్కృత భాషల్లో ఆరితేరాడు, బ్రౌను అక్కడే హిందూ స్థానీ భాష నేర్చుకున్నాడు. తరువాత 1817 ఆగష్టు 4 న మద్రాసులో ఈస్ట్ ఇండియా కంపెనీలో ఉద్యోగంలో చేరాడు. ఉద్యోగ బాధ్యతల్లో భాగంగా మద్రాసులో కోదండరామ పంతులు వద్ద తెలుగులో ప్రాథమిక జ్ఞానాన్ని సంపాదించాడు.

1820 ఆగస్టులో కడపలో డిప్యూటీ కలెక్టరుగా చేరాడు. ఉద్యోగరీత్యా అనేక ప్రాంతాల్లో పని చేసినపుడు తెలుగులో మాట్లాడడం తప్పనిసరి అయింది. అయితే తెలుగు నేర్చు కోడానికి సులభమైన, శాస్త్రీయ మైన విధానం లేక పోవడం వలన, పండితులు తమ తమ స్వంత పద్ధతులలో బోధిస్తూ ఉండేవారు. తెలుగేతరులకు ఈ విధంగా తెలుగు నేర్చుకోవడం ఇబ్బందిగా ఉండేది. భాష నేర్చుకోవడం లోని ఇబ్బంది, బ్రౌనును తెలుగు భాషా పరిశోధనకై పురికొల్పింది. ప్రాచీన తెలుగు కావ్యాలను వెలికితీసి, ప్రజలందరికీ అర్థమయ్యేలా పరిష్కరించి, ప్రచురించడం, భాషకు ఓ వ్యాకరణం, ఓ నిఘంటువు, ఏర్పడడానికి దారి తీసింది. మచిలీపట్నం, గుంటూరు, చిత్తూరు, తిరునెల్వేలి మొదలైన చోట్ల పనిచేసి, 1826లో మళ్ళీ కడపకు తిరిగి వచ్చి అక్కడే స్థిర నివాస మేర్పరచు కొన్నాడు.

కడపలోను, మచిలీపట్నంలోను కూడా పాఠశాలలు పెట్టి ఉచితంగా చదువు చెప్పించాడు. విద్యార్థులకు ఉచితంగా భోజన వసతి కూడా కల్పించాడు. 1834లో ఉద్యోగం నుండి తొలగించడంతో ఇంగ్లండు వెళ్ళిపోయి, తిరిగి 1837లో కంపెనీలో పర్షియను అనువాద కుడిగా భారత దేశానికి వచ్చాడు.

1827 నాటికే, బ్రౌన్ 'ఆంధ్ర గీర్వాణ ఛందము' అనే పుస్తకం రానిసప్పటికీ, ఆయనకు మంచి గుర్తింపు తెచ్చిన పుస్తకం 1829 నాటి 'వేమన శతకం'. అప్పటికి బ్రౌన్ అయిదేళ్లుగా వేమన సాహిత్యాన్ని అధ్యయనం చేస్తూ ఉన్నారు. ఇందులో దాదాపు 700 పద్యాలకు ఆంగ్లాను వాదాలతో పాటు విస్తృతమయిన పదకోశం కూడా సమకూర్చారు. మరో పదేళ్ల తర్వాత, 1164 పద్యాల వరకు విస్తరింపచేసి, తిరిగి 'వేమన శతకం' అచ్చువేశాడు. పదవీ విరమణ తరువాత 1854లో లండన్‌లో స్థిరపడి, 1865లో లండన్ యూనివర్సిటీలో తెలుగు ప్రొఫెసరుగా నియమితుడైనాడు.

బ్రౌన్ కొలువులో తొలి తెలుగు కథకుడు తాతాచారి అనే పేరుతో ప్రాచుర్యం పొందిన నేలటూరు వేంకటాచలం. తాతాచారి చెప్పిన కథలను విన్న సి. పి. బ్రౌన్ అందులోంచి 24 కథలను, దానితోపాటు శ్రీకృష్ణమాచారి చెప్పిన రెండు కథలను కలిపి 1855లో పుస్తకంగా ముద్రించారు. 1916లో 'తాతాచారి కథలు ' గిడుగు వేంకట అప్పారావు సంపాదకత్వంలో ద్వితీయ ముద్రణ పొందాయి. 1951లో వావిళ్ల వారి తృతీయ ముద్రణ, 1974లో బంగోరె సంపాదకుడిగా చతుర్థ ముద్రణ పొందాయి. 1848లో చెన్నపట్నం వెళ్లి బ్రౌను కొలువులో ఏడేళ్లు పల్నాటి వీర చరితం, వసు చరిత్ర మొదలైన గ్రంథా ల పరిష్కార కృషిలో ఆయనకు సాయపడ్డారు. తాతాచార్యులు కావ్య తర్క వ్యాకరణముల యందు ప్రవీణత గలవాడు. తాతాచారి కథలు నీతి బోధకాలే కాక, ఆనాటి సామాజిక స్థితికి దర్పణంగాను ఉన్నాయి. అందులోని శైలి శుద్ధ వ్యావహారికం అయిన కారణంగా పండిత శైలికి దూరంగా ఉందనే బ్రౌన్ ప్రశంసకు యోగ్యమైంది.

బ్రౌన్ వేమన పద్యాలను వెలికితీసి ప్రచురించాడు. 1829లో 693 పద్యాలు, 1839లో 1164 పద్యాలు ప్రచురించాడు. 1841లో "నలచరిత్ర"ను ప్రచురించాడు."ఆంధ్ర మహా భారతము", "శ్రీమద్భాగవతము" లను ప్రచురించాడు. తెలుగు నేర్చుకునే ఆంగ్లేయుల కొరకు వాచకాలు, వ్యాకరణ గ్రంథాలు రాసాడు. 1840లో వ్యాకరణాన్ని ప్రచురించాడు. లండన్‌లోని "ఇండియాహౌస్ లైబ్రరీ"లో పడి ఉన్న 2106 దక్షిణభారత భాషల గ్రంథాలను మద్రాసు తెప్పించాడు. "హరిశ్చంద్రుని కష్టాలు" గౌరన మంత్రిచే వ్యాఖ్యానం వ్రాయించి 1842లో ప్రచురించాడు. 1844లో "వసుచరిత్ర"', 1851లో "మను చరిత్ర" ప్రచురించాడు. జూలూరి అప్పయ్య శాస్త్రి చేత వీటికి వ్యాఖ్యానాలు రాయించాడు. 1852లో "పలనాటి వీరచరిత్ర" ప్రచురించాడు.

పందొమ్మిదో శతాబ్ది తొలి చివర్లో తాను తెలుగు సాహిత్యంలో కృషి మొదలు పెట్టే నాటికి నెలకొని వుండిన స్థితిగతులను గురించి బ్రౌన్ స్పుటమయిన మాటల్లో అభివర్ణించాడు. 'అప్పటికి తెలుగు సాహిత్యం కొనప్రాణంతో కొట్టుకు మిట్టాడుతోంది. 1825 నాటికి ప్రమిదలో దీపం కొడిగట్టి పోతోంది. తెలుగు సాహిత్యం దాదాపు అంతరించి పోతూ ఉండడం నా కళ్లబడింది. నేను 30 ఏళ్లు కృషి చేసి, దాన్ని పునఃప్రతిష్ట చేశాన'న్నాడు బ్రౌన్. తెలుగు భాషాభివృద్ధికి ఇతోధిక సేవలు అందించి, మరచిపోలేని కృషి సల్పిన బ్రౌన్ 1884 డిసెంబర్ 12 న తన స్వగృహము 22 కిల్డారే గార్డెన్స్, వెస్ట్‌బార్న్ గ్రోవ్, లండన్లో అవివాహితుని గానే బ్రౌన్ మరణించాడు. ఆయనను కెన్సెల్ గ్రీన్ శ్మశానంలో సమాధి చేశారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494

తెలంగాణ సహజ కవి అందె శ్రీ

(10 నవంబర్ "ప్రముఖ కవి అందె శ్రీ ప్రథమ వర్ధంతి" సందర్భంగా అక్షర నివాళి)

18 జూలై 1961 రోజు వరంగల్ జిల్లా మద్దూరు మండలంలోని రేబర్తి గ్రామంలో జన్మించిన అందె ఎల్లయ్య, ఆశు కవిగా ఖ్యాతి గడిస్తున్న వేళ అందె శ్రీ అనే పేరుతో ముద్దుగా పిలుచుకుంటున్నది. మన తెలంగాణ. అనాథగా పెరుగుతూ, గొడ్ల కాపరిగా శ్రమించిన అందె శ్రీ సాంప్రదాయ చదువులు చదువుకోక పోయినా అనంతర కాలనీలో అనూహ్యంగా కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ పొందే స్థాయికి ఎదగడం ఆశ్చర్యకరం, అభినందనీయం. అక్షరం ముక్కరాని ప్రకృతి కవి, బడి మొహం ఎరుగని రాష్ట్ర గీత ప్రదాత మన అందె శ్రీ. ఆయన ఆశువుగా పాడిన కవితలు తెలంగాణ ఉద్యమానికి ఊపిరిగా నిలిచాయి. తాపీ పని కోసం నిజామాబాద్? వెళ్లినపుడు, అక్కడి శృంగేరీ మఠానికి చెందిన శంకర్ మహరాజ్ స్వామి చొరవతో కవిగా కొత్త అవతారం ఎత్తి తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని రగిలించారు. పల్లె జనుల నాలుకల మీద సర్వసాధారణ పేరుగా మారిపోయారు. నారాయణ మూర్తి ఉద్యమ సినిమాల్లో పాటలు అందించిన అందె శ్రీ తెలంగాణ బతుకు వెతలు, కమనీయ ప్రకృతి పదనిసల కూర్పులతో పలు ప్రఖ్యాత కవితలు రాశారు. అశు కవిత్వంలో దిట్ట అయిన అందె శ్రీ గంగ సినిమాకు గాను నంది పురస్కారం అందుకున్నారు.



తెలంగాణ రాష్ట్ర గీత అక్షర శిల్పి:
"జయ జయహే తెలంగాణ, జననీ జయ కేతనం" అంటూ ఆయన రాసిన పాట తెలంగాణ రాష్ట్ర గీతంగా నిత్యం విద్యాలయాల్లో భక్తి పూర్వకంగా పాడుకోవడం జరుగుతోంది. బతుకమ్మ సినిమాకు సంభాషణలు, పలు సినిమాల్లో కూడా పాటల రచయితగా సుస్థిర స్థానం సంపాదించుకున్నారు. "మాయమై పోతున్నడమ్మో మనిషన్నవాడు" అంటూ మానవీయత లేని సమాజాన్ని జాగృత పరచడం, "కొమ్మ చెక్కితే బొమ్మరా" అంటూ వచన కవిత్వం రాసినా అందె శ్రీకే ఆ ఘనత దక్కుతుంది. పెల్లె తల్లి ఒడిలో ఎదిగిన తన అనుభవాన్ని "పల్లె నీకు వందనమమ్మో" అంటూ ఊరును కీర్తించిన తీరు మనసులకు హత్తుకుంటుంది.

అందె శ్రీని వరించిన పురస్కారాలు:
2014లో తెలంగాణ ప్రభుత్వం ఆయన ప్రతిభను గుర్తించి పద్మశ్రీ అవార్డుకు ప్రతిపాదించడం జరిగింది. ఆయన రాసిన కవిత్వం పలు విశ్వవిద్యాలయాల పాఠ్యాంశాల్లో చేర్చబడ్డాయి. కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేటు, వంశీ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ నుంచి దాశరథి సాహితీ పురస్కారం, డాక్టర్ రావూరి భరద్వాజ్ సాహితీ పురస్కారం, నంది పురస్కారం, సుద్దాల హన్మంతు – జానకమ్మ జాతీయ పురస్కారం, దాశరథి కృష్ణమాచార్య సాహితీ పురస్కారం, లోక్ నాయక్ పురస్కారం లాంటి అనేక పురస్కారాలు ఆయన ఒడిని చేరి పులకించిపోయాయి. 10 నవంబరు 2025న తీవ్ర అస్వస్థతతో హైదరాబాద్ నగరంలో గాంధీ ఆసుపత్రికి చేరి చికిత్స పొందుతూ, దురదృష్టవశాత్తూగా తుది శ్వాస విడిచారు.

ప్రకృతి మాతే ఆయన ఏకైక గురువు:
ఆయన జీవితం స్ఫూర్తిదాయకం, ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన అగ్రశ్రేణి కవి. ప్రకృతి మాతో ఆయన గురువు. గొడ్డుగోదలే ఆయన కవితా వస్తువులు. తెలంగాణ ఆత్మను ఆవిష్కరించే సహజ ఆశు కవి అందె శ్రీ. ఏ నాడు బడి దారి పట్టకపోయినా, అక్షరం ముక్క రాకపోయినా, తెలంగాణ సాహిత్యానికి చుక్కానిగా, పల్లె పాటల చిరునామాగా నిలిచిన అందె శ్రీ ముక్కోటి తెలంగాణ హృదయాంతరంగాలో శాశ్వత స్థానం పొందారు. పశుసంపద కాపరి నుంచి డాక్టరేట్ వరకు, నిరక్షరాస్యుడి నుంచి రాష్ట్ర గీత రూపశిల్పి వరకు అందె శ్రీ ప్రస్థానం అద్భుతం, అనన్యసామాన్యం.

తెలంగాణ జనుల తల్లి కళ్లు చెమ్మగిల్లిన వేళ అందె శ్రీకి ఇవే మా అక్షర నివాళులు.

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037



బాలసదన్ చిన్నారులతో సీపీ దీపావళి సంబరాలు

సిద్దిపేట ప్రతినిధి, నవంబరు 09 (సింగిడి): దీపావళి పండుగను పురస్కరించుకొని సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్, కొండపాక మండల కేంద్రంలోని నిశాంత్ ఆనంద బాలసదన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా బాలసదన్‌లోని చిన్నారులతో కలిసి దీపావళి వేడుకల్లో పాల్గొని పండుగ శుభాకాంక్షలు తెలిపారు.చిన్నారులకు మిఠాయిలు, నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. అనంతరం వారితో కొద్దిసేపు ముచ్చటించి, వారి యోగక్షేమాలు, సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకుంటామని, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటుందని సీపీ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బాలసదన్ నిర్వాహకులు, ఇన్‌స్పెక్టర్ లతీఫ్, తోగుట సీఐ శ్రీను, కుకునూరుపల్లి ఎస్ఐ. బాలకృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు...



రూ.10 లక్షల కోసం దాడి
జైలు పరిచయంతో పక్కా స్కెచ్..
నలుగురు నిందితుల అరెస్ట్ మరోసారి కిడ్నాప్‌నకు యత్నిస్తుండగా పోలీసులకు చిక్కిన నిందితులు

హార్వెస్టర్ లీజు పేరుతో కిడ్నాప్







కామారెడ్డి,ప్రతినిధి నవంబర్09 (సింగిడి): హార్వెస్టర్ మిషన్లను లీజుకు ఇస్తామని నమ్మించి ఓ వ్యక్తిని కారులో కిడ్నాప్ చేసి, రూ.10 లక్షలు ఇవ్వాలని బెదిరించిన నలుగురు నిందితులను దోమకొండ పోలీసులు అరెస్టు చేశారు. జైలులో ఏర్పడిన పరిచయాన్ని ఆసరాగా చేసుకుని సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో పక్కా ప్రణాళిక రూపొందించి ఈ నేరానికి పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు. బాధితుడిని కిడ్నాప్ చేసి దాడికి పాల్పడటంతో పాటు అతని వద్ద ఉన్న నగదు, సెల్‌ఫోన్‌ను అపహరించిన నిందితులు.. మరోసారి అతడిని కిడ్నాప్ చేసి డబ్బులు వసూలు చేసేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులకు పట్టుబడ్డారు. జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర కేసు వివరాలను వెల్లడించారు.నమ్మించి కారులో ఎక్కించుకుని కిడ్నాప్చోనాపూర్ గ్రామానికి చెందిన చిందం మహేష్ (32) వరి కోత హార్వెస్టర్ మిషన్లను లీజుకు తీసుకుని నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో నిందితుల్లో ఒకరు కరుణాకర్ రెడ్డి అనే నకిలీ పేరుతో మహేష్‌కు పరిచయమయ్యాడు. తమ వద్ద హార్వెస్టర్ మిషన్లు ఉన్నాయని, వాటిని లీజుకు ఇస్తామని నమ్మించాడు. సుమారు నెల రోజుల పాటు ఫోన్‌లో మాట్లాడుతూ బాధితుడి నమ్మకాన్ని పొందాడు.అనంతరం ముందస్తు ప్రణాళిక ప్రకారం అక్టోబర్ 22న నిందితులు తెల్లరంగు మారుతి ఎర్టిగా కారులో కోనాపూర్ గ్రామానికి చేరుకున్నారు. హార్వెస్టర్ మిషన్లు చూపిస్తామని చెప్పి మహేష్‌ను తమ వద్దకు పిలిపించి కారులో ఎక్కించుకున్నారు. కొంతదూరం వెళ్లిన తర్వాత అతడిని బెదిరిస్తూ దాడికి పాల్పడి రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డబ్బులు ఇవ్వకపోతే చంపేస్తామని హెచ్చరించినట్లు ఎస్పీ వెల్లడించారు.నగదు, సెల్‌ఫోన్ అపహరణ.. తప్పించుకున్న బాధితుడుకిడ్నాప్ చేసిన సమయంలో బాధితుడి ముఖానికి ఉన్ని టోపీని మాస్కులా తొడిగి, అతడిపై దాడి చేశారు. అనంతరం అతని వద్ద ఉన్న పోకో ఎం6 5జీ సెల్‌ఫోన్‌తో పాటు పర్సులోని రూ.2,500 నగదును బలవంతంగా లాక్కున్నారు. కారులో వివిధ ప్రాంతాలకు తిప్పుతూ తమకు డబ్బులు తెప్పించాలని ఒత్తిడి చేశారు.ఈ క్రమంలో నిందితులు మద్యం సేవించి ఇందల్వాయి వద్ద ఓ హోటల్ సమీపంలో కారును నిలిపి నిద్రలోకి జారుకున్నారు. ఇదే అవకాశంగా భావించిన మహేష్ వారి చెర నుంచి తప్పించుకుని ఇందల్వాయి బస్‌స్టాండ్‌కు చేరుకున్నాడు. అక్కడి నుంచి తన గ్రామస్థులకు సమాచారం అందించి, అనంతరం దోమకొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.పోలీసులను తప్పుదోవ పట్టించే ప్రయత్నంకిడ్నాప్ ఘటన అనంతరం తమ నేరాన్ని కప్పిపుచ్చుకునేందుకు నిందితులు మరో ఎత్తుగడ వేశారు. గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు ఫోన్ చేసి తాము బీహార్‌కు చెందిన వారమని, బాధితుడు తమ మహిళలతో అసభ్యంగా ప్రవర్తించడంతో అతడిని బెదిరించి వదిలేశామని తప్పుడు సమాచారం అందించారు. ఈ విధంగా పోలీసులను, గ్రామస్థులను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.మరోసారి కిడ్నాప్‌కు పథకం.. ఎల్లమ్మ గుడి వద్ద అరెస్టౌటసారి కిడ్నాప్ సమయంలో బాధితుడు తీవ్ర భయాందోళనకు గురై తనకు ఎలాంటి హాని చేయవద్దని, అడిగినంత డబ్బు ఇస్తానని చెప్పడంతో నిందితులు మరోసారి అతడిని కిడ్నాప్ చేసి డబ్బులు వసూలు చేయాలని నిర్ణయించుకున్నారు.ఈ పథకంలో భాగంగా నవంబర్ 9న అదే కారును అద్దెకు తీసుకుని కోనాపూర్ గ్రామ శివారులోని ఎల్లమ్మ గుడి వద్దకు చేరుకున్నారు. అక్కడ అనుమానాస్పదంగా ఉన్న కారును పోలీసులు గుర్తించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. విచారణ చేపట్టగా గతంలో జరిగిన కిడ్నాప్, దోపిడీ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.జైలు పరిచయమే నేరానికి పునాదినిందితులు నిట్టూ నర్సింగరావు, ఎరుగు నగేష్, చిందం శ్రీకాంత్ గతంలో జైలులో ఉన్న సమయంలో పరిచయమయ్యారు. జైలు నుంచి విడుదలైన తర్వాత సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఆర్థికంగా స్థితిమంతుడైన వ్యక్తిని లక్ష్యంగా చేసుకుని కిడ్నాప్ చేయాలని పథకం రూపొందించారు.ఈ క్రమంలో బాధితుడికి ముందే పరిచయమున్న చిందం శ్రీకాంత్ కీలక పాత్ర పోషించాడు. మహేష్‌తో పాటు అతని కుటుంబ సభ్యుల కదలికలు, పోలీసులకు ఫిర్యాదు చేసిన వివరాలను ఇతర నిందితులకు చేరవేసినట్లు పోలీసులు తెలిపారు. దీంతో బాధితుడిని లక్ష్యంగా చేసుకుని కిడ్నాప్‌కు పాల్పడినట్లు విచారణలో తేలింది.నలుగురు అరెస్ట్.. వాహనాలు, ఫోన్లు స్వాధీనంఈ కేసులో నిట్టూ నర్సింగరావు, ఎరుగు నగేష్ అలియాస్ నాయేష్, తెడ్డూ సురేష్, చిందం శ్రీకాంత్‌లను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి కిడ్నాప్‌కు ఉపయోగించిన మారుతి ఎర్టిగా కారు (టీఎస్ 16 ఈఎఫ్ 8889), బాధితుడి నుంచి అపహరించిన సెల్‌ఫోన్, నిందితుల నాలుగు మొబైల్ ఫోన్లు, బాధితుడి ముఖానికి ఉపయోగించిన ఉన్ని టోపీ, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.ప్రత్యేక బృందాలతో కేసు ఛేదనజిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు కామారెడ్డి డీఎస్పీ మధుసూదన్ పర్యవేక్షణలో భిక్కనూర్ సీఐ నరేష్, దోమకొండ ఎస్సై ప్రభాకర్ ఆధ్వర్యంలో రెండు ప్రత్యేక పోలీసు బృందాలు దర్యాప్తు చేపట్టాయి. సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ కెమెరాల పరిశీలనతో నిందితుల కదలికలను గుర్తించి పట్టుకున్నారు. కేసును ఛేదించడంలో చురుగ్గా పనిచేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతి



సిద్దిపేట ప్రతినిధి, నవంబరు 09 (సింగిడి): పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న ఉద్యోగులు సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఇతర విధానాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పెండింగ్ వేతనాల కారణంగా ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. ఉద్యోగ భద్రత కల్పించి, తమ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి, పూర్తి విచారణ జరిపించి సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం డీసీఈఓ శ్యామలతకు సమస్య పరిష్కార బాధ్యతలు అప్పగించారు. ఆమె కూడా సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు ఉద్యోగులు తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ పుల్లగుర రాజిరెడ్డి, రాష్ట్ర జేఏసీ ఉపాధ్యక్షుడు పొన్నముల యాదగిరి, రవీందర్, నవీన్ కుమార్, యాదయ్య, మనీష్, అజయ్ కుమార్, రాధిక, శైలజ, కవిత తదితరులు పాల్గొన్నారు.



19న రేవంత్ రెడ్డి పర్యటన..
ఏర్పాట్లపై కలెక్టర్ కసరత్తు

సిద్దిపేట ప్రతినిధి, నవంబరు 09 (సింగిడి): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 19న సిద్దిపేట జిల్లా కేంద్రానికి రానున్న నేపథ్యంలో భారీ బహిరంగ సభ ఏర్పాట్లకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. సభ నిర్వహణకు అనువైన స్థలాల ఎంపికపై జిల్లా కలెక్టర్ కె. హైమావతి సోమవారం క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు.జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆయుష్ వైద్య ఆసుపత్రి సమీప స్థలం, పాత ఎల్లంకి ఇంజినీరింగ్ కళాశాల మైదానం, బూరుగుపల్లి–చిన్నగుండవెల్లి మార్గం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం, పాత పుల్లూరు రోడ్డు బైపాస్ సమీపంలోని స్థలం, నాగదేవత గుడి చౌరస్తా, ఆధునిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం పక్కన ఉన్న ప్రదేశాలను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యే అవకాశం ఉన్నందున సభా ప్రాంగణం, వాహనాల పార్కింగ్, వీఐపీ పార్కింగ్, హెలిప్యాడ్, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలకు అనువైన స్థలాన్ని ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు.పోలీసు, రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకొని అన్ని ఏర్పాట్లకు అనువుగా ఉండే స్థలాన్ని ఖరారు చేస్తామని వెల్లడించారు.కలెక్టర్ వెంట సిద్దిపేట ఆర్డీవో సదానందం, ట్రీటౌన్ సీఐ లక్ష్మి బాబు, తహసీల్దార్ తదితరులు ఉన్నారు.

సీఎం సభకు స్థలాల పరిశీలన



పదవులు వస్తుంటాయి... పోతుంటాయి... కానీ ప్రజల గుండెల్లో నిలిచిపోయే పేరు చరిత్రలో చిరస్థాయిగా ఉంటుంది!తెల్లటి వస్త్రాల్లో ప్రత్యేకమైన రాజసం... నడకలో ఆత్మవిశ్వాసం... మాటలో తెలంగాణ ఆత్మ గౌరవం... ఆ పేరే కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్)! తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమించిన నాయకుడు... ప్రత్యేక రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన నాయకుడు... తెలంగాణ రాజకీయ చరిత్రలో తనదైన ముద్ర వేసిన వ్యక్తి! గెలుపోటములు రాజకీయాల్లో సహజం... కానీ ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పే అంతిమం.మౌనం బలహీనత కాదు... ఆలోచనకు సమయం!రాజకీయ ప్రయాణంలో ఒడిదుడుకులు సహజం... పోరాటమే మా పంథా!తెలంగాణ ఆత్మ గౌరవం, ప్రజల ఆకాంక్షలు, రాష్ట్ర భవిష్యత్తుపై చర్చ కొనసాగాలి.

కామారెడ్డి,ప్రతినిధి నవంబర్09 (సింగిడి)

ప్రజావాణి అర్జీల పరిష్కారంలో జాప్యం వద్దు

81 దరఖాస్తులు స్వీకరణ..
ప్రతి అర్జీ వివరాలు నమోదు చేయాలి: కలెక్టర్ కె.హైమావతి

సిద్దిపేట ప్రతినిధి, నవంబరు 09 (సింగిడి): ప్రజావాణిలో ప్రజల నుంచి స్వీకరించే ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు. అర్జీల పరిష్కారానికి తీసుకున్న చర్యల వివరాలను తప్పనిసరిగా రికార్డుల్లో నమోదు చేయాలని స్పష్టం చేశారు.సోమవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 81 దరఖాస్తులను స్వీకరించారు. ఆయా సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులకు సూచనలు జారీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణికి వస్తుంటారని, వారి అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా బాధ్యతాయుతంగా పరిశీలించాలన్నారు. ప్రతి దరఖాస్తును నమోదు చేసి భద్రపరచాలని సూచించారు. మండల, డివిజన్ స్థాయిల్లో స్వీకరించిన అర్జీల పరిష్కారంపైనా జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వాటి పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు.కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మీకిరణ్, జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.



సిద్దిపేట జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

ట్రాక్టర్ - కారు ఢీకొని తండ్రి కూతురు మృతి

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 09, (సింగిడి): సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పందిళ్ల గ్రామం సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. వేగంగా వచ్చిన కారు ట్రాక్టర్ ఒకదానికి ఒకటి బలంగా ఢీ కొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది.ఈ ఘోర ప్రమాదంతో ఘటన స్థలంలోనే ఇద్దరు ప్రాణాలు కోల్పోగా పలువురు తీవ్రంగా గాయపడ్డారు. తండ్రి కూతుర్ల దుర్మరణం..ఈ దుర్ఘటనలో కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం కొండాపూర్‌కు చెందిన పైడిపల్లి శ్రీకాంత్ (35) ఆయన ఏడేళ్ల కుమార్తె మహిరి (7) అక్కడికక్కడే మృతి చెందారు. కళ్ళముందే చిన్నారి భర్త ప్రాణాలు కోల్పోవడంతో ఆ కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి ప్రమాద తీవ్రతకు కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది.మరో ముగ్గురికి తీవ్ర గాయాలు..ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న మరో ముగ్గురికి బలమైన గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి బాధితులను బయటకు తీసి చికిత్స నిమిత్తం సమీపంలోని హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.పోలీసులు దర్యాప్తు సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించి, కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు జరుపుతున్నారు.





చీకటిని తరిమిన దీపాలు.. మదిలో నింపిన సంతోషాలు

మంచిర్యాల, నవంబరు 9 (సింగిడి): చీకటిని పారద్రోలి వెలుగులు నింపే దీపావళి పండుగను జిల్లా ప్రజలు అత్యంత ఉత్సాహంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అమావాస్య చీకట్లను దీపకాంతులతో నింపుతూ ప్రతి ఇంటి ముంగిట దీపాలు వెలిగాయి. వీధులన్నీ విద్యుత్ దీపాల అలంకరణతో, రంగురంగుల కాంతులతో కళకళలాడాయి. చిన్నారుల కేరింతలు, టపాసుల మోతలు, కుటుంబ సభ్యుల సందడితో పండుగ వాతావరణం నెలకొంది.ఉదయం నుంచే ఇళ్లను శుభ్రం చేసి అందంగా అలంకరించిన ప్రజలు.. సాయంత్రం వేళ లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కుటుంబ సభ్యులు, బంధు మిత్రులతో కలిసి దీపాలు వెలిగించి బాణసంచా కాలుస్తూ ఆనందంగా గడిపారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరూ పండుగ సంబరాల్లో భాగస్వాములయ్యారు. ఉద్యోగాలు, వ్యాపారాలు, ఇతర పనులతో నిత్యం బిజీగా ఉండే కుటుంబ సభ్యులంతా ఒకచోట చేరి ఆనందాన్ని పంచుకోవడం పండుగకు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చింది.



కుటుంబ సభ్యులతో మేయర్ సంబరాలు

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్ కుటుంబ సభ్యులతో కలిసి దీపావళి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఇంట్లో దీపాలు వెలిగించి, కుటుంబ సభ్యులతో కలిసి పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. కుటుంబ బంధాలు, ఆప్యాయతలు, పరస్పర సంతోషాలకు ప్రతీకగా నిలిచే దీపావళిని ఆనందోత్సాహాల మధ్య నిర్వహించుకున్నారు.దీపావళి అంటే కేవలం దీపాలు, బాణసంచా సంబరాలే కాదు.. చీకటిలో ఉన్న జీవితాల్లో వెలుగులు నింపే సందేశం కూడా. పండుగ వేళ ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండటంతో పాటు పర్యావరణ పరిరక్షణ, ఇతరుల భద్రతను దృష్టిలో ఉంచుకోవాల్సిన అవసరం ఉంది. శబ్ద కాలుష్యానికి దూరంగా ఉంటూ, చిన్నారులు పెద్దల పర్యవేక్షణలోనే బాణసంచా కాల్చడం ద్వారా సురక్షితమైన పండుగను జరుపుకోవాలని పలువురు సూచించారు. మొత్తంగా జిల్లావ్యాప్తంగా దీపావళి వేడుకలు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా ముగిశాయి.

ఎన్ఎల్ఎం నిధుల్లో అక్రమాలపై ఫిర్యాదు

కరీంనగర్, నవంబర్9(సింగిడి) జాతీయ పశుసంపద మిషన్ (ఎన్ఎల్ఎం) పథకం అమలులో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని ఏఐఎఫ్‌బీ జిల్లా కార్యదర్శి బండారి శేఖర్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.జిల్లాలో సుమారు 40 ప్రాజెక్టుల్లో పశువుల షెడ్ల నిర్మాణం, పశువులు, కోళ్ల పెంపకం పేరుతో తప్పుడు వివరాలు చూపి నిధులు దుర్వినియోగం చేసినట్లు అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. సంబంధిత శాఖ అధికారులు, బ్యాంకుల పాత్రపై క్షేత్రస్థాయి పరిశీలన, ఆర్థిక తనిఖీ నిర్వహించి, అక్రమాలు నిర్ధారణైతే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు బద్రీనాథ్ పాల్గొన్నారు.



ఇందిరా చౌక్‌లో సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు

కరీంనగర్, నవంబర్9(సింగిడి) ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను నగర కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ ఆధ్వర్యంలో ఇందిరా చౌక్‌లో ఘనంగా నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, మాజీ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కాంగ్రెస్ మైనారిటీ విభాగం అధ్యక్షుడు ఎండీ తాజుద్దీన్ ఆధ్వర్యంలో కరీములాషా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి పూల చాదర్ సమర్పించారు. నాయకులు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ఆయురారోగ్యాలతో ఉండాలని, మరో పదేళ్లు ముఖ్యమంత్రిగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత బస్సు ప్రయాణం, రైతు రుణమాఫీ వంటి పథకాలతో రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

అల్ఫోర్స్‌లో దీపావళి వేడుకలు



కరీంనగర్, నవంబర్9(సింగిడి)

కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో దీపావళి సందర్భంగా శ్రీ మహాలక్ష్మి పూజలు, హోమం వైభవంగా నిర్వహించారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి కుటుంబసమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.వేదమంత్రాల నడుమ అమ్మవారికి ఫల పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ, నైవేద్యం సమర్పించారు. గణపతి పూజ, నవగ్రహ పూజ, గోపూజ, గురువందనం, లక్ష్మీ హోమం నిర్వహించి పూర్ణాహుతితో కార్యక్రమాన్ని ముగించారు.ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ దీపావళి సంప్రదాయాలను భక్తిశ్రద్ధలతో కొనసాగించాలని, పర్యావరణానికి హాని కలగకుండా పండుగ జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాలలు, కళాశాలల ప్రధానాచార్యులు, సిబ్బంది, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

జాతీయ స్ఫూర్తిని చాటిన 'సారే జహా సే అచ్ఛా'

సిద్దిపేట ప్రతినిధి, నవంబరు 09 (సింగిడి): దేశభక్తిని, జాతీయ సమైక్యతను చాటిచెప్పే 'సారే జహా సే అచ్ఛా హిందూస్తాన్ హమారా' గీతం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని వక్తలు సాజిద్ పాషా అన్నారు. గీత రచయిత అల్లామా ఇక్బాల్ 149వ జయంతిని పురస్కరించుకొని సోమవారం సిద్దిపేట పట్టణంలోని ఇక్బాల్ మినార్ వద్ద ఆయనకు ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో ఈ గీతం యువతలో దేశభక్తి భావాలను రగిలించిందన్నారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ అంతరిక్షం నుంచి భారతదేశం ఎలా కనిపిస్తోందని అడిగిన ప్రశ్నకు, అప్పటి వ్యోమగామి రాకేశ్ శర్మ 'సారే జహాఁ సే అచ్ఛా' అంటూ సమాధానమిచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. అల్లామా ఇక్బాల్ కలం నుంచి జాలువారిన ఈ గీతం నేటికీ ప్రజల్లో జాతీయ భావాన్ని పెంపొందిస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో ఇంతియాజ్, ఆరిఫ్, అశ్వక్, సాదిక్, మన్సూర్, గౌస్, శంషాద్ అలీ తదితరులు పాల్గొన్నారు...



ఆర్టీసీ డీఎం తీరుపై కార్మిక సంఘాల ఆగ్రహం

కార్మిక సంఘం నాయకులను కింద కూర్చోబెట్టి మాట్లాడటంపై అభ్యంతరం
ఘటనపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్



సిద్దిపేట ప్రతినిధి, నవంబర్ 09 (సింగిడి):
ఆర్టీసీ కార్మికుల పట్ల సిద్దిపేట డిపో మేనేజర్ వ్యవహరిస్తున్న తీరుపై కార్మిక సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దుబ్బాక ఆర్టీసీ కార్మికుల సమస్యలను డీఎం దృష్టికి తీసుకెళ్లేందుకు వెళ్లిన తమకు కనీస మర్యాద ఇవ్వలేదని టీఎంయూ రీజినల్ కార్యదర్శి రవీందర్ గౌడ్, ప్రాంతీయ అధ్యక్షుడు మల్లేశం ఆరోపించారు. సోమవారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.కార్మిక నాయకులు కూర్చోవడానికి కుర్చీలు లేవా అని ప్రశ్నించగా, కార్మికులను కూర్చోబెట్టే ఆదేశాలు ఇంకా రాలేదంటూ డీఎం వెటకారంగా సమాధానమిచ్చారని తెలిపారు. రెండు రోజుల క్రితం సిద్దిపేట డిపోకు వెళ్లిన సందర్భంలోనూ తమను కింద కూర్చోబెట్టి మాట్లాడారని పేర్కొన్నారు.ఈ ఘటనపై సంగారెడ్డి ప్రాంతీయ మేనేజర్ సమగ్ర విచారణ జరపకుండానే డీఎంకు అనుకూలంగా నివేదిక పంపడం సరికాదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల ఆత్మగౌరవం, సంక్షేమం కోసం పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో ఈయూ డిపో కార్యదర్శి డి.వై.రెడ్డి, ప్రాంతీయ సహాయ కార్యదర్శి లాల్, టీఎంయూ నాయకుడు బాలూ, ఎన్‌ఎంయూ డిపో కార్యదర్శి యెల్లయ్య, నాయకులు రంగయ్య, కంకయ్య, నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

భూంపల్లి లో మోదీ చిత్రపటానికి పాలాభిషేకం

కామారెడ్డి ప్రతినిధి నవంబర్ 09 (సింగిడి)
కామారెడ్డి జిల్లా సదాశివ నగర్ మండల్ భూంపల్లి గ్రామంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి చిత్రపటానికి స్థానిక బిజెపి నాయకులు కార్యకర్తలు గ్రామ ప్రజలు కలిసి పాలాభిషేకం చేశారు ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం సూపరిపాలనలో దూసుకుపోతుందని సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి చేరుతున్నాయని తెలిపారు గ్రామపంచాయతీ భవనాలకు మహిళా భవనాలకు. హాస్పిటల్ భవనాలకు పాఠశాల భవనాలకు కేంద్ర ప్రభుత్వం 6. 69 కోట్ల నిధులు విడుదల చేసినందుకు గాను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ పసుల సాయిలు బిజెపి బూత్ అధ్యక్షులు గడిల కిషన్ రావు. వడ్ల రాజేందర్ వడ్ల నర్సింలు. శక్తి కేంద్రం ఇంచార్జ్ తిపిరిశెట్టి భాస్కర్. పార్టీ కార్యకర్తలు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు



సైన్స్ కాంగ్రెస్‌లో విద్యార్థుల ప్రతిభ

సిద్దిపేట ప్రతినిధి, నవంబర్ 09 (సింగిడి):
32వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌లో భాగంగా సిద్దిపేటలోని టీఆర్టీసీ భవన్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి ప్రాజెక్టుల ప్రదర్శనలో విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను జ్యూరీ సభ్యుల ముందు ప్రదర్శించారు. డిగ్రీ కళాశాల ఆచార్యుడు మధుసూదన్ అధ్వర్యంలోని ఎనిమిది మంది సభ్యుల బృందం ప్రాజెక్టులను పరిశీలించి ఉత్తమ వాటిని ఎంపిక చేసింది.జడ్పీహెచ్ఎస్ దామరకుంటకు చెందిన ఎస్. కీర్తన, జడ్పీహెచ్ఎస్ మార్కుక్‌కు చెందిన ఎస్. సాక్షిత మొదటి స్థానంలో నిలిచారు. ప్రజ్ఞాపూర్ సెయింట్ మేరీస్ పాఠశాల విద్యార్థి శ్రీహస్ గౌడ్ ద్వితీయ స్థానం, లచ్చపేట టీజీ ఎంఎస్ విద్యార్థి ఎండీ అజీజ్ తృతీయ స్థానం సాధించారు. ప్రజ్ఞాపూర్ సెయింట్ మేరీస్ పాఠశాలకు చెందిన ఎ. అనూష నాలుగో స్థానం, ధౌల్మిట్ట జడ్పీహెచ్ఎస్ విద్యార్థి కే. వేణుగోపాల్ ఐదో స్థానం దక్కించుకున్నారు. ఎంపికైన ప్రాజెక్టులను రాష్ట్రస్థాయి పోటీలకు పంపించనున్నారు.ఈ సందర్భంగా డీఈఓ సి. రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. నూతన ఆవిష్కరణలపై ఆసక్తి పెంచుకొని చదువుపై దృష్టి సారించాలని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఏడీ శాస్త్రి, ఏఏంఓ పయ్యావుల రామస్వామి, డీఎస్ఓ పబ్బోజు రాజమౌళి, డీఏసీ ఎండీ సాదత్ అలీ, వివిధ సబ్జెక్టు ఫోరం డీఆర్పీలు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా మాజీ ఎమ్మెల్యే

కామారెడ్డి ప్రతినిధి నవంబర్ 09:(సింగిడి)
ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్నారు ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్. ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని లింగారెడ్డిపేట్ గ్రామానికి చెందిన రైతు పూర్ర నారాయణ కుమార్తె పూర్ర స్వప్న తీవ్ర అస్వస్థతకు గురై సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం మాజీ కౌన్సిలర్ భూంగారి రాము ద్వారా తెలుసుకున్న జాజాల సురేందర్ వెంటనే ఆసుపత్రికి చేరుకున్నారు.ఈ సందర్భంగా ఐసీయూలో చికిత్స పొందుతున్న స్వప్నను సందర్శించి, ఆమె ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరడంతో పాటు, ఆసుపత్రి యాజమాన్యంతో మాట్లాడి చికిత్స ఖర్చుల బిల్లును తగ్గించేలా చొరవ తీసుకున్నారు.అనంతరం స్వప్న కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. వారికి ఆర్థిక సహాయం అందించి, ఎలాంటి ఆందోళన చెందవద్దని భరోసా కల్పించారు.కష్టకాలంలో బాధిత కుటుంబానికి అండగా నిలిచిన మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ సేవాభావంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పేదల సొంతింట్లో దీపావళి వెలుగులు

కరీంనగర్, నవంబర్9(సింగిడి)
సొంతింటి కల నెరవేరడంతో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తొలి దీపావళిని ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారని మాజీ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. కరీంనగర్ రూరల్ మండలంలోని బహదూర్‌ఖాన్‌పేట్, దుబ్బపల్లి గ్రామాల్లో లబ్ధిదారులతో కలిసి ఆయన దీపాలు వెలిగించి, టపాసులు కాల్చి వేడుకల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇల్లు లేని పేద కుటుంబాలకు సొంతింటి కలను నిజం చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందన్నారు. లబ్ధిదారులు కొత్త ఇళ్లలో తొలి దీపావళి జరుపుకోవడంలో భాగస్వామి కావడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

మసీదు వీధిలో రోడ్డు నిర్మాణం పూర్తి

కరీంనగర్, నవంబర్9(సింగిడి)
నగరంలోని 54వ డివిజన్ మసీదు వీధిలో ఎస్ఆర్‌డీజీ పాఠశాల నుంచి పాత బైపాస్ వరకు రూ.50 లక్షల వ్యయంతో నూతన రహదారి నిర్మాణం పూర్తయింది. డివిజన్ అభివృద్ధి నిధుల నుంచి కేటాయించిన మొత్తంతో ఈ పనులు చేపట్టారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్, మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు సహకారంతో పనులు పూర్తయ్యాయని స్థానిక కార్పొరేటర్ గొట్టెముక్కుల ఉమారాణి వెంకటరమణ తెలిపారు.రహదారి అధ్వానంగా ఉండటంతో ఇన్నాళ్లూ ఇబ్బందులు ఎదుర్కొన్నామని, నూతన రహదారి నిర్మాణంతో సమస్య పరిష్కారమైందని స్థానికులు తెలిపారు. ఈ సందర్భంగా మసీదు కమిటీ సభ్యులు, కాలనీ వాసులు కార్పొరేటర్ ఉమారాణి వెంకటరమణను శాలువాలు, పూలమాలలతో సన్మానించారు.డివిజన్‌లో మిగిలిన సమస్యల పరిష్కారానికి కూడా కృషి చేస్తానని కార్పొరేటర్ పేర్కొన్నారు.



అందుబాటులోకి కొత్త అంబులెన్స్ లు

మంచిర్యాల, నవంబరు 9 (సింగిడి):
అత్యవసర వైద్య సేవలను మరింత చేరువ చేయడంతో పాటు ఆపద సమయంలో ప్రాణాలను కాపాడేందుకు మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి రెండు అత్యాధునిక అంబులెన్సులు అందుబాటులోకి వచ్చాయి. జిల్లా ఖనిజ నిధి (డీఎంఎఫ్‌టీ) నుంచి రూ.20 లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన ఈ అంబులెన్సులను ఆదివారం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి పచ్చజెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుమూల గ్రామీణ ప్రాంత ప్రజలకు సైతం మెరుగైన, సత్వర వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రమాదాలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో క్షతగాత్రులు, రోగులను ఎలాంటి జాప్యం లేకుండా ఆసుపత్రికి తరలించేందుకు ఈ అంబులెన్సులు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ముఖ్యంగా సమయానికి వైద్య చికిత్స అందక ప్రాణాపాయ పరిస్థితులు ఎదుర్కొనే రోగులకు ఈ వాహనాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు.నియోజకవర్గంలో వైద్య మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నామని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యాధునిక వెంటిలేటర్లు, ఇతర అవసరమైన వైద్య పరికరాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామని వివరించారు. స్థానిక ప్రజలు అత్యవసర వైద్యం కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి లేకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. రాబోయే ఏడాది లోగా నియోజకవర్గంలో సంపూర్ణ వైద్య సదుపాయాలు కల్పిస్తామని ధీమా వ్యక్తం చేశారు.ప్రభుత్వ ఆసుపత్రులకు అవసరమైన సదుపాయాలు కల్పించడం ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్యం చేరువ చేయవచ్చనే లక్ష్యంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అంబులెన్సుల సేవలను సమర్థంగా వినియోగించుకుంటూ అత్యవసర సమయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని సంబంధిత వైద్య సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో నగర మేయర్ దర్జి మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య మహేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ రామగిరి బానేష్, నగర పాలక కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, కార్పొరేటర్ తూముల నరేష్, పలువురు కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్యసేవలకు కొత్త ఊపిరి

ఆఖరి మజిలీ అపహాస్యం

డంపింగ్ యార్డుల్లా వైకుంఠధామాలు..
అధికారుల నిర్లక్ష్యంపై బిఆర్ఎస్ సమరం..

పెద్దపల్లి ప్రతినిధి, నవంబర్ 9 (సింగిడి):
కోట్ల రూపాయలతో కట్టిన వైకుంఠధామాలను మురికి కూపాలుగా మార్చి, కడసారి వీడ్కోలుకు వచ్చే పవిత్ర స్థలాలను చెత్త కుండీలుగా మార్చి ఆఖరి మజిలీని అపహాస్యం చేస్తున్నారంటూ మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంపై బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్ కుమార్ ఆధ్వర్యంలోని బిఆర్ఎస్ నేతలు నిరసన వ్యక్తం చేశారు. సోమవారం ఎల్లమ్మ చెరువు వద్ద ఉన్న వైకుంఠధామాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి అక్కడి దయనీయ పరిస్థితులను చూసి ఆగ్రహంతో రగిలిపోయారు. దారి పొడవునా కుళ్ళిన జంతు చర్మాలు, మద్యం బాటిళ్లు, గాజు పెంకులు వేసి అంతిమ యాత్రను కూడా నరకయాత్రగా మార్చేశారని విమర్శించారు. చావులోనూ కనీస మానవత్వం చూపని దౌర్భాగ్య స్థితికి మున్సిపాలిటీ దిగజారిందని ధ్వజమెత్తారు. కేసీఆర్ దూరదృష్టితో, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి నిధులతో మోడల్‌గా తీర్చిదిద్దిన వైకుంఠధామాలను నేడు పిచ్చిమొక్కలు, ముళ్లపొదలకు నిలయంగా మార్చేశారని ఎండగట్టారు. రంగంపల్లి వైకుంఠధామంలో నాసిరకం నిర్మాణాలతో ప్రజాధనాన్ని నిలువునా దోచుకున్నారని, చిన్న గేటు వెల్డింగ్ కూడా నిలవని దారుణమైన నాణ్యతతో అధికారులు ఎంతగా దిగజారారో అర్థమవుతోందని విమర్శించారు.ఒక గోడ పక్కనే మరో గోడ కట్టి బిల్లులు బొక్కేసిన ఘనులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని శవాల దహన సంస్కారాలకు వచ్చే బంధువులకు కనీసం నడిచే దారి లేకుండా చేసిన పాలకుల, అధికారుల అసమర్థతపై ఆధారాలతో సహా జిల్లా కలెక్టరుకు పిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ వెన్నం సుజాత రవీందర్, మాజీ కౌన్సిలర్ పూదరి చంద్ర శేఖర్, మాజీ ఎంపీటీసీ వైద శ్రీనివాస్, నాయకులు కాశిపాక వాసు, పల్లె మధు, దాసరి శ్రీనివాస్, అజార్, ప్రేమ్ కుమార్, జక్కుల శ్రీకాంత్, కుక్క మనోజ్, పిట్టల మహేష్ తదితరులు పాల్గొన్నారు.





అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి

కలెక్టరేట్ ఎఓ బి. ప్రకాష్..

పెద్దపల్లి ప్రతినిధి, నవంబర్ 09 (సింగిడి):
ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి, అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని కలెక్టరేట్ పరిపాలనా అధికారి బి. ప్రకాష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.ఈ సందర్భంగా పాలకుర్తి మండలం పుట్నూరు గ్రామానికి చెందిన మేరుగు లచ్చయ్య భూమి పాస్ పుస్తక నమోదుపై ఇచ్చిన దరఖాస్తును పరిశీలించాలని పాలకుర్తి తహసీల్దార్‌కు పంపారు. అలాగే, ఓదెల మండలం కొలనూరుకు చెందిన కరే భాగ్యలక్ష్మి గృహజ్యోతి 200 యూనిట్ల విద్యుత్ సబ్సిడీ రావడం లేదని సమర్పించిన వినతిపై చర్యలు తీసుకోవాలని ఓదెల ఎంపిడిఓకు ఆదేశించారు. ఎలిగేడు మండలం లోకాపేటకు చెందిన పాపని అనూష ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరగా, పరిశీలించాల్సిందిగా హౌసింగ్ పీడీకి సూచించారు.ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ హెచ్-విభాగ పర్యవేక్షకులు ఈశ్వర్, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వడ్డెరలకు ఎమ్మెల్సీ ఇవ్వాలి

పెద్దపల్లి నవంబర్ 09 (సింగిడి):



తెలంగాణ వాణి: తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న వడ్డెర సామాజిక వర్గానికి రాజకీయంగా సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని తెలంగాణ వడ్డెర సంఘం రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు అలకుంట రాజేశం కోరారు. గవర్నర్ కోటాలో ఖాళీ కానున్న శాసనమండలి స్థానాన్ని వడ్డెర సామాజిక వర్గానికి కేటాయించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు.తెలంగాణ వడ్డెర సంఘం రాష్ట్ర యువజన అధ్యక్షుడు ఒల్లేపు సాయికుమార్ పిలుపు మేరకు ఈ డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా రాజేశం మాట్లాడుతూ.. రాష్ట్ర నిర్మాణం, అభివృద్ధి కార్యక్రమాల్లో వడ్డెర సామాజిక వర్గం ఎన్నో ఏళ్లుగా శ్రమిస్తూ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. సమాజానికి విశేష సేవలందిస్తున్నప్పటికీ రాజకీయంగా ఆశించిన స్థాయిలో గుర్తింపు, ప్రాతినిధ్యం లభించడం లేదని పేర్కొన్నారు.వడ్డెర సామాజిక వర్గం ఎన్నో ఏళ్లుగా రాజకీయ ప్రాతినిధ్యం కోసం ఎదురుచూస్తోందని తెలిపారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాల కల్పనలో భాగంగా గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాన్ని ఆ వర్గానికి కేటాయించేలా ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు.వడ్డెరలకు ఎమ్మెల్సీ అవకాశం కల్పిస్తే వారి సమస్యలు, హక్కులు, సంక్షేమం, అభివృద్ధి ఆకాంక్షలకు శాసనమండలిలో ప్రాతినిధ్యం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ విజ్ఞప్తిని సానుకూలంగా పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని అలకుంట రాజేశం కోరారు.

పేదల సొంతింటి కల సాకారం





ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి వెలుగులు..
లబ్ధిదారుల కుటుంబాలతో కలిసి పండుగ జరుపుకున్న పోచారం!

కామారెడ్డి , నవంబర్ 09:(సింగిడి)
పేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేసే లక్ష్యంతో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లలో ఈ ఏడాది దీపావళి పండుగ ప్రత్యేక ఆనందాన్ని నింపింది. బాన్సువాడ నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కుటుంబాల మధ్య పండుగ సంబరాలు అంబరాన్నంటాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి కుటుంబ సభ్యులతో కలిసి దీపావళి వేడుకల్లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ అగ్రికల్చర్ చైర్మన్ కాసుల బాలరాజు, బాన్సువాడ ఆర్డీఓ రవీందర్ రెడ్డి పాల్గొన్నారు. లబ్ధిదారుల కుటుంబాలతో ఆత్మీయంగా ముచ్చటిస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వారితో కలిసి దీపాలు వెలిగించి పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. పలు ప్రాంతాల్లో లబ్ధిదారుల ఇళ్ల సందర్శన.. బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డు బీడీ వర్కర్స్ కాలనీలో జట్ల జ్యోతి–రాజు, చిలివేరి స్వప్న–ప్రవీణ్, కోటగల్లి సంగీత–రవికుమార్ కుటుంబాల ఇళ్లలో దీపావళి వేడుకల్లో పాల్గొన్నారు.అలాగే బీర్కూర్ మండలం వీరాపూర్ గ్రామంలో పెంట లలిత–సుదర్శన్, జంగిలి పార్వతి–మోగులయ్య కుటుంబాలతో కలిసి పండుగ జరుపుకున్నారు. నస్రుల్లాబాద్ మండలం మీర్జాపూర్ గ్రామంలో పురం అమృత–శ్రీనివాస్, పురం సవిత–రమేష్ కుటుంబాల ఇళ్లకు వెళ్లి దీపావళి సంబరాల్లో పాల్గొన్నారు.
ప్రతి కుటుంబానికి సొంతిల్లు ఒక కల
ఈ సందర్భంగా పోచారం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ప్రతి కుటుంబానికి సొంతిల్లు అనేది ఒక కల అని, ఆ కలను నిజం చేసిన ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి వెలుగులు నింపుతూ లబ్ధిదారుల కుటుంబాలతో కలిసి పండుగ జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ప్రజల మధ్యకు వెళ్లి వారి సంతోషాల్లో భాగస్వాములు కావడం సంతృప్తినిస్తుందని తెలిపారు.ఈ వేడుకల్లో బాన్సువాడ పట్టణంతో పాటు నస్రుల్లాబాద్, బీర్కూర్ మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, స్థానికులు పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇళ్లలో వెలిగిన దీపాలు లబ్ధిదారుల కుటుంబాల్లో పండుగ ఆనందాన్ని మరింత పెంచాయి.

ఉపాధి పనుల కల్పనపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి

ప్రతి గ్రామ పంచాయతీలో రోజుకు 60 మందికి పని!
నవంబర్ 10లోగా అభివృద్ధి పనుల అంచనాలు పూర్తి చేయాలి
జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

కామారెడ్డి, నవంబర్ 09:(సింగిడి)
జిల్లాలో ఉపాధి పథకం అమలును వేగవంతం చేసి గ్రామీణ కూలీలకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామ పంచాయతీలో రోజుకు కనీసం 60 మంది కూలీలకు పని కల్పించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. అలాగే పథకం కింద చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించిన అంచనాలను నవంబర్ 10వ తేదీలోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు నిరంతరంగా ఉపాధి పనులు అందుబాటులో ఉండేలా ఎంపీడీఓలు, గ్రామస్థాయి అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీలో కూలీల సమీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని, రోజువారీగా కనీసం 60 మంది కూలీలు పనుల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.సిబ్బంది వివరాల నమోదు తప్పనిసరిగా గ్రామ పంచాయతీల్లో మేట్లు, క్షేత్ర సహాయకుల వివరాలను గ్రామ పంచాయతీ స్థాయి సిబ్బంది జాబితాలో తప్పనిసరిగా నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. సంబంధిత మొబైల్ నంబర్ల నమోదును కార్యక్రమ అధికారి లాగిన్‌లో పూర్తి చేయాలని తెలిపారు. ఇప్పటికే మొబైల్ నంబర్లు నమోదై సిబ్బంది వివరాలు నమోదు కాని చోట్ల పాత నమోదును తొలగించి, ముందుగా సిబ్బంది వివరాలు నమోదు చేసిన అనంతరం మొబైల్ నంబర్లను తిరిగి నమోదు చేయాలని స్పష్టం చేశారు.1,800 చెరువులు, కాలువల పనులకు అంచనాలుజిల్లాలో 1,800 చిన్న నీటిపారుదల చెరువులు, కాలువలకు సంబంధించిన పనుల జాబితా అందుబాటులో ఉందని కలెక్టర్ వెల్లడించారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహించి ప్రభుత్వ నిబంధనలు, నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా పనుల అంచనాలను రూపొందించాలని ఆదేశించారు. అవసరమైన పరిపాలనా అనుమతులు లభించిన వెంటనే పనులు ప్రారంభించేలా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.మరుగుదొడ్ల నిర్మాణ అంచనాలకు గడువుఅన్ని ఇందిరమ్మ ఇళ్లు, మ్యాజిక్ సోక్ పిట్స్, మహిళా సంఘాల గ్రామ సమాఖ్య భవనాల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి సంబంధించిన అంచనాలను నవంబర్ 10వ తేదీలోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా అంచనాల రూపకల్పన పూర్తిచేసి తదుపరి పనులకు మార్గం సుగమం చేయాలని సూచించారు. ఉపాధి పథకం లక్ష్యాల సాధనలో భాగంగా కూలీల సమీకరణ, సిబ్బంది వివరాల నమోదు, అభివృద్ధి పనుల అంచనాల తయారీ, పనుల ప్రారంభంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పష్టం చేశారు. నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.



ఇందిరమ్మ ఇంట్లో మంత్రి పొన్నం దీపావళి సంబరాలు

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 09, (సింగిడి):
కోహెడ: పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. దీపావళి పండుగ సందర్భంగా సిద్దిపేట జిల్లా కోహెడ మండలం వింజపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారు పారునంది శంకరవ్వ నూతన గృహాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులతో కలిసి ఇంట్లో దీపావళి వేడుకల్లో పాల్గొన్నారు. లబ్ధిదారుకు నూతన వస్త్రాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఇంటి ఆవరణలో బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పదేళ్ల తర్వాత ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదలకు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో మొదటి దశలో 3,500 ఇళ్లు, మరో విడతలో 2,000 ఇళ్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. మొదటి దశలో మంజూరైన ఇళ్లలో ఇప్పటికే 2,500కు పైగా నిర్మాణాలు పూర్తయ్యాయని వెల్లడించారు. అర్హులైన నిరుపేదలకే ఇళ్లు కేటాయిస్తున్నామని, త్వరలో రెండో దశ ఇళ్లను మంజూరు చేస్తామని చెప్పారు.వింజపల్లి గ్రామానికి అవార్డు రావడంపై సర్పంచికి అభినందనలు తెలిపారు. గౌరవెల్లి ప్రాజెక్టు కోసం భూములిచ్చిన గ్రామస్థులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రాజెక్టుతో ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని తెలిపారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అన్నాడి శ్రీజ జీవన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నిర్మలా జయరాజ్, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



భర్త వేధింపులతో వివాహిత ఆత్మహత్య

ఇరుకుల్లలో ఘటన నిందితుడి కోసం పోలీసుల గాలింపు

కరీంనగర్, నవంబర్9(సింగిడి)



భర్త వేధింపులు తట్టుకోలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన కరీంనగర్ రూరల్ మండలం ఇరుకుల్లలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కొత్తూరి సంపత్ (42)తో 11 ఏళ్ల క్రితం వివాహమైన శ్రావంతి (35)కు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గత ఆరు నెల

చలికాలం వచ్చిందంటే చలి, పొగమంచు, వాయు కాలుష్యం వంటి సమస్యలు సాధారణమైపోతాయి. అయితే ఈ కాలంలో చాలామందిని మరో సమస్య కూడా వేధిస్తుంటుంది. కళ్లలో మంట, దురద, ఎర్రబడటం, పదేపదే నీళ్లు రావడం వంటి లక్షణాలు కనిపిస్తుంటాయి. కళ్లలో ఏదో ఇసుక పడినట్లు అనిపించడం, కనురెప్పలు బరువుగా ఉండటం వంటి ఇబ్బందులు కూడా ఎదురవుతాయి. చాలామంది వీటిని చలికాలంలో వచ్చే సాధారణ సమస్యలుగా భావించి నిర్లక్ష్యం చేస్తుంటారు. అయితే వాయు కాలుష్యం కళ్ల ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం చూపుతుంది? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? ఎప్పుడు వైద్యులను సంప్రదించాలి? తెలుసుకుందాం.

చలికాలం కళ్లు పదిలం



10-11-2026
మంగళవారం

అతివ Athiva Singidi

ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే కంటి వైద్యుడిని సంప్రదించండి!

కాలుష్యం వల్ల వచ్చే సాధారణ కంటి చికాకు సాధారణంగా ఒకటి లేదా రెండు రోజుల్లో తగ్గిపోవాలి. అయితే కొన్ని లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా కంటి వైద్యుడిని సంప్రదించాలి. కళ్లలో సాధారణ చికాకును మించిన తీవ్రమైన నొప్పి ఉండటం. రెప్పలు కొట్టినా తగ్గని మసక చూపు లేదా చూపు తగ్గిపోవడం. వెలుతురును చూడలేనంతగా కళ్లలో సున్నితత్వం పెరగడం. పసుపు లేదా ఆకుపచ్చ రంగులో చిక్కటి స్రావం రావడం.ఉదయం నిద్రలేచినప్పుడు కనురెప్పలు అతుక్కుపోవడం. ఒక కంటిలో మాత్రమే తీవ్రమైన ఎర్రదనం కనిపించడం. రెండు నుంచి మూడు రోజులు గడిచినా సమస్య తగ్గకపోవడం. కాంటాక్ట్ లెన్స్ ధరించినప్పుడు కళ్లలో నొప్పి లేదా ఎర్రదనం రావడం. లైట్ల చుట్టూ వలయాలు కనిపించేడం. కళ్ల నొప్పితో పాటు తలనొప్పి, వికారం రావడం. ముఖ్యంగా కాంటాక్ట్ లెన్స్ వాడేవారికి కళ్లలో నొప్పి, ఎర్రదనం వస్తే వెంటనే లెన్స్ తొలగించి అదే రోజు వైద్య పరీక్ష చేయించుకోవాలి. ఇలాంటి ఇన్ఫెక్షన్లు వేగంగా తీవ్రమయ్యే అవకాశం ఉంటుంది. పిల్లలు, వృద్ధులు, కాంటాక్ట్ లెన్స్ వాడేవారు, కళ్ల పొడిబారడం, అలర్జీ లేదా గ్లాకోమా సమస్యలు ఉన్నవారు మరింత అప్రమత్తంగా ఉండాలి. చలికాలంలో వాయు కాలుష్యం కారణంగా కళ్లలో స్వల్ప మంట, దురద, నీళ్లు రావడం వంటి సమస్యలు చాలామందికి ఎదురవుతుంటాయి. సాధారణంగా కొన్ని జాగ్రత్తలు పాటిస్తే వీటి నుంచి ఉపశమనం పొందవచ్చు. అయితే కళ్లలో తీవ్రమైన నొప్పి, చూపు తగ్గడం, వెలుతురు చూడలేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకూడదు.

కాలుష్యం వల్ల కనిపించే లక్షణాలు ఇవే!

వాయు కాలుష్యానికి గురైనప్పుడు కళ్లలో ఈ లక్షణాలు కనిపించవచ్చు.

కళ్లలో మంట, సూదులతో గుచ్చినట్లు అనిపించడం. కళ్లు ఎర్రబడటం. కళ్లలో దురద రావడం. పదేపదే నీళ్లు కారడం. కళ్లలో ఇసుక లేదా ఏదో వస్తువు ఉన్నట్లు అనిపించడం. కనురెప్పలు స్వల్పంగా వాచడం, బరువుగా అనిపించడం. రెప్పలు కొట్టినప్పుడు తాత్కాలికంగా తగ్గిపోయే మసక చూపు. కాలుష్యం ఎక్కువగా ఉన్న ప్రాంతాల నుంచి దూరంగా వెళ్లినప్పుడు ఈ లక్షణాలు సాధారణంగా తగ్గుతాయి. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో పొగమంచు, స్మాగ్ ఎక్కువగా ఉన్నప్పుడు సమస్య తీవ్రత పెరగవచ్చు.

మన శరీరంలోని బయట గాలితో నేరుగా సంబంధం కలిగి ఉండే అవయవాల్లో కళ్లు కూడా ముఖ్యమైనవి. కళ్ల ఉపరితలాన్ని రక్షించడానికి కన్నీటి పొర (Tear Film) ఉంటుంది. అయితే వాయు కాలుష్యం కారణంగా ఈ రక్షణ పొర దెబ్బతినే అవకాశం ఉంది. గాలిలో ఉండే PM2.5 సూక్ష్మ ధూళి కణాలు, పొగ, నైట్రోజన్ డయాక్సైడ్, ఓజోన్, ఇతర కాలుష్య పదార్థాలు కళ్ల ఉపరి తలంపై చేరి చికాకు కలిగిస్తాయి. ఇవి అలర్జీ ప్రతిచర్యలను ప్రేరేపించడంతో పాటు కన్నీళ్లు త్వరగా ఆవిరయ్యేలా చేస్తాయి. ఫలితంగా కళ్లలో పొడిబారడం, వాపు, మంట, అసౌకర్యం వంటి సమస్యలు ఏర్పడతాయి.

ఇంట్లోనే ఈ జాగ్రత్తలు పాటించండి!

కళ్లను రుద్దకండి: దురదగా ఉన్నప్పుడు చాలామంది చేతులతో కళ్లను రుద్దుతుంటారు. ఇలా చేయడం వల్ల కళ్ల ఉపరితలంపై ఉన్న ధూళి కణాలు మరింత రాపిడికి కారణమవుతాయి. కొన్నిసార్లు కళ్లకు గాయాలు కూడా కావచ్చు.
బయట నుంచి ఇంటికి రాగానే ముఖం కడుక్కోండి: శుభ్రమైన నీటితో ముఖాన్ని కడుక్కోవాలి. కళ్లను మూసుకుని కనురెప్పలపై చల్లని నీటిని మెల్లగా చల్లుకోవచ్చు. అయితే కళ్లలోకి నేరుగా నీటిని బలంగా చల్లకూడదు. దీనివల్ల కళ్లకు రక్షణగా ఉండే కన్నీటి పొర దెబ్బతినవచ్చు.
లూబ్రికేటింగ్ ఐ డ్రాప్స్ వాడండి: ప్రిజర్వేటివ్ లేని (Preservative-free) లూబ్రికేటింగ్ ఐ డ్రాప్స్ కళ్ల పొడిబారడాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. వీటిని వైద్యుల సూచనల మేరకు ఉపయోగించాలి.
చల్లని కాపడం పెట్టుకోండి: కళ్లలో మంట, దురద ఎక్కువగా ఉన్నప్పుడు శుభ్రమైన చల్లని వస్త్రాన్ని మూసిన కనురెప్పలపై కొన్ని నిమిషాలు ఉంచుకోవచ్చు. దీనివల్ల ఉపశమనం కలుగుతుంది.
బయటకు వెళ్లేటప్పుడు కళ్లద్దాలు ధరించండి: సాధారణ కళ్లద్దాలు లేదా కళ్ల చుట్టూ కవర్ చేసే సన్‌గ్లాసెస్ ధరించడం వల్ల కళ్లకు చేరే ధూళి, గాలి ప్రభావం కొంతవరకు తగ్గుతుంది.
కాంటాక్ట్ లెన్స్‌లకు దూరంగా ఉండండి: కాలుష్యం ఎక్కువగా ఉన్న రోజుల్లో కాంటాక్ట్ లెన్స్‌లకు బదులుగా సాధారణ కళ్లద్దాలు ఉపయోగించడం మంచిది. లెన్స్‌లపై ధూళి కణాలు పేరుకుపోయి కళ్లకు మరింత ఇబ్బంది కలిగించవచ్చు.
ఇంట్లో గాలి శుభ్రంగా ఉండేలా చూసుకోండి: స్మాగ్ ఎక్కువగా ఉన్న సమయంలో కిటికీలు మూసి ఉంచాలి. ఎక్కువ సమయం గడిపే గదిలో ఎయిర్ ప్యూరిఫైయర్ ఉపయోగించడం కూడా ఉపకరిస్తుంది.
మొబైల్, కంప్యూటర్ స్క్రీన్‌కు విరామం ఇవ్వండి. ఎక్కువ సేపు స్క్రీన్ చూడటం వల్ల రెప్పలు కొట్టే వేగం తగ్గుతుంది. దీంతో కళ్లలో పొడిబారడం మరింత పెరుగుతుంది.

ఈ లక్షణాలు కనిపిస్తే అస్సలు నిర్లక్ష్యం చేయొద్దు!

కొన్ని లక్షణాలు కనిపిస్తే కాలుష్యం తగ్గే వరకు వేచి చూడకుండా వైద్య సహాయం తీసుకోవాలి.
సాధారణ పనులు చేస్తున్నప్పుడే శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలగడం. ఛాతీలో నొప్పి లేదా బిగుతుగా అనిపించడం. గుండె వేగంగా కొట్టుకోవడం. ఇన్హేలర్ వాడినా ఉపశమనం కలగకపోవడం. దగ్గుతో పాటు రక్తం పడటం. అధిక జ్వరం, చలి వణుకు రావడం. పెదవులు నీలం రంగులోకి మారడం. ముఖ్యంగా పెదవులు నీలం రంగులోకి మారడం, తీవ్రమైన శ్వాస ఇబ్బంది, ఛాతీ నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే అత్యవసర వైద్య సహాయం పొందాలి. ఇప్పటికే శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నవారు సమస్య తీవ్రత పెరిగే వరకు వేచి ఉండకూడదు.

ఈ దగ్గు నిర్లక్ష్యం వద్దు



దీపావళి సంబరాలు ముగిసినా.. టపాసుల పొగతో కలిగే ఆరోగ్య సమస్యలు మాత్రం కొందరిని ఇంకా వేధిస్తుంటాయి. ముఖ్యంగా దగ్గు, గొంతులో మంట, గొంతు నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి సమస్యలు కనిపిస్తుంటాయి.

బాణసంచా కాల్చడం వల్ల వెలువడే పొగ, విషపూరిత వాయువులు, సూక్ష్మ ధూళి కణాలు శ్వాసకోశ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతాయి. పండుగ సమయంలో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరుకోవడం పరిస్థితిని మరింత తీవ్రతరం చేస్తుంది. అయితే దీపావళి తర్వాత వచ్చే ప్రతి దగ్గు ప్రమాదకరమైనదని భావించాల్సిన అవసరం లేదు.కాబట్టి దగ్గు తీవ్రత ఎలా ఉంది? ఇతర లక్షణాలు గమనించడం ముఖ్యం.

దీపావళి తర్వాత దగ్గు ఎన్ని రోజుల్లో తగ్గాలి?

దగ్గు ఎంతకాలం కొనసాగుతుందనే విషయం సమస్య తీవ్రతను అంచనా వేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది. సాధారణంగా టపాసుల పొగ వల్ల ఏర్పడే స్వల్ప చికాకు కారణంగా వచ్చే దగ్గు సుమారు ఒకటి నుంచి ఏడు రోజుల్లో తగ్గిపోవాలి. ఈ సమయంలో లక్షణాలు క్రమంగా మెరుగుపడాలి. కానీ వారం రోజుల తర్వాత కూడా దగ్గు తగ్గకుండా మరింత ఎక్కువైతే దాన్ని సాధారణ కాలుష్య ప్రభావంగా భావించకూడదు. ఒకటి నుంచి మూడు వారాల పాటు దగ్గు కొనసాగితే వైరల్ ఇన్ఫెక్షన్ తర్వాత ఏర్పడే వాపు, బ్రాంకైటిస్ లేదా శ్వాసనాళాల సున్నితత్వం వంటి సమస్యలు ఉండే అవకాశం ఉంది. మూడు వారాలకు మించి దగ్గు కొనసాగితే తప్పనిసరిగా ఊపిరితిత్తుల వైద్య నిపుణుడిని (Pulmonologist) సంప్రదించాలి. ముఖ్యంగా దగ్గు తగ్గుతోందా? లేక రోజురోజుకూ పెరుగుతోందా? అనే విషయాన్ని గమనించాలి.

టపాసుల పొగ పీల్చుకుంటే ఏం జరుగుతుంది?

బాణసంచా పొగలో వివిధ రకాల లోహ అవశేషాలు, సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ డయాక్సైడ్, PM2.5 వంటి అతి సూక్ష్మ ధూళి కణాలు ఉంటాయి. ఇవి శ్వాస ద్వారా శరీరంలోకి ప్రవేశించినప్పుడు శ్వాసనాళాల లోపలి పొరపై ప్రభావం చూపి చికాకు, వాపును కలిగిస్తాయి. ఆరోగ్యంగా ఉన్నవారిలో ఈ ప్రభావం కారణంగా పొడి దగ్గు, గొంతులో మంట, దురద, కళ్లలో నీళ్లు రావడం వంటి లక్షణాలు కనిపించవచ్చు. ఇవి సాధారణంగా పొగ వల్ల ఏర్పడే తాత్కాలిక ప్రతిచర్యలు. ఇలాంటి సమస్యలు సాధారణంగా పొగకు గురైన తర్వాత ఒకటి నుంచి రెండు రోజుల్లో ఎక్కువగా కనిపిస్తాయి. అనంతరం క్రమంగా తగ్గుతూ కొన్ని రోజుల్లో లేదా వారం రోజుల్లో పూర్తిగా తగ్గిపోవచ్చు. అయితే శ్వాసనాళాల్లో వాపు మరింత లోతుగా వ్యాపిస్తే పరిస్థితి భిన్నంగా ఉంటుంది. శ్వాసనాళాల్లో కఫం ఎక్కువగా తయారవడం, అవి సన్నబడటం వంటి సమస్యలు ఏర్పడవచ్చు. దీంతో దగ్గు తీవ్రంగా మారి నిద్రకు, రోజువారీ పనులకు ఆటంకం కలిగిస్తుంది. ముఖ్యంగా తెల్లవారుజామున దగ్గు ఎక్కువగా వేధించవచ్చు. విజిల్ వేసినట్లు శ్వాస శబ్దం రావడం (Wheezing), ఛాతీలో బిగుతుగా అనిపించడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, కొద్దిపాటి శరీరక శ్రమకే ఆయాసం రావడం వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకూడదు.

తాకట్టు పెట్టిన బంగారాన్ని వేలం వేయవచ్చా?



ఈ రోజుల్లో బంగారంపై రుణాలు పెరిగిపోతున్నాయి. పర్సనల్ లోన్ కంటే బంగారం రుణాలపై ఆసక్తి చూపుతుంటారు. మీ వద్ద బంగారం ఉండి లోన్ తీసుకోవాలంటే కొన్ని నిమిషాల్లోనే లోన్ డబ్బులు మీ చేతికి వస్తాయి.

అదే పర్సనల్ లోన్ అయితే ఎంతో ప్రాసెస్ ఉంటుంది. ముఖ్యంగా బ్యాంకులు గానీ, ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలుగా, ఇతర సంస్థలు ముందుగా మీ సిబిల్‌ను చెక్ చేస్తాయి. అప్పుడు మీ లోన్ ప్రాసెస్ ముందుకు కదులుతుంది. కానీ బంగారంపై లోన్ తీసుకోవాలంటే ఇవేమి అవసరం ఉండదు. మీ వద్ద బంగారం ఉంటే సరిపోతుంది.

బంగారాన్ని తాకట్టు పెట్టి సులభంగా లోన్ పొందవచ్చు. అయితే బంగారంపై తీసుకున్న రుణానికి సరైన సమయంలో వడ్డీ చెల్లించాలి. అలాగే ఈఎంఐ ఆప్షన్ పెట్టుకుంటే సరైన సమయంలో చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. లేకుంటే అధిక వడ్డీని చెల్లించాల్సిన ఉంటుంది. అలాగా సరైన చెల్లింపులు కొన్ని నెలల పాటు చెల్లించకుంటే అప్పుడు సంస్థలు వేలం వేస్తాయా? పూర్తి వివరాలు తెలుసుకుందాం..

రుణం చెల్లించకపోతే బంగారాన్ని వేలం వేయవచ్చా? గోల్డ్ లోన్ తీసుకున్న వ్యక్తి నిర్ణీత సమయంలో రుణాన్ని తిరిగి చెల్లించకపోతే బ్యాంకులు లేదా ఫైనాన్స్ సంస్థలు తాకట్టు పెట్టిన బంగారాన్ని వేలం వేసే అవకాశం ఉంటుంది. అయితే ఇందుకు సంబంధించి ఆర్బీఐ కొన్ని నిబంధనలు విధించింది. వేలం నిర్వహించే ముందు రుణగ్రహీతకు తగినంత ముందస్తు నోటీసు ఇవ్వాలి. అంతేకాకుండా వేలంలో బంగారం కనీస రిజర్వ్ ధర ప్రస్తుత మార్కెట్ విలువలో 90 శాతం కంటే తక్కువగా ఉండకూడదు. వరుసగా రెండుసార్లు వేలం విఫలమైతేనే ఈ పరిమితిని 85 శాతానికి తగ్గించవచ్చు.

రుణం తీర్చిన తర్వాత 7 రోజుల్లో బంగారం తిరిగి ఇవ్వాలి: గోల్డ్ లోన్ తీసుకున్నవారికి మరో ముఖ్యమైన వెసులుబాటును ఆర్బీఐ కల్పించింది. రుణగ్రహీత మొత్తం అప్పును చెల్లించిన తర్వాత తాకట్టు పెట్టిన బంగారాన్ని అదే రోజున లేదా గరిష్ఠంగా ఏడు పని దినాల్లో తిరిగి ఇవ్వాలి. ఒకవేళ బ్యాంకు లేదా NBFC సంస్థలు ఈ గడువులో బంగారాన్ని తిరిగి ఇవ్వడంలో ఆలస్యం చేస్తే.. ఆలస్యమైన ప్రతి రోజుకు రూ.5,000 చొప్పున వినియోగదారుడికి పరిహారం చెల్లించాల్సి ఉంటుంది.

గోల్డ్ లోన్ తీసుకునే ముందు ఈ విషయాలు గుర్తుంచుకోండి: బంగారం విలువ పెరుగుతోందని ఎక్కువ మొత్తంలో రుణం తీసుకోవడం సరైన నిర్ణయం కాదు. మీ ఆదాయం, నెలవారీ ఖర్చులు, తిరిగి చెల్లించే సామర్థ్యాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. ముఖ్యంగా కుటుంబ అవసరాల కోసం దాచుకున్న బంగారు ఆభరణాలను కోల్పోకుండా ఉండాలంటే ముందుగానే రీపేమెంట్ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి. అవసర మైనంత మొత్తానికే రుణం తీసుకోవడం మంచిది.

నేడు స్టాక్ మార్కెట్ సెలవు



రేపు దీపావళి బలిప్రతిపద పండుగ సందర్భంగా బాంబే స్టాక్ ఎక్స్చేంజ్, నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ లు మూత పడనున్నాయి. దీపావళి బలిప్రతిపద పండుగ సందర్భంగా రేపు ఈక్విటీలు, డెరివేటివ్స్, కమోడిటీ, కరెన్సీ మార్కెట్లతో సహా అన్ని రకాల సెగ్మెంట్స్ కి సంబంధించిన ట్రేడింగ్ నిలిచిపోతుంది. అలాగే ఈ ఏడాదిలో స్టాక్ మార్కెట్లకి ఉన్న మిగిలిన సెలవులకి సంబంధించిన లిస్ట్ ని కూడా కింద తెలియచేయడం జరిగింది.

స్టాక్ మార్కెట్ Stock Market

నవంబర్ 10న స్టాక్ మార్కెట్స్ కి సెలవు
నవంబర్ 09, 2026 అనగా రేపు దేశీయ స్టాక్ ఎక్స్చేంజ్ లు అయిన బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ), నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్ఎస్ఈ) లు మూతపడనున్నాయి. ఉదార స్వభావం కలిగిన రాక్షస చక్రవర్తి అయిన మహాబలిని గౌరవించడానికి, అలాగే అతను తిరిగి భూమికి రావడాన్ని స్మరించుకొని ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకునే పండుగ అయిన దీపావళి బలిప్రతిపద సందర్భంగా ప్రముఖ స్టాక్ ఎక్స్చేంజ్ లు లకి ఈరోజు సెలవు ప్రకటించడం జరిగింది.
ఇక దీపావళి బలిప్రతిపద పండుగ సందర్భంగా రేపు కేవలం ఈక్విటీలు మాత్రమే కాకుండా డెరివేటివ్స్, కరెన్సీ మార్కెట్స్, సెక్యూరిటీ లెండింగ్, బారోయింగ్, కమోడిటీస్ మార్కెట్, ఎలక్ట్రానిక్ గోల్డ్ రిసిప్ట్స్ తో సహా అన్ని రకాల ట్రేడింగ్ సెగ్మెంట్స్ కూడా మూతపడనున్నాయి. కావున రేపటి సెలవుని దృష్టిలో ఉంచుకొని స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్లు దానికి తగిన విధంగా తమ ట్రేడింగ్ ప్లాన్ ని రూపొందించుకోవడం మంచిదని మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు.ఇక దీపావళి బలిప్రతిపద సందర్భంగా కేవలం దేశీయ స్టాక్ మార్కెట్లు మాత్రమే కాకుండా దేశంలోని చాలా రాష్ట్రాలలోని స్కూల్స్, ఫైనాన్సియల్ ఇన్స్టిట్యూషన్స్, గవర్నమెంట్, ప్రైవేట్ ఆఫీసులు, వ్యాపారాలకి కూడా సెలవు ఉంటుంది.
ఇక దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ ఏడాది నవంబర్ నెల నుంచి ఎప్పుడు మూతపడనున్నాయో కింద చూద్దాం.

★ నవంబర్ 10 అనగా నేడు దీపావళి పండుగ సందర్భంగా స్టాక్ మార్కెట్లకి సెలవు.
★ నవంబర్ 24 అనగా మంగళవారం ప్రకాష్ గురుపూర్బ్ సందర్భంగా స్టాక్ మార్కెట్లకి సెలవు.
★ డిసెంబర్ 25 అనగా శుక్రవారం క్రిస్మస్ పండుగ సందర్భంగా స్టాక్ మార్కెట్లకి సెలవు.

ఆల్ టైమ్ హై టచ్ చేసిన దివీస్ ల్యాబ్స్

దివీస్ ల్యాబొరేటరీస్ లిమిటెడ్ షేర్లు ఈరోజు ప్రారంభ ట్రేడింగ్ సెషన్ లో ఏకంగా 6 శాతానికి పైగా జంప్ చేయడం విశేషం. సెప్టెంబర్ తో ముగిసిన రెండవ త్రైమాసికంలో కంపెనీ రెవెన్యూ ఫ్రమ్ ఆపరేషన్స్ 35 శాతం వృద్ధి చెందగా, కంపెనీ నికర లాభం 64 శాతంగా నమోదు అయ్యింది. అలాగే ఈ స్టాక్ గత ఆరు నెలల కాలంలో 70 శాతం లాభాన్ని అందించి మల్టీబ్యాగర్ స్టాక్ గా నిలిచింది. ఇక ప్రస్తుతం ఈ కంపెనీ షేర్ రూ. 11,426 వద్ద ట్రేడ్ అవుతుంది.
ఆల్ టైమ్ హై లెవెల్ ని టచ్ చేసిన దివీస్ ల్యాబ్స్. వెంటనే కొనాలని సూచించిన గ్లోబల్ బ్రోకరేజ్ కంపెనీ. లార్జ్ క్యాప్ కేటగిరికి చెందిన ఫార్మా సెక్టార్ స్టాక్ అయిన దివీస్ ల్యాబొరేటరీస్ లిమిటెడ్ (Divi's Laboratories Limited) షేర్లు ఈరోజు ప్రారంభ ట్రేడింగ్ సెషన్ లో ఏకంగా 6 శాతానికి పైగా లాభపడి సరికొత్త 52 వారాల గరిష్ట స్థాయి అయిన రూ. 11,824 మార్క్ ని టచ్ చేయడం జరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్ తో ముగిసిన రెండవ త్రైమాసికానికి (Q2 రిజల్ట్స్) సంబంధించిన ఆర్థిక ఫలితాలలో దివీస్ ల్యాబొరేటరీస్ లిమిటెడ్ అద్భుతమైన పనితీరుని కనపరచడంతో ఈరోజు ఈ కంపెనీ షేర్ ధరలో ర్యాలీ కనిపించింది. మరొకవైపు ఈ కంపెనీ షేరు గత ఏడాది కాలంలో తమ షేర్ హోల్డర్స్ కి 71 శాతం లాభాన్ని అందించింది.కంపెనీ ఎక్స్చేంజ్ ఫైలింగ్ ప్రకారం, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్ తో ముగిసిన రెండవ త్రైమాసికంలో కంపెనీ రెవెన్యూ ఫ్రమ్ ఆపరేషన్స్ 35 శాతం వృద్ధి చెంది రూ. 3676 కోట్లకి చేరుకుంది. అలాగే సెప్టెంబర్ తో ముగిసిన రెండవ త్రైమాసికంలో కంపెనీ నికర లాభం ఇయర్ ఆన్ ఇయర్ ప్రాతిపదికన 64 శాతం వృద్ధి చెంది రూ. 1127 కోట్లుగా నమోదు అయ్యింది. మరొకవైపు దివీస్ ల్యాబొరేటరీస్ లిమిటెడ్ షేర్ కి బై రేటింగ్ తో పాటు టార్గెట్ ప్రైజ్ ని కూడా ఇస్తున్నట్లు ప్రముఖ గ్లోబల్ బ్రోకరేజ్ కంపెనీలలో ఒకటి అయిన నువామా ప్రకటించింది. దీనిలో భాగంగా దివీస్ ల్యాబొరేటరీస్ లిమిటెడ్ షేర్ కి రూ. 12,000 టార్గెట్ ప్రైజ్ ని ఇస్తున్నట్లు నువామా స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్స్ కి సూచించింది. ప్రస్తుత ట్రేడింగ్ సెషన్ లో దివీస్ ల్యాబొరేటరీస్ లిమిటెడ్ షేరు ధర 3.3 శాతం లాభపడి రూ. 11,466 వద్ద ట్రేడ్ అవుతుంది. గత వారం రోజుల్లో ఈ షేరు సుమారు 15 శాతం లాభాన్ని, అలాగే గత నెల రోజుల్లో ఈ షేరు సుమారు 23 శాతం లాభాన్ని అందించింది. దివీస్ ల్యాబొరేటరీస్ లిమిటెడ్ అనేది దేశీయ అతిపెద్ద మల్టీనేషనల్ ఫార్మా కంపెనీ. ఈ కంపెనీ జెనరిక్ APIలు, ఇంటర్మీడియట్స్ ని తయారు చేయడంతో పాటు కస్టమ్ సింథసైజ్ చేస్తుంది. ఈ కంపెనీ హైదరాబాద్ కేంద్రంగా తమ వ్యాపార కార్యకలాపాలని నిర్వహిస్తుంది. ఇక ఈ కంపెనీని అక్టోబర్ 12, 1990వ సంవత్సరంలో ప్రారంభించడం జరిగింది.

బంగారం ధరలు మళ్లీ పెరిగాయ్..

కొనుగోలుదారులకు బంగారం ధరలు షాక్ ఇచ్చాయి. కొన్ని రోజులుగా హెచ్చుతగ్గులకు గురైన ధరలు సోమవారం మళ్లీ పెరిగాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం.. ఉదయం 10 గంటల సమయానికి నిన్నటి ధరలతో పోలిస్తే ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,150 పెరిగి రూ.1,44,750కి చేరుకుంది. 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.950 పెరిగి రూ.1,32,700గా నమోదైంది. ఇక ముంబైలో నిన్నటి ధరలతో పోలిస్తే 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,030 పెరిగి రూ.1,44,600కి చేరుకుంది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.950 పెరిగి రూ.1,32,550 వద్ద కొనసాగుతోంది.



హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,030 పెరిగి రూ.1,44,600గా ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ.950 పెరిగి రూ.1,32,550కి చేరుకుంది. వెండి ధరల విషయానికి వస్తే.. ఢిల్లీ, ముంబైలో కిలో వెండి ధర రూ.2,05,000 వద్ద ట్రేడవుతోంది.
గమనిక: బంగారం, వెండి ధరలు ఎప్పటికప్పుడు మారుతుంటాయి. కాబట్టి కొనుగోలుదారులు మరోసారి ధరలను చెక్ చేసుకోవలసిందిగా సూచన.

ప్రజావాణికి 28 ఆర్జీలు



గద్వాల బ్యూరో నవంబర్ 9(సింగిడి):
ప్రజావాణి ఫిర్యాదులను పెండింగ్ లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. సోమవారం ఐడిఓసి సమావేశపు మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రజల నుంచి ఆర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 28 ఫిర్యాదులు అందాయన్నారు. మండల, డివిజన్ స్థాయి ప్రజావాణి ఫిర్యాదులను కూడా ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ప్రజావాణి ఫిర్యాదులపై రాష్ట్రస్థాయిలోనూ పర్యవేక్షణ చేస్తుండడంతో సంబంధిత అధికారులు అలసత్వం వహించకుండా పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో పనిచేయాలని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఆదేశించారు

పలు డివిజన్లలో అభివృద్ధి పనులు ప్రారంభం

కరీంనగర్, నవంబర్9(సింగిడి)
నగరపాలక సంస్థ పరిధిలోని పలు డివిజన్లలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల్లో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న పటేల్ పాల్గొన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి 46, 26, 25, 23వ డివిజన్లలో స్థానిక కార్పొరేటర్లు, అధికారులతో అభివృద్ధి పనుల్లో భాగస్వాములయ్యారు.ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, మాజీ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రభుదేశాయ్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత కు తిలోదకాలు: సీపీఐ



అమరచింత, నవంబర్ 9,(సింగిడి):
అమరచింత మండలంలోని పామిరెడ్డిపల్లి శివారులో ఉన్న కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం వద్ద హాస్టల్ లో నిర్మిస్తున్న కాంపౌండ్ వాల్ నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా కాంట్రాక్టర్ నిర్మిస్తున్నారని సీపీఐ మండల కార్యదర్శి అబ్రహం, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండి కుతుబ్ ఆరోపించారు. సిపిఐ పల్లెబాట లో భాగంగా ఆదివారం కస్తూర్బా గాంధీ పాఠశాల వద్ద నిర్మిస్తున్న కాంపౌండ్ వాల్ నిర్మాణాన్ని వారు పరిశీలించారు.హాస్టల్ లో నిర్మిస్తున్న కాంపౌండ్ వాల్ పనుల్లో నిబంధనలు పాటించకుండా నాసిరకంగా నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కాంపౌండ్ వాల్ నిర్మాణంలో కనీసం మూడు అడుగుల మేర పునాది వేయాల్సి ఉండగా, కనీసం ఒక అడుగు కూడా సక్రమంగా వేయకుండా పనులు చేపడుతున్నారని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రభుత్వ నిధులతో చేపడుతున్న నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఇష్టానుసారంగా పనులు చేపట్టి ప్రభుత్వ నిధులను వృథా చేయడం సరైన పద్ధతి కాదన్నారు. నాసిరకమైన నిర్మాణం వల్ల భవిష్యత్తులో కాంపౌండ్ వాల్ బలహీనపడే ప్రమాదం ఉందన్నారు. సిపిఐ పోరబాటులో భాగంగా అమరచింత మండలంలోని అన్ని గ్రామాలలో సమస్యలను పరిశీలించి అనంతరం అమరచింత మున్సిపాలిటీ కేంద్రంలో 10 రోజులపాటు టెంట్ వేసుకొని సమస్యల పరిష్కారం కోసం పోరుబాట నిర్వహిస్తామని అన్నారు.కావున సంబంధిత అధికారులు వెంటనే స్పందించి నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు.కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులపై సమగ్ర విచారణ చేపట్టాలి.పునాది లోతు, నిర్మాణ నాణ్యతను అధికారులు పరిశీలించాలి.నిబంధనల ప్రకారం నాణ్యమైన నిర్మాణ పనులు చేపట్టాలి. బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలి.విద్యార్థుల భద్రత విషయంలో నిర్లక్ష్యం వహిస్తే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.
డ్రగ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలతో మెడికల్ షాపుల యజమానుల్లో గుబులు

డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారుల తనిఖీలు

అమరచింత/ఆత్మకూర్, నవంబర్ 9,(సింగిడి):
ఎక్సైరీ మందుల అమ్ముతున్నారని,ఫిర్యాదుల తో ఆత్మకూర్ పట్టణంలోని రత్న మెడికల్ షాపులో సోమవారం జిల్లా డ్రగ్స్ కంట్రోల్ అధికారులు విస్తృతంగా తడిఖీలు చేపట్టారు.ఎలాంటి రికార్డులు,నిర్వహించకుండా మెడికల్ స్టోర్ కొనసాగిస్తున్నట్లు తనిఖీల్లో బయటపడినట్లు సమాచారం.కొన్ని మందుల కొనుగోళ్లకు రసీదులు లేవని, అధికారులు వెల్లడి.ఫార్మసిస్ట్ అనురాధ తన సర్టిఫికెట్ ను 20 ఏళ్లుగా అద్దెకి మాత్రమే ఇచ్చినట్లు డ్రగ్స్ అధికారులకు తెలిపారు.తన పేరుపై ఉన్న ఫార్మసీ సరిఫికెట్ ఇవ్వాలని డ్రగ్ కంట్రోల్ అధికారులను ఫార్మసిస్ట్ అనురాధ వేడుకోవడం విశేషం. ఆత్మకూరు పట్టణ కేంద్రంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీల నేపథ్యంలో కొన్ని మెడికల్ షాపుల యజమానులు తమ దుకాణాలను అకస్మాత్తుగా మూసివేయడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.సాధారణంగా ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాల్సిన ఔషధ దుకాణాలు తనిఖీల సమయంలో మూతపడటంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తనిఖీల్లో బయటపడతాయనే భయంతోనే దుకాణాలు మూసివేశారా? లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా? అన్న ప్రశ్నలు ప్రజల్లో తలెత్తుతున్నాయి.ఔషధాల విక్రయానికి సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు ప్రతి మెడికల్ షాపు తప్పనిసరిగా పాటించాలి. మందుల నిల్వలు, గడువు ముగిసిన ఔషధాలు, వైద్యుల చీటీ లేకుండా విక్రయించే మందులు, ఫార్మసిస్ట్ అందుబాటు వంటి అంశాలపై సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా ప్రజల ప్రాణాలతో ముడిపడి ఉన్న ఔషధాల విక్రయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావుండకూడదు.ఇటీవల పట్టణంలో కొన్ని మెడికల్ షాపుల్లో గడువు ముగిసిన మందుల విక్రయాలపై అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీల సమయంలో షాపులు మూసివేయడం మరిన్ని ప్రశ్నలకు తావిస్తోంది. అయితే షాపులు మూసివేయడానికి గల అసలు కారణాలు ఏమిటో అధికారుల విచారణలోనే స్పష్టత రావాల్సి ఉంది.
తనిఖీలు అంటే భయపడాల్సిన అవసరం లేని వ్యాపారులు షాపులు మూసివేయాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది? నిబంధనల ప్రకారం వ్యాపారం చేస్తున్నప్పుడు తనిఖీలకు సహకరించాలి కదా? తనిఖీల సమయంలో దుకాణాలు మూసివేస్తే అనుమానాలు మరింత బలపడే అవకాశం ఉంది. అధికారుల దృష్టికి కీలక ప్రశ్నలు!
తనిఖీల సమయంలో షాపులు మూసివేయడానికి గల కారణాలపై విచారణ చేపట్టారా?గడువు ముగిసిన మందులు విక్రయిస్తున్నారా లేదా అనే అంశాన్ని పరిశీలించారా?ప్రతి మెడికల్ షాపులో అర్హత కలిగిన ఫార్మసిస్ట్ అందుబాటులో ఉంటున్నారా? నిబంధనలకు విరుద్ధంగా మందులు విక్రయిస్తున్న దుకాణాలపై చర్యలు తీసుకుంటారా? తనిఖీల అనంతరం ప్రజలకు వాస్తవాలను వెల్లడిస్తారా?ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే సహించేది లేదు!ఔషధాల విక్రయం అనేది సాధారణ వ్యాపారం కాదు.

పిల్లలకు స్వీట్లు బాణసంచా పంపిణీ

కమలాపూర్, నవంబర్ 9 (సింగిడి):
మండలంలోని దేశరాజపల్లి అనుబంధ పల్లె పిట్టలపల్లె గ్రామ పిల్లలకు, దీపావళి పండుగ సందర్భంగా, కాజీపేట ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డి స్వీట్లు, బాణసంచా స్థానికి పోలీసులతో ఆదివారం అందచేశారు.ఈ సందర్భంగా వాటిని అందుకున్న చిన్నారులు గ్రామ పెద్దలు చాలా సంతోషం వ్యక్తం చేస్తూ ఏసీపీ ప్రశాంత్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు.

గిరిజనుల అభ్యున్నతికి అండగా ఉంటా

బిజినపల్లి, నవంబర్ 9 (సింగిడి):
గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, తండాల సమగ్ర అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్సీ శంకర్ నాయక్ హామీ ఇచ్చారు. ఆదివారం బిజినపల్లి మండలానికి చెందిన గిరిజన నాయకులు ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర చైర్మన్‌తో కలిసి ఎమ్మెల్సీ శంకర్ నాయక్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలోని గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు, లంబాడీ గిరిజన తండాల అభివృద్ధి, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా తీసుకోవాల్సిన చర్యలపై ఎమ్మెల్సీలతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో కేతావత్ మాన్య నాయక్, గోవింద్ నాయక్, లక్ష్మణ్ నాయక్, హన్మ్య నాయక్, సర్పంచ్ పుల్య నాయక్, ధర్మ నాయక్, ఆంజనేయులు నాయక్ తదితర గిరిజన నాయకులు పాల్గొన్నారు.

పేద కుటుంబాల్లో వెలుగులు

ఇందిరమ్మ ఇంట్లో తొలి దీపావళి
పాల్గొన్న ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి, కలెక్టర్ హేమంత్ పాటీల్



కల్వకుర్తి నవంబర్ 09 (సింగిడి)
ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమంలో భాగంగా కల్వకుర్తి పట్టణంలోని అంబేద్కర్ నగర్ కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారురాలు టీ. వెంకటమ్మ కుటుంబం నిర్వహించిన తొలి దీపావళి వేడుకల్లో ఎంపీ డాక్టర్ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ పాల్గొన్నారు.ప్రభుత్వ ఆర్థిక సహకారంతో నిర్మాణం పూర్తి చేసుకున్న వెంకటమ్మ ఇంటికి చేరుకున్న ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్ ఆమె కుటుంబ సభ్యులతో కలిసి దీపావళి వేడుకల్లో పాల్గొని పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఇంటిని మామిడి తోరణాలు, బంతిపూల మాలలతో సంప్రదాయబద్ధంగా అలంకరించగా, ఇంటి ముందు వేసిన రంగురంగుల ముగ్గులు, దీపాల వెలుగులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇంటి ఆవరణలో పూజలు నిర్వహించిన అనంతరం ప్రజాప్రతినిధులు, అధికారులు, కుటుంబ సభ్యులతో కలిసి దీపావళి సంబరాలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.
ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ మల్లు రవి మాట్లాడుతూ, ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలనేది జీవితంలో అత్యంత ముఖ్యమైన కల అని, ఇల్లు కేవలం నివాస స్థలం మాత్రమే కాకుండా కుటుంబానికి భద్రత, ఆత్మగౌరవం, స్థిరమైన జీవనానికి పునాది అని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేద కుటుంబాల చిరకాల స్వప్నాన్ని నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. రాష్ట్రాన్ని గుడిసెలు లేని తెలంగాణగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత మంజూరులో గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలకు తొలి ప్రాధాన్యత కల్పించనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ సహకారంతో సొంత ఇంటిని నిర్మించుకున్న కుటుంబాలు తమ ఇంటిలో తొలి దీపావళి జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ,ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో ప్రభుత్వం పూర్తి పారదర్శకత పాటిస్తోందని, లబ్ధిదారులు ఎవరికీ ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఇంటి నిర్మాణ పనుల పురోగతిని బట్టి నాలుగు విడతల్లో మొత్తం 5 లక్షల ఆర్థిక సహాయాన్ని నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నట్లు వివరించారు. మంజూరైన లబ్ధిదారులందరూ ప్రభుత్వ సహకారాన్ని సద్వినియోగం చేసుకొని ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని సూచించారు. నిర్మాణ పనుల్లో ఏవైనా సమస్యలు ఎదురైతే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి సహకరిస్తామని భరోసా ఇచ్చారు. అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.
జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ మాట్లాడుతూ, నాగర్‌కర్నూల్ జిల్లాలో ఇప్పటివరకు మొత్తం 2,802 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని వెల్లడించారు. సొంత ఇంటిని నిర్మించుకున్న పేద కుటుంబాలు తమ ఇంటిలోనే తొలి దీపావళి జరుపుకునేలా ప్రోత్సహించడమే 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయంతో పాటు స్వయం సహాయక సంఘాల ద్వారా కూడా లబ్ధిదారులకు రుణాలు అందిస్తున్నామని వివరించారు.
ఇందిరమ్మ ఇళ్ల రెండో విడతలో మరికొంతమంది అర్హులైన నిరుపేద కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేయనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులను పారదర్శకంగా గుర్తించి మంజూరు ప్రక్రియ చేపడుతున్నామని తెలిపారు. నిర్మాణ పనుల పురోగతిని అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని, లబ్ధిదారులకు అవసరమైన మార్గదర్శకాలు అందిస్తూ నిర్మాణాలు సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందిరమ్మ కమిటీలు కూడా ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు వెంకటమ్మ కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా సొంత ఇంటిలో దీపావళి పండుగ జరుపుకోవాలనే తమ కోరిక ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నెరవేరిందని ఆనందం వ్యక్తం చేశారు. తమ ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులతో కలిసి పండుగ జరుపుకొని శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ, ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో, కల్వకుర్తి మున్సిపల్ చైర్‌పర్సన్ బృంగి రత్నమాల, వైస్ చైర్మన్ షానవాజ్ ఖాన్, జిల్లా గృహ నిర్మాణ సంస్థ ఇన్‌చార్జి ప్రాజెక్టు డైరెక్టర్ గోపాల్ నాయక్, మున్సిపల్ కమిషనర్ అహ్మద్, ఎంపీడీవో యాదయ్య, తహసీల్దార్, ఇబ్రహీం, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆనంద్ కుమార్, మున్సిపల్ కౌన్సిలర్లు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పెద్దపల్లిలో అక్రమ వెంచర్

చర్యలు తీసుకోవాలని
ప్రజావాణిలో ఫిర్యాదు



పెద్దపల్లి ప్రతినిధి, నవంబర్ 9 (సింగిడి):
పెద్దపల్లి పురపాలక సంఘం పరిధిలోని శాంతినగర్ 2వ వార్డులో డీటీసీపి అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మిస్తున్న వెంచర్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. మాజీ ఎన్ఎస్ యూఐ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బండారి సునీల్ గౌడ్ ఈ మేరకు కలెక్టర్‌ను కలసి ఫిర్యాదు అందించారు. శాంతినగర్ 2వ వార్డులోని రాజీవ్ రహదారిని ఆనుకొని ఉన్న సర్వే నంబర్లు 518/4, 519 లలో కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఎలాంటి డీటీసీపీ, మున్సిపల్ లేఅవుట్ అనుమతులు లేకుండా అక్రమంగా వెంచర్ నిర్మిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. భూభారతి పోర్టల్‌లో ఈ భూములు ఇప్పటికీ వ్యవసాయ భూములుగానే నమోదై ఉన్నాయని, కేవలం నాలా ప్రాసెస్ మాత్రమే జరుగుతోందని తెలిపారు. మున్సిపల్ అనుమతులు లేకుండానే రోడ్లు వేసి, చుట్టూ కాంపౌండ్ వాల్స్ నిర్మించారని, అంతేకాకుండా నిబంధనల ప్రకారం వదలాల్సిన 10 శాతం ప్రజా అవసరాల భూమిని కూడా కేటాయించకుండా మున్సిపాలిటీకి రిజిస్ట్రేషన్ చేయలేదని వెల్లడించారు.కేవలం నాలా ప్రొసీడింగ్స్‌తో ప్లాట్లు కొనుగోలు చేస్తే భవిష్యత్తులో భవన నిర్మాణ అనుమతులు రావు అని, రేరా నిబంధనలను ఉల్లంఘిస్తూ ప్లాట్లు విక్రయిస్తున్నారని ప్రజలను హెచ్చరించారు. ఈ క్రమంలో సర్వే నంబర్లు 518/4, 519 లలోని అక్రమ లేఅవుట్‌పై సమగ్ర విచారణ జరిపించాలని, నాలా ప్రాసెస్‌ను నిలిపివేయాలని తహసిల్దార్ నుఆదేశించాలని కోరారు. అలాగే మున్సిపల్ అనుమతులు లేని రోడ్లు, కాంపౌండ్ వాల్స్‌ను తొలగించడంతో పాటు, డీటీసీపీ అనుమతులు వచ్చే వరకు ప్లాట్ల రిజిస్ట్రేషన్లను నిలిపివేసేలా సబ్-రిజిస్ట్రార్‌ను ఆదేశించి, అమాయక ప్రజలను మోసపోకుండా కాపాడాలని వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు.

క్రీడలతో మానసిక, శారీరక ఉల్లాసం

మల్హర్, నవంబర్ 09 (సింగిడి):
మండల కేంద్రమైన తాడిచెర్ల కోల్ బ్లాక్-1 ఏఎంఆర్ కంపెనీ 9వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న క్రీడా పోటీల ప్రారంభ వేడుకలు సోమవారం ప్రాజెక్ట్ హెడ్ ప్రభాకర్ రెడ్డి అధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి.ఈ సందర్భంగా కంపెనీ వైస్ ప్రెసిడెంట్ కేవీఎన్ మూర్తి మాట్లాడుతూ.. క్రీడల వల్ల శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని అన్నారు. క్రీడాకారులందరూ క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని సూచించారు.ప్రస్తుత కాలంలో యువత మొబైల్ ఫోన్లలో ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటు పడకుండా మైదానాల్లో క్రీడలు ఆడటానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. మైదానాల్లో క్రీడలు ఆడటం వల్ల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు ఉత్సాహం, ఐకమత్యం పెంపొందుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సేఫ్టీ మేనేజర్ సురేష్ బాబు, జీఎం మెకానికల్ విశ్వప్రసాద్, ఫిట్ ఇంజనీర్ కిషన్, సర్వే జీఎం సర్వోత్తమ్, హెచ్ఆర్ డీజీఎం రమేష్ బాబు, కంపెనీ ఉద్యోగులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు



కల్వకుర్తి నవంబర్ 09 (సింగిడి) : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి, కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. కొడంగల్‌లోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసంలో ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ముఖ్య మంత్రిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, ప్రజాసేవలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ముఖ్యమంత్రి చేపడుతున్న కార్యక్రమాలు మరింత విజయవంతం కావాలని అభిలషించారు.

వరంగల్ పశ్చిమ నియోజకవర్గం గౌరవ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గారి సూచనలతో 31వ డివిజన్‌లో స్థానిక ప్రజలతో కలిసి దీపావళి సంబరాలు ఘనంగా నిర్వహించడం జరిగింది.అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేస్తూ జన్మదిన వేడుకలు జరుపుకున్నారు.ఈ కార్యక్రమం తాజా మాజీ కార్పొరేటర్ మామిండ్ల రాజు గారు డివిజన్ ఇంచార్జి మార్క విజయ్ కుమార్ గారి అధ్యక్షతన నిర్వహించబడింది .ఈ కార్యక్రమంలో DCC మెంబర్ మామిళ్ల సురేష్ పిండి రమేష్ మంద సునీల్ కనుకుంట్ల కృష్ణ, శీలం శ్రీనివాస్ వెనుకంటి తిరుపతి కోడిగొప్పుల సంజీవ మామిండ్ల రమేష్ వెనుకంటి రామ్ పిండి హరీష్ కూర క్రాంతి వేల్పుల సాయి మావిదాల సంతోష్ మాచర్ల అనిల్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు యూత్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. తదితరులు పాల్గొన్నారు.



ఈనెల20 నుండి కార్తీక్ ఉత్సవాలు

ఉమ్మడి నల్గొండ బ్యూరో నవంబర్ 9 (సింగిడి):
శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఈ నెల 20 నుండి 22 వ తేదీ వరకు నిర్వహించే కార్తీకోత్సవాల పోస్టర్ ను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, యాదగిరిగుట్ట ఈ.ఓ భవని శంకర్,రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి తో కలిసి కలెక్టరేట్ లో ఆవిష్కరించారు. కార్తీకోత్సవం – 2026 యాదగిరిగుట్ట దేవస్థానం (వైటిడి) – శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవాలయం ఈ దేవస్థానం నందు పవిత్రమైన కార్తీకమాసం 2026 సందర్భంగా యాదగిరిగుట్ట దేవస్థానం నందు ధార్మిక భక్తి శ్రద్ధలతో, ఆధ్యాత్మిక వైభవంతో కార్తీకోత్సవం 2026 ఘనంగా నిర్వహించుటకు గాను తేది.20.11.2026 నుండి 22.11.2026 వరకు మూడు రోజుల పాటు భక్తి మరియు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడుచున్నవి.కార్తీకమాసం యొక్క పవిత్రతను, ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను గుర్తించి, భారతీయ సంస్కృతి– వారసత్వాన్ని మరియు సంప్రదాయ ప్రదర్శన కళలను పరిరక్షించి, ప్రోత్సహించాలనే ధృడ సంకల్పంతో యాదగిరిగుట్ట దేవస్థానం (వైటిడి) మొదటిసారిగా మూడు రోజుల సాంస్కృతిక ఆధ్యాత్మిక మహోత్సవాన్ని కార్తికోత్సవం 2026 పేరుతో నిర్వహించడానికి సన్నద్ధమైంది.ఈ ఉత్సవాలలో ప్రఖ్యాత ధార్మిక పండితులు, ఆధ్యాత్మిక వక్తల ఆధ్యాత్మిక ప్రవచనాలు, మనోహరమైన శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు, ప్రముఖ సంగీత విద్వాంసులు భక్తి సంగీత కచేరీలు, అలాగే ప్రసిద్ధ కళాకారులు ప్రదర్శించే వివిధ సంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి.భక్తులలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని, భక్తిని పెంపొందించే దివ్య లక్ష్యంతో, మన సంస్కృతి యొక్క శాశ్వత వైభవాన్ని, భారతదేశ శాస్త్రీయ కళారూపాల వైభవాన్ని మరియు తెలంగాణ ప్రత్యేక సాంస్కృతిక వారసత్వాన్ని ప్రదర్శిస్తూ, ఈ పవిత్ర ఉత్సవాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా సంప్రదాయబద్ధంగా నిర్వహించడానికి దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది.తేది.20.11.2026 శుక్రవారం నుండి తేది.22.11.2026 ఆదివారం వరకు నిర్వహించుకార్యక్రమముల వివరములు:::తేది.20.11.2026 శుక్రవారం::బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణి శర్మగారిచే ఆధ్యాత్మిక ప్రవచనం| సాయంత్రం గం.6.00ల నుండి గం.7.30ని.ల వరకు| శ్రీమతి తేలు విజయ గారిచే| జానపద భక్తి సంగీత కార్యక్రమంరాత్రి గం.7.30ని.ల నుండి9.00గం.ల వరకుతేది:21.11.2026 శనివారంశ్రీ ఆర్.పి.పట్నాయక్ ,శ్రీ నిహాల్, శ్రీమతి నిత్యసంతోషిని, శ్రీమతి గోపిక పూర్ణిమ,శ్రీమతి శ్రీనిధి శ్రీమతి స్వప్న (జర్నలిస్టు) ,వాద్య బృందం సహకారంతో నృత్య కార్యక్రమాలు పరంపర సంస్థ వారి దర్శకత్వంలోసాయంత్రం గం.6.00ల నుండి రా 07.30 ని.ల వరకు.తేది:22.11.2026 ఆదివారంయుద్రాక్ష ఫౌండేషన్ వారిచే ఒడిస్సి నృత్య ప్రదర్శన:: సా 6.00 గంటల నుండి రా.07.30 ని.ల వరకు అభినేత్రి బృందం వారిచే తెలంగాణ దేవాలయాల ఇతివృత్తం పై నృత్య ప్రదర్శన:: రా.07.గంటల నుండి 08.00 గంటల వరకు కళాకృష్ణ బృందం పేరిణి /రుద్రాక్ష ఫౌండేషన్ వారిచే ఒడిస్సీ మరియు అభినేత్రం ఎ సెంబుల్ టెంపుల్స్ ఆఫ్ తెలంగాణ వారిచే నృత్యప్రదర్శన::రాత్రి గం.8.00ల నుండి గం.9.00 వరకు శ్రీ లక్ష్మీనరసింహ నామార్చన సహిత కోటి పుష్పార్చన కార్తీక ఉత్సవం 2026లో భాగంగా, మొదటి రోజున ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని శుక్రవారం, తేది.20.11.2026న దేవస్థానం అర్చక బృందంచే శ్రీ లక్ష్మీనరసింహ నామార్చన సహిత కోటి పుష్పార్చన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారినిh దివ్య నామాలతో స్తుతిస్తూ, కోటి పుష్పాలతో అర్చించే పూజ) నిర్వహించబడును. ఇట్టి కార్యక్రమం ఉదయం 7.00గం.ల నుండి మధ్యాహ్నం 12.0గం.ల వరకు జరుగును.



వాల్ పోస్టర్ ఆవిష్కరణ



ఖమ్మం, నవంబర్ 9(సింగిడి):
అఖిల భారత రైతు సంఘం (AIKS) జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ పిలుపునిచ్చారు. నవంబర్ 15, 16, 17, 18 తేదీలలో నల్లగొండ జిల్లాలో నిర్వహించనున్న జాతీయ మహాసభలకు★ సంబంధించిన వాల్ పోస్టర్‌ను సోమవారం ఖమ్మం స్థానిక సుందరయ్య భవనంలో ఘనంగా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్, రాష్ట్ర నాయకులు నున్నా నాగేశ్వరరావు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్, జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు పాల్గొని పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా రైతులు, వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. రైతాంగ హక్కుల సాధన, వ్యవసాయ కార్మికుల సంక్షేమం, రైతు కూలీల సమస్యలపై జాతీయ మహాసభల్లో విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు. మహాసభలు సందర్భంగా నవంబర్ 15 న జరిగే రైతు బహిరంగ సభ మహాసభలను విజయవంతం చేయడానికి రైతు సంఘం, ప్రజాసంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల రాష్ట్ర, జిల్లా నాయకులు యం సుబ్బారావు,కళ్యాణ వెంకటేశ్వరరావు, తుమ్మ విష్ణువర్ధన్, వాసిరెడ్డి ప్రసాద్,ఎస్.కె. మీరా, ప్రతాప నేని వెంకటేశ్వర్లు, పడగల నాగేశ్వరరావు, నామా లక్ష్మి నారాయణ,రెడపంగి ప్రకాష్, డివైఫ్ఐ జిల్లా కార్యదర్శి మధు, వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

బీపీఎం ను నియమించాలి



ఆర్మూర్, నవంబర్ 9 (సింగిడి) :
నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం మోర్తాడ్ మండలం, తిమ్మాపూర్ గ్రామానికి శాశ్వత బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ (బిపిఎంను) నియమించాలని కోరుతూ స్థానిక తిమ్మాపూర్ గ్రామ సర్పంచ్ పుప్పాల నరేష్ సోమవారం రోజున జిల్లా కేంద్రంలో హెడ్ పోస్ట్ ఆఫీస్ లో గల సీనియర్ సూపరిం టెండెంట్, పోస్ట్ ఆఫీస్, నిజామాబాద్ అధికారికి కి (లేఖ) వినతి పత్రం అందజేశారు. తిమ్మాపూర్ గ్రామంలో మొత్తం 788 పెన్షన్లు దారులు ఉన్నారని,గత 5-6 సంవత్సరాలుగా గ్రామంలో శాశ్వత బిపిఎం లేకపోవడంతో, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తిమ్మాపూర్ గ్రామ సర్పంచ్ పుప్పల నరేష్ (లేఖ) ద్వారా వినతిపత్రంలో జిల్లా పోస్ట్ ఆఫీస్ హెడ్ ఆఫీస్ అధికారికి విన్నవించారు.ప్రస్తుతం కుక్కునూర్ బి.ఓ. వేల్పూర్ ఎస్. ఓ.లో, వీ.బి.పి.ఎం.గా, విధులు నిర్వ హిస్తున్న గంగాధర్, తిమ్మాపూర్ గ్రామంలో ఇన్‌చార్జ్ ఏ.బి.పి.ఎం. గా అటు ఆ గ్రామంలో ఇటు ఈ గ్రామంలో విధులు నిర్వహించడం వల్ల, ఆయన 2 నెలలకు, 3 నెలలకు, 6 నెలలకు ఒక్కసారి వస్తున్నప్పటికీ, 90% పెన్షన్ పేమెంట్‌ను వృద్ధుల ఇంటింటికి వెళ్లి, బెడ్ పేషెంట్‌లకు సైతం నేరుగా అందజేస్తున్నారని తెలిపారు.అంతేకాకుండా ఎస్. బి. ఆర్.డి. ఎస్.ఎస్. ఏ. టీ.డీ. ఎం.ఐ.ఎస్. పి.ఏ.ఎఫ్. సీనియర్ సిటిజన్, ఆర్.డి.ఐ., పి.ఎల్. ఐ.వంటి పొదుపు పథకాలు కట్టడానికి, ఇన్సూరెన్స్ విషయంలో కూడా గ్రామస్తులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని సర్పంచ్ పుప్పల నరేష్ సవినయంగా జిల్లా హెడ్ పోస్ట్ ఆఫీస్ అధికారికి విన్నవిస్తూ, ప్రజల బాధలను వివ రించారు.అందుకే ఎటువంటి నిర్లక్ష్యం లేకుండా పనిచేస్తున్న ఏ.పీ. బి.ఎం.గంగాధర్ ని తిమ్మాపూర్ గ్రామానికి శాశ్వత ఏబీపీఎంగా నియమించాలని గ్రామ పంచాయతీ తరపున, గ్రామస్తుల తరపున కోరుతున్నామని సర్పంచ్ పుప్పాల నరేష్ కోరారు.శాశ్వత బి.పి.యం. ను నియమిస్తే గ్రామంలోని పేద, వృద్ధ పెన్షనర్లకు ప్రతి నెలా సకాలంలో పెన్షన్ అందుతుందని, పొదుపు పథకా లన్నీ సక్రమంగా అందించేందుకు ఉపయోగపడుతుందని, వృద్ధుల పెన్షన్ దారులకు, మహిళా పెన్షన్ దారులకు, చేనేత,బీడీ కార్మిక పలు పెన్షన్ లబ్ధిదారులకు సౌకర్యం కలుగుతుందని సర్పంచ్ పుప్పాల ఆయన అన్నారు.

విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ



ఆమనగల్లు, నవంబర్ 09 (సింగిడి):
చలికాలం తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో, తలకొండపల్లి మండలం ఖానాపూర్ గ్రామ సమీపంలోని "జామియా ఇస్తామియా దారుల్ ఉలూమ్ కౌసర్" మదర్సాలో ఆశయం పొందుతూ చదువుకుంటున్న నిరుపేద విద్యార్థులకు మానవతా దృక్పథంతో దుప్పట్లను (బ్లాంకెట్స్) పంపిణీ చేశారు. ప్రస్తుత వాతావరణ మార్పుల వల్ల చలి తీవ్రతకు విద్యార్థులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో మాజీ జామ మస్జీద్ అధ్యక్షులు సయ్యద్ ఖలీల్ ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా సయ్యద్ ఖలీల్ మాట్లాడుతూ.. సమాజంలో ఆదరణకు నోచుకోని, వెనుకబడిన పేద విద్యార్థులకు తమ వంతుగా సహాయం అందించడం ఎంతో తృప్తిని ఇస్తుందని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యాన్ని కూడా కాపాడుకో వాలని, ఈ చిన్న సహాయం వారికి ఎంతో కొంత ఊరటనిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మదర్సా విద్యార్థుల అవసరాలను గుర్తించి, సకాలంలో దుప్పట్లను అందజేసిన దాతల ఉదారత్వాన్ని స్థానిక ప్రజలు మరియు మదర్సా నిర్వాహకులు ప్రత్యేకంగా అభినందిస్తూ కృతజ్ఞతలు తెలియజే శారు. ఈ కార్యక్రమంలో మదర్సా ప్రిన్సిపల్ మౌలానా అబ్దుల్ కరీం, మైనార్టీ నాయకులు మహబూబ్, నిజాముద్దీన్ బాబా,షరీఫ్, హనీఫ్, అబ్బు, హఫీజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మఠంపల్లిలో చర్మవ్యాధుల కలకలం

గ్రీవెన్స్ లో అధికారులకు ఎమ్మార్పీఎస్ నాయకుల వినతి

హుజూర్ నగర్, నవంబర్ 09 (సింగిడి):
మఠంపల్లి మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో చిన్నపిల్లలు, పెద్దలు గజ్జి, తామర వంటి చర్మవ్యాధులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మార్పీఎస్ నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తూ బాధితులకు తగిన వైద్య సేవలు అందుబాటులో లేకపోవడంతో అనేకమంది మెడికల్ షాపులను ఆశ్రయిస్తూ మందులు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు.
ఈ సమస్యపై స్పందించిన ఎమ్మార్పీఎస్ నాయకులు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు.
★నీటి ట్యాంకుల శుభ్రతపై అనుమానాలు★
గ్రామాల్లోని నీటి ట్యాంకుల ద్వారా సరఫరా అవుతున్న నీటి నాణ్యతపై ప్రజల్లో అనుమానాలు వ్యక్త మవుతున్నాయని నాయకులు పేర్కొన్నారు. ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేస్తున్నారా? నీటి శుద్ధి సక్రమంగా జరుగుతోందా? అనే అంశాలపై అధికారులు పరిశీలన చేపట్టాలని కోరారు. చర్మవ్యాధులకు సరఫరా నీరే కారణమా అనే విషయాన్ని నిర్ధారించేందుకు నీటి నమూనాలను సేకరించి ప్రయోగశాలల్లో పరీక్షలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.
★ప్రభుత్వ వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి★
మండలంలోని పలు గ్రామాల్లో గజ్జి, తామర వంటి చర్మవ్యాధులతో బాధపడుతున్న చిన్నపిల్లలు, పెద్దలను గుర్తించి ప్రభుత్వ వైద్యులు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని కోరారు. బాధితులకు ఉచిత వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు అందించాలని విజ్ఞప్తి చేశారు. వైద్య సేవలపై అవగాహన లేక, తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక బాధితులు మెడికల్ షాపులక వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి గ్రామాల్లో పర్యటించి ప్రజల ఆరోగ్య పరిస్థితులను పరిశీలించాలని, నీటి ట్యాంకులను శుభ్రం చేయించి సురక్షిత తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ నాయకులు ఇరుగు ప్రభు మాదిగ, మండల సీనియర్ నాయకులు దేవప్పంగు ప్రసాద్ మాదిగ, మండల ఉపా ధ్యక్షులు కాటిపల్లి మల్లేష్ మాదిగ, మండల నాయకులు ఆరాల నాగరాజు మాదిగ, చౌటపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు జి. సంజు కుమార్ మాదిగ, పి. జానకిరాముడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీలు స్వీకరించిన కలెక్టర్

*** సత్వరమే పరిష్కరించాలని అధికారులకు ఆదేశం**



ఖమ్మం, నవంబర్- 09(సింగిడి):
ప్రజావాణిలో ప్రజలు సమర్పించిన అర్జీలను పరిశీ లించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ , అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు.
-తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్, ఎల్నినో నేపథ్యంలో పంట రుణాల వడ్డీ మాఫీ చేసి రెన్యువల్ చేయాలని, పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి పత్తికి, మిర్చికి 50 వేల రూపాయలు వరి పంటకు 30 వేల నష్ట పరిహారం ఇవ్వాలని, పంటల బీమా పథకం అమలు చేయాలని, కూరగాయల, పండ్ల తోటలను కోతుల బెడద నుంచి రక్షించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, వ్యవసాయ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.
-బోనకల్ మండలం మోటమర్రి గ్రామ సర్పంచ్ ఎం. సురేష్ గ్రామ పరిధిలోని ఇసుక క్వారీ నుండి ఇసుక రవాణా కొరకు అధికారికంగా అనుమతి మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, మైన్స్ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.
-పెనుబల్లి మండలం జెడ్పీహెచ్ఎస్ కొండ్రుపాడు పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుని కేటాయించవల సిందిగా కోరుతూ గ్రామ పెద్దలు దరఖాస్తు సమర్పిం చగా, జిల్లా విద్యాశాఖ అధికారికి రాస్తూ ప్రాధాన్యత క్రమంలో సమస్య పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు.
జిఓ 59 దరఖాస్తుల పరిశీలన పురోగతిపై సంబంధిత జిల్లా అధికారులను అడిగి, ప్రతి దరఖా స్తుపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టి నవంబర్ 20వ తేదీలోగా పూర్తి చేయాలనీ, భూమి విస్తీర్ణం, హద్దులు, భూమి స్వభావాన్ని ఖచ్చితంగా నమోదు చేయాలనీ సూచించారు.
ఇట్టి ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

రైతు మేళాతో రైతులకు మేలు



అదనపు కలెక్టర్ నర్సింగరావు

గద్వాల బ్యూరో నవంబర్ 9 (సింగిడి):
రైతు మేళాతో ఆధునిక వ్యవసాయ పరికరాలు, ఇతర సాంకేతికతపై, ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కలుగుతుందని అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు.
వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హకీంపేట గ్రామంలో ఈనెల ఏడవ తేదీ నుంచి 9వ తేదీ వరకు మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న కిసాన్ మేళాకు సోమవారం జిల్లా నుంచి 50 బస్సుల్లో రైతులు తరలి వెళ్లారు. కలెక్టరేట్ ఆవరణలో అదనపు కలెక్టర్ నర్సిం గరావు జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా రైతులు వ్యవసాయంలో నూతన విధానాలను అవలంబిస్తే మంచి ఫలితాలు వస్తాయ న్నారు. ముఖ్యంగా ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తు లను పండించడానికి సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలని సూచించారు. నేల సారవంతతను కాపాడడానికి రసాయనిక ఎరువుల స్థానంలో నానో యూరియా వినియోగించడం అవసరమని సూచించారు. పర్యావరణ పరిరక్షణతో భవిష్యత్తు తరాల మనుగడ ఆధారపడి ఉంటుందన్నారు. కాబట్టి రైతులు కిసాన్ మేళాను సద్వినియోగం చేసు కోవాలనే ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా మూడు రోజులపాటు వ్యవసాయానికి, అనుబంధ రంగాలకు సంబంధించిన వివిధ స్టాల్స్ ఏర్పాటు చేసి అవగా హన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

రెండోసారి సౌజన్య ఎన్నిక



ఖమ్మం, నవంబర్ 09(సింగిడి):
రాజకీయాల్లో పదవులు రావడం ఒక ఎత్తయితే, కష్ట కాలంలో పార్టీ కోసం నిలబడి పనిచేయడం మరో ఎత్తు. పార్టీకి ప్రతికూల పరిస్థితులు ఎదురైన సమ యంలోనూ వెనుకడుగు వేయకుండా, మహిళా కాంగ్రెస్‌ను బలోపేతం చేయడానికి కృషి చేసిన దొబ్బల సౌజన్య మరోసారి ఖమ్మం జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఎన్నిక కావడం ప్రాధాన్యత సంతరించుకుంది.
గతంలో రాజకీయ పరిస్థితులు అనుకూలంగా లేని సమయంలో కూడా పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ, మహిళా కార్యకర్తలను సమన్వయం చేస్తూ, కాంగ్రెస్ పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకె ళ్లేందుకు ఆమె పనిచేశారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఎలాంటి పదవుల ఆశించ కుండా, తనకు అప్పగించిన బాధ్యతను కొనసాగిం చడం ఆమె రాజకీయ ప్రయాణంలో ప్రస్తావించద గిన అంశం.మహిళా కాంగ్రెస్‌ను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం, మహిళా కార్యకర్తలకు ప్రోత్సాహం అందించడం, మహిళల సమస్యలపై స్పందించడం వంటి అంశాల్లో ఆమె మరింత చురుకైన పాత్ర పోషించాల్సిన బాధ్యత ఇప్పుడు ఆమెపై ఉంది.
రెండోసారి అధ్యక్షురాలిగా ఎన్నిక కావడం అనేది కేవలం ఒక పదవి కొనసాగింపు మాత్రమే కాదు. గతంలో నిర్వహించిన బాధ్యతలకు మరోసారి అప్ప గించిన గుర్తింపుగా భావించవచ్చు. ఈ కొత్త బాధ్య తలతో ఖమ్మం జిల్లాలో మహిళా కాంగ్రెస్ మరింత విస్తరించాలని, మహిళా కార్యకర్తలకు సముచిత గుర్తింపు వస్తుందని కార్యకర్తలు భావిస్తున్నారు.కష్ట కాలంలో పార్టీ కోసం పనిచేసిన వారి సేవలను గుర్తించడం, వారికి బాధ్యతలు అప్పగించడం రాజకీ యాల్లో మంచి సంప్రదాయానికి నిదర్శనం.

కరెంటు సమస్యకు పరిష్కారం

అమరచింత, నవంబర్ 9 (సింగిడి):
అమరచింత మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో గర్ల్స్ హై స్కూల్ నుండి ఆజాద్ నగర్ వరకు గత కొన్ని సంవత్సరాల నుండి లైట్లు లేక రాత్రి సమయంలో ఆ దారిలో వెళ్లడానికి మహిళలు, వృద్ధులు, చిన్న పిల్లలు అనేక ఇబ్బందులకు గురవు తున్నారు.ఈ విషయాన్ని వార్డు ప్రజలు 3వ వార్డు కౌన్సిలర్ పి. తిరుమలేష్ దృష్టికి తీసుకెళ్లగా, వారు విద్యుత్ ఏఈ తో మాట్లాడి ఈరోజు చెట్ల కొమ్మలను తొలగించి నూతనంగా కరెంట్ కేబుల్ వైర్లను దగ్గరుండి వేయించి లైట్స్ అమర్చడం జరిగింది.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

తెలంగాణ బీసీ, ఎస్సీ,ఎస్టీ, మైనారిటీ సంక్షేమ వేదిక రాష్ట్ర అధ్యక్షులు బుస్సాపూర్ శంకర్ కు సన్మానం



ఆర్మూర్ , నవంబర్ 9 (సింగిడి) :
చక్రధర్ నగర్ తండా, గొల్లగుట్టలో నిర్వహించిన శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయ వార్షిక ఉత్సవ వేడుకల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారతీయ జనతా పార్టీ నాయకులు, బీసీ–ఎస్సీ–ఎస్టీ, మైనారిటీ రాష్ట్రసంక్షేమ వేదిక రాష్ట్ర అధ్యక్షులు బుస్సాపూర్ శంకర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. సంత్ సేవాలాల్ మహారాజ్ వేడుకలకు మహిళలు, యువకులు, యువతులు, తండావాసులు, కాలనీవా సులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు జరిపి సంత్ సేవాలాల్ వార్షిక ఉత్సవ వేడుకలను ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలు చల్లగా ఉండాలని, పిల్లాపాపలతో ఆయురారోగ్యాలతో ఉండాలని, వర్షాలు పుష్కలంగా కురిసి పాడిపంటలు పండాలని, సిరి సంపదలతో చల్లగా ఉండాలని తండావాసులు సంత్ సేవాలాల్ మహారాజును వేడు కున్నారు. వివిధ నృత్యాలతో వేడుకలను కన్నుల వైభవంగా నిర్వహించారు. నంగర భేరి లంబాడా హక్కుల పోరాట సమితి నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బాణోత్ రాందాస్, జిల్లా ఉపాధ్యక్షులు బాదావత్ శ్రీరామ్ నాయక్, బుస్సాపూర్ శంకర్ ని సంత్ సేవాలాల్ మహారాజ్ ఉత్సవ వేడుకల్లో ఘనంగా సన్మానించి, సత్కరించారు.ఈ సందర్భంగా ఈ సంత్ సేవాలాల్ కార్యక్రమ నిర్వాహకులను, ఆలయ కమిటీ చైర్మన్ లాల్ సింగ్ నాయక్ ని, బిజెపి నాయకులు, బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ రాష్ట్ర సంక్షేమ వేదిక అధ్యక్షులు బుస్సాపూర్ శంకర్ ప్రత్యేకంగా సన్మానించి అభినందించారు. సంత్ సేవాలాల్ మహారాజ్ ఆశయాలు, బంజారా సమాజ ఐక్యత, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన ఆవ శ్యకతను ఈ సందర్భంగా గుర్తుచేశారు.

ఈ నెల 12న ఉచిత వైద్యశిబిరం



నాగర్‌కర్నూల్ నవంబర్ 9 (సింగిడి) :
కాలేయ వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించి, తగిన వైద్య చికిత్స అందించాలనే ఉద్దేశంతో ఈ నెల 12వ తేదీ గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఉచిత ఫైబ్రో స్కాన్ పరీక్షా శిబిరం నిర్వ హించనున్నట్లు గ్యాస్ట్రాలజీ స్పెషలిస్ట్ డాక్టర్ మణికంఠ జగదీష్ తెలిపారు.
జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీలో ఉన్న శ్రీ మణికంఠ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు. సాధార ణంగా సుమారు రూ.5 వేల విలువ చేసే ఫైబ్రో స్కాన్ పరీక్షను ఈ శిబిరంలో పూర్తిగా ఉచితంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ,ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

దీపావళి వేడుకల్లో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్



నిజామాబాద్ ప్రతినిధి, నవంబర్ 9 (సింగిడి) :
దీపావళి నగర ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపాలని భగవంతుడిని కోరుకున్నట్లు అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. దీపావళి పండుగను పురస్కరించుకొని నగరంలోని కిసాన్ ఫ్యాషన్ మాల్ లో ఎమ్మెల్యే ధన్ పాల్ ఘనంగా లక్ష్మీ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నరకాసురుడిని వధించి విజయం సాధించిన రోజుగా దీపావళి పండగను నిర్వహిస్తామన్నారు. హిందూ సంప్రదాయంలో దీపావళికి ప్రత్యేక స్థానం ఉందని,భారతీయ సంస్కృతిలో ప్రతి పండుగకు ఒక పరమార్థం, ఒక సందేశం ఉంటుందన్నారు. అలాంటి గొప్ప ఆధ్యాత్మిక, సాంస్కృతిక పండుగ దీపావళి అని చెప్పారు. దీపావళి మనకు నేర్పేది ఒక్కటేనని.. ఎన్ని చీకట్లు ఎదురైనా ఒక చిన్న దీపం వెలుగును పంచగలదన్నారు. అదేవిధంగా సమాజంలో ఎన్ని సమస్యలు ఉన్నా ఒక మంచి ఆలోచన, ఒక మంచి వ్యక్తి సమాజంలో మార్పు తీసుకురాగలరన్నారు. శ్రీరాముడి ఆదర్శ పాలన, శ్రీకృష్ణుడి ధర్మరక్షణ, లక్ష్మీదేవి అనుగ్రహం అందరికీ స్ఫూర్తిగా నిలవాలన్నారు. ప్రతి ఇంట్లో ఆనందం, ప్రతి కుటుంబంలో ఐశ్వర్యం, ప్రతి మనసులో సంతోషం వెల్లివిరియాలన్నారు. మన దేశ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే తెలిపారు.

జాతీయ న్యాయ సేవల దినోత్సవ వేడుకల్లో పురస్కారాలు



కొత్తగూడెం నవంబర్ 09 (సింగిడి):
జాతీయ న్యాయ సేవల దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలో హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఫౌండేషన్ నేషనల్ ఫౌండర్ అండ్ ప్రెసిడెంట్ డాక్టర్ బొడ్డపాటి దాసు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు భాస్కర్, జనరల్ సెక్రటరీ శ్రీనిలత, డీఎంహెచ్ఓ శ్రావణ్ బాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ఫౌండేషన్ ప్రతినిధులు తమ సేవలతో గుర్తింపు పొందారు. జిల్లా అధ్యక్షులు మాలోతి రామదాసు నాయక్, జిల్లా కన్వీనర్ మాతంగి రాధా, జిల్లా హానరబుల్ ప్రెసిడెంట్ సిరివెన్నెల, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ జ్యోతి లకు ఉత్తమ సేవా పురస్కారాలను అందజేసి ఘనంగా సత్కరించారు. సామాజిక సేవా కార్యక్రమాలు, ప్రజలకు సేవలందించడంలో చూపిన చొరవను గుర్తిస్తూ ఈ పురస్కా రాలను ప్రదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ అవార్డులు అందుకోవడంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలి

- ప్రతి ఇంటా సుఖసంతోషాలు వెల్లివిరియాలి
- ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



ఉప్పల్, కాప్రా మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 9(సింగిడి): అంధకారంపై వెలుగు,చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే దీపావళి పండుగను ఉప్పల్ నియోజకవర్గ ప్రజలందరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గ ప్రజలకు ప్రజలకు ఎమ్మెల్యే దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. దీపావళి పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త ఆశలు, ఆనందాలు, ఆరోగ్యం, ఐశ్వర్యం నింపాలని కోరుకున్నారు. ప్రతి ఇల్లు ఆనందాల దీపాలతో ప్రకాశించాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, ప్రతి ఒక్కరి జీవితాల్లో శాంతి, సౌభాగ్యం, అభివృద్ధి వెల్లివిరియాలని ఆకాంక్షించారు. సమాజంలో ప్రేమాభిమానాలు, సోదరభావం మరింత పెంపొందించుకుంటూ పండుగను కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఉప్పల్ నియోజకవర్గ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఘనంగా మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి



వికారాబాద్ ప్రతినిధి, నవంబర్ 9 (సింగిడి): తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, స్థానిక శాసన సభ్యులు, తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆదేశాల మేరకు శనివారం మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి అనే కార్యక్రమాన్ని వికారాబాద్ 10 వ వార్డు అనంతగిపల్లిలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక కౌన్సిలర్ మున్సిపల్ వైస్ చైర్మన్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంతో వికారాబాద్ లో పేదల జీవితాల్లో వెలుగులు నిండాయి అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి, వికారాబాద్ శాసనసభ్యుడు గడ్డం ప్రసాద్ కుమార్ అదేవిధంగా స్థానిక మునిసిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య ప్రత్యేక చొరవతో వికారాబాద్ నియోజకవర్గంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాని అర్హులు ఎవరైనా ఉంటే స్థానిక కౌన్సిలర్ ను సంప్రదించి దరఖాస్తూ చేసుకోవచ్చని చెప్పారు. రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ళు అర్హుల కోసం రెడీ గా ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ మునిసిపల్ కమిషనర్ విక్రమ సింహా రెడ్డి, హౌసింగ్ ఏఈ శివ శంకర్, వార్డు ఆఫీసర్ శ్రీకాంత్,కాంగ్రెస్ పార్టీ పట్టణ వైస్ ప్రెసిడెంట్ రెడ్డియనాయక్, డైరెక్టర్ రాజు నాయక్, శేఖర్, నాగరాజు, సోషల్ మీడియా నందు, కురువ శీను, బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసిన ప్రజలు



కుత్బుల్లాపూర్, నవంబర్ 9 (సింగిడి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుందిగల్ మున్సిపాలిటీ శంభీపూర్ లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వివిధ కాలనీల సభ్యులు మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. వారు సానుకూలంగా స్పందించి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలియజేశారు. దీపావళి పండుగ పర్వదిన సందర్భంగా పలువురు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పలు శుభ కార్యక్రమాల్లో పాల్గొనాలని పలువురు ఎమ్మెల్సీ శంబిపూర్ రాజును ఆహ్వానించారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ



కుత్బుల్లాపూర్, నవంబర్ 9 (సింగిడి): కుత్బుల్లాపూర్ నియోజక వర్గం సుభాష్ నగర్ డివిజన్ లోని సుభాష్ నగర్ కి చెందిన పారిశుద్ధ్య కార్మికులకు బొల్లా రామకృష్ణ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు దీపావళి పండుగ సందర్భంగా చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డివిజన్ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు పోలె శ్రీకాంత్ హాజరై ఆయన చేతుల మీదగా పరిశుద్ధ కార్మికులకు చీరల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన బస్తీలలో ప్రతి రోజూ నిస్వార్థంగా సేవలందిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలను గుర్తించి చీరలు పంపిణీ చేసిన రామకృష్ణ ను అభినదించారు. చీకట్లో నుంచి వెలుగులోకి పరిశుద్ధ కార్మికుల జీవితాలు రావాలని, అందరు సుఖసంతోషాలతో దీపావళి పండగ జరుపుకోవాలని వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఎఫ్ ఐ ప్రవీణ్, సుబ్బారామయ్య, దుర్గా రావు, ఎస్ వి కార్పొరేటివ్ సొసైటీ అధ్యక్షులు కరుణాకర్ రెడ్డి పాల్గొన్నారు.

మెడికల్ షాపుల సమస్యలను పరిష్కరించాలని వినతి



కుత్బుల్లాపూర్, నవంబర్ 9 (సింగిడి): మేడ్చల్ జిల్లా కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు యరమాద హరి నారాయణ ఆధ్వర్యంలో అసోసియేషన్ ప్రతినిధులు శనివారం షాపూర్ నగర్‌లోని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ నివాసంలో కూన శ్రీశైలం గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల డ్రగ్స్ కంట్రోల్ శాఖ అధికారులు మెడికల్ షాపులపై నిర్వహించిన తనిఖీల అనంతరం పలు షాపులకు నిరవధిక సస్పెన్షన్లు విధించడంతో కెమిస్టులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సమస్యలను మాజీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై కూన శ్రీశైలం గౌడ్ సానుకూలంగా స్పందించి, ప్రభుత్వం, సంబంధిత మంత్రి, అధికారుల దృష్టికి. సమస్యలను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు బ్రహ్మానందం, ముక్తార్ అలీ, కృష్ణ గౌడ్, మధు గౌడ్, మొహమ్మద్ షాకీర్, ప్రభాకర్ గౌడ్, సంతోష్ గౌడ్, నరేష్ గౌడ్, సునీల్ గౌడ్, అభిరామ్ గౌడ్, ప్రదీప్ గౌడ్, శేఖర్ గౌడ్, ప్రవీణ్, రాము, సంగమేష్, నవీన్, అశోక్, షాజహాన్, పవన్ గౌడ్, రాజశేఖర్, శ్రీధర్ గుప్తా, శ్రీధర్, రాజు, విక్రమ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

మచ్చ బొల్లారం చెత్తను.. జవహర్‌నగర్‌లో డంపు చేస్తే పెద్దఎత్తున పోరాటం

డంపింగ్ యార్డ్ ఎత్తివేతకై

ఈనెల 15 నుండి రిలే నిరాహార దీక్షలు

డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట జేఏసీ పిలుపు





జవహర్ నగర్, నవంబర్ 9 (సింగిడి): మచ్చ బొల్లారం చెత్తను జవహర్ నగర్ లో డంపు చేయడానికి రాంకీ సంస్థకు భూ కేటాయింపులు చేపడితే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ చైర్మన్ షేక్షావలి పిలుపునిచ్చారు. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోనికి కీసర సర్కిల్ జవహర్ నగర్ ప్రగతి నగర్ లో శనివారం నీలం రామచంద్రయ్య భవన్లో జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ చైర్మన్ షేక్షావలి ఆధ్వర్యంలో జేఏసీ కో కన్వీనర్ల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎత్తివేత పోరాట కమిటీ చైర్మన్ షేక్షావలి హాజరై మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ ఎత్తివేతకై నవంబర్ 15 నుండి రిలే నిరాహార దీక్షలు చేపడతామని పిలుపునిచ్చారు. జేఏసీ చేపట్టిన ప్రజా ఆందోళన ప్రభావం వలన ఎంపీ ఈటల రాజేందర్ పాదయాత్ర డిసిసి అధ్యక్షులు వద్రేశ్ యాదవ్ అఖిలపక్షసమావేశాలు నిర్వహించారనీ తెలిపారు. జేఏసీ ఏ పార్టీకి అనుకూలం కాదని ఏ నాయకుడికి అనుకూలం కాదని 30 గ్రామాలకు చెందిన 40 లక్షల ప్రజల ఆరోగ్యం భద్రత కొరకు పోరాడుతుందని స్పష్టం చేశారు. నవంబర్ 3న నాగారంలో జరిగిన అఖిలపక్షసమావేశంలో చర్చ పూర్తి కాకుండానే 12 రోజుల ప్రణాళిక ప్రకటించడాన్ని జేఏసీకి అభ్యంతరాలు ఉన్నాయన్నారు. మరోవైపు ఈ రోజున వచ్చిన దినపత్రికల్లో మచ్చ బొల్లారం కు చెందిన చెత్తను జవహర్ నగర్ లో డంపు చేయడానికి కలెక్టర్ ఆధ్వర్యంలో గుట్టు చప్పుడు కాకుండా సర్వేనెంబర్ 168 లో ఉన్న ఎకరాల ప్రభుత్వము నీ మచ్చ బొల్లారం డంపింగ్ యార్డ్ కు కేటాయించడం లో దానికి రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో పాటు ఎమ్మెల్యే మల్లారెడ్డి ఎంపీ ఈటల రాజేందర్ కాంగ్రెస్ అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ నైతిక బాధ్యత వహించాల్సి ఉంటుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ సలహాదారులు రావ్లోల్ నరసింహా, హరిబాబు, కొండల ముదిరాజ్, ఆలూరి రాజశేఖర్, గడ్డం సదానందం, శివన్నారాయణ, భద్రగామిఆంజనేయులు, మేక లలిత యాదవ్, మల్లేష్, సింగరాయ గౌడ్, జాన్, మహమ్మద్ పాషా మియా, జయసుధ, గడిపే సునీత, జావేద్, కె. వేణు, ప్రవీణ్, శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అమీన్‌పూర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

సాయి అంబికా కాలనీలో అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర ఆలయ నిర్మాణ పనుల పరిశీలన

కాలనీవాసులకు సమస్యలు లేకుండా మౌలిక వసతులు కల్పిస్తాం

మాజీ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి



అమీన్‌పూర్, నవంబర్ 9 (సింగిడి): సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని అమీన్‌పూర్ డివిజన్ పరిధిలోని సాయి అంబికా కాలనీలో నూతనంగా చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి శనివారం కొబ్బరికాయ కొట్టి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం కాలనీలో నిర్మిస్తున్న శ్రీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి ఆలయ నిర్మాణ పనులను ఆయన సందర్శించారు. ఆలయ ప్రాంగణమంతా కలియదిరిగి నిర్మాణ పనుల పురోగతిని, నాణ్యతా ప్రమాణాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, నిర్వాహకులతో మాట్లాడి పనులు ఏ విధంగా సాగుతున్నాయో వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా తుమ్మల పాండురంగారెడ్డి మాట్లాడుతూ... కాలనీలలో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. వర్షాకాలంలో లేదా సాధారణ రోజుల్లో కాలనీవాసులు రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతోనే రోడ్ల నిర్మాణాన్ని ప్రాధాన్యతగా చేపడుతున్నామని స్పష్టం చేశారు. నాణ్యతలో ఎక్కడా రాజీ పడకుండా, నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ దీపాలు వంటి ఇతర సమస్యలు ఏమైనా ఉంటే వాటిని కూడా వెంటనే పరిష్కరిస్తామని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అమీన్ పూర్ మాజీ అప్షన్ నెంబర్ తలారి రాములు, బి ఆర్ఎస్ సీనియర్ నాయకులు కొల్లూరి గోపాల్, కొల్లూరు యాదగిరి,కాలనీ కమిటీ ప్రతినిధులు, ఆలయ నిర్మాణ నిర్వాహకులు, స్థానిక నాయకులు, మహిళలు, కాలనీవాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



జీఎన్ఐటీఎస్‌లో ఘనంగా 'భారత్ రీ-జెన్ క్యాంపస్ ప్రారంభోత్సవం..

- 'ఇంజినీరింగ్ ఇండియాస్ నెట్-జీరో ఫ్యూచర్'పై ప్రత్యేక సదస్సు!

రంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 9 (సింగిడి): పర్యావరణ పరిరక్షణ, సుస్థిర ఇంధన రంగంలో విద్యార్థుల ఆవిష్కరణలను ప్రోత్సహించే లక్ష్యంతో జి. నారాయణమ్మ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, రీసెర్చ్ హైట్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 'భారత్ రీ-జెన్ 2027' క్యాంపస్ ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భారత్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రామ్‌లో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. 'ఇంజినీరింగ్ ఇండియాస్ నెట్-జీరో ఫ్యూచర్' ప్రధానాంశంగా సాగిన ఈ సదస్సుకు 250 మందికి పైగా విద్యార్థులు, అధ్యాపకులు ఉత్సాహంగా హాజరయ్యారు. పర్యావరణ పరిరక్షణ, సుస్థిర ఇంధనం, విద్యార్థుల నూతన ఆవిష్కరణలు, స్టార్టప్‌లను ప్రోత్సహించడమే ధ్యేయంగా ఈ వేదికపై విస్తృతంగా చర్చించారు.



వినూత్న పరిష్కారాలు కనుగొనాలి: డాక్టర్ నాగేంద్ర కుక్కడపు

ఈ సందర్భంగా రీసెర్చ్ హైట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ నాగేంద్ర కుక్కడపు మాట్లాడుతూ.. నేడు పర్యావరణం ఎదుర్కొంటున్న క్లిష్టమైన సమస్యలకు యువ ఇంజనీర్లు వినూత్నమైన, శాశ్వత పరిష్కారాలు రూపొందించాలని పిలుపునిచ్చారు. ఎన్టీపీసీ డీజీఎం రాజన్ వర్మ్నే మాట్లాడుతూ.. స్వచ్ఛమైన ఇంధన వనరుల వాడకం, విద్యుత్ పొదుపు ప్రాధాన్యతను వివరించారు. కార్పొరేట్ రంగం నుంచి విచ్చేసిన ప్రముఖ సంస్థల ప్రతినిధులు అమర రాజా, ఫోర్త్ పార్టనర్ ఎనర్జీ, సీబీఆర్ఈ ఇండియా, సైయంట్, కంట్రోల్ఎస్ నిపుణులు బ్యాటరీ సాంకేతికత, హరిత టెక్నాలజీలు, కర్బన ఉద్గారాల తగ్గింపుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పరిశ్రమల్లో వస్తున్నమార్పులను, భవిష్యత్తు అవకాశాలను వివరించారు.

ఆచరణాత్మక ఆలోచనల వైపు అడుగులు వేయాలి

కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రమేష్ రెడ్డి, డీన్ డాక్టర్ సీత మద్దాల, ఈఈఈ హెచ్ఓడీ డాక్టర్ పి. రామకృష్ణ రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. విద్యార్థులు కేవలం తరగతి గది అభ్యసనానికే పరిమితం కాకుండా సమాజానికి ఉపయోగపడే ఆచరణాత్మక పరిష్కారాల వైపు అడుగులు వేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఇ. గౌతమి, డాక్టర్ కె. శ్యామలాదేవి తదితరులు పాల్గొన్నారు.

స్మశానవాటికల్లో పారిశుద్ధ్య పనులు, విద్యుత్ దీపాల ఏర్పాటు

- హర్షం వ్యక్తం చేసిన స్థానిక కాలనీవాసులు



మల్కాజిగిరి, నవంబర్ 9 (సింగిడి): మౌలాలి సర్కిల్ పరిధిలోని మౌలాలి డివిజన్ (186) డివిజన్‌లో మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే, ప్రజా నాయకుడు మైనంపల్లి హనుమంతరావు ఆదేశాల మేరకు శనివారం దీపావళి పండుగను పురస్కరించుకుని శ్మశానవాటికల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు, విద్యుత్ దీపాల ఏర్పాటు చేపట్టారు. తెలుగు సంప్రదాయంలో దీపావళి పండుగ సందర్భంగా శ్మశానవాటికల్లో ప్రత్యేక పూజలు నిర్వహించే ఆచారం ఉన్న నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా సంబంధిత మున్సిపల్ కమిషనర్‌కు లేఖ అందజేసి, గాంధీనగర్, హనుమాన్ నగర్, మారుతి నగర్, క్రియేటివ్ నగర్, పలు కాలనీ లోని శ్మశానవాటికల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టి, తగిన విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం పండుగ వేళ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాటు చేయడంపై స్థానిక కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మౌలాలి డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్, సీనియర్ నాయకులు నర్సింగరావు, చంద్రకాంత్, నాగేశ్వరరావు, రమేష్, రామాంజనేయులు, అత్తర్, మల్కాజిగిరి యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అజయ్, సాయి, కుమార్, స్థానిక కాలనీల వాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎండుతున్న పంటలు.. మందుల్లేని ఆసుపత్రులు

- సిద్దిపేటను కరువు జిల్లాగా ప్రకటించాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి



కొమురవెల్లి, నవంబర్ 9 (సింగిడి): సిద్దిపేట జిల్లాను తక్షణమే కరువు జిల్లాగా ప్రకటించి, సంక్షోభంలో ఉన్న రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం కొమురవెల్లి మండల సీపీఎం కార్యాలయంలో ఒల్లంపల్లి సాయిలు అధ్యక్షతన జరిగిన శాఖ కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి, జిల్లావ్యాప్తంగా పంటలు ఎండిపోయి తాగు, సాగునీటి కొరత తీవ్రమైందన్నారు. ప్రభుత్వం కేవలం కొన్ని మండలాలనే కరువు ప్రాంతాలుగా ప్రకటించి చేతులు దులుపుకుందని, ఆచరణలో ఎలాంటి సహాయం అందడం లేదని మండిపడ్డారు. తక్షణమే కరువు నివారణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టి, కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ఆర్థిక ప్యాకేజీ సాధించాలని కోరారు. పంట నష్టపోయిన రైతులకు వాణిజ్య పంటలకు ఎకరాకు ?50 వేలు, ఇతర పంటలకు ?30 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలన్నారు. అలాగే కొమురవెల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో గత మూడు నెలలుగా మందుల కొరత వేధిస్తోందని, వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు శెట్టిపల్లి సత్తిరెడ్డి, తాడూరి రవీందర్, అత్తిని శారద, ఇస్తారీ, బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యం

కాంగ్రెస్ మౌలాలి డివిజన్ అధ్యక్షులు పోతుల వినోద్ యాదవ్

సొంత నిధులతో డ్రైనేజీ మరమ్మతు పనులను చేపట్టిన మౌలాలి కాంగ్రెస్ నాయకులు



మల్కాజిగిరి, నవంబర్ 9 (సింగిడి): మౌలాలి (186) వ డివిజన్ పరిధిలోని చందాబాగ్ ప్రాంతంలో గత కొన్ని రోజులుగా డ్రైనేజీ మ్యాన్‌హోల్ నుంచి మురుగు నీరు పొంగి పొర్లుతూ రోడ్లపై ప్రవహించడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను గుర్తించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజలకు ఉపశమనం కల్పించేందుకు స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆదేశాల మేరకు, మౌలాలి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోతుల వినోద్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులందరూ కలిసి తమ సొంత నిధులతో డ్రైనేజీ మరమ్మతు పనులను చేపట్టారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని స్థానిక నాయకులే స్వయంగా ఖర్చులు భరిస్తూ ఈ పనులు చేపట్టడం విశేషం. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తమ వంతు సహాయ సహకారాలు అందిస్తూ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మౌలాలి డివిజన్ జనరల్ సెక్రటరీ సలీం, సీనియర్ నాయకులు రైస్ భాయ్, అరుణ్ గౌడ్, హమీద్ భాయ్, ఫారూక్, చంద్రకాంత్, నర్సింగరావు, రమేష్ అన్న, అక్తర్, మల్లేష్, మైనారిటీ ప్రెసిడెంట్ షకీల్ సిద్ధిఖ్, కుమార్, సాయి, స్థానిక కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఎం.కె రావు చిత్రపటానికి ఎమ్మెల్యే నివాళులు



కాప్రా, నవంబర్ 9 (సింగిడి): క్రాంతి గ్రూప్ వ్యవస్థాపక అధ్యక్షులు కీ.శే. పోలిశెట్టి బాబురావు ప్రథమ వర్ధంతి సందర్భంగా శనివారం సైనిక్‌పురిలోని ఎం.కె.రావు బ్రిగేడియర్ హాల్‌లో శనివారం నిర్వహించిన వర్ధంతి కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొని బాబురావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎం కె రావు సమాజానికి చేసిన కృషిని, వారి సేవలను స్మరించుకుంటూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమం లో మాజీ కార్పొరేటర్ లు కొత్త రామారావు, స్వర్ణరాజ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించండి

చేవెళ్ళ ఎమ్మెల్యే యాదయ్యకు వినతి



వికారాబాద్ ప్రతినిధి, నవంబర్ 9 (సింగిడి): జిల్లా పరిధిలోని నవాబుపేట మండలం గేటువనంపల్లి గ్రామాభివృద్ధికి సంపూర్ణమద్దతు అందించాలని చేవెళ్ళ ఎమ్మెల్యే కాలే యాదయ్య తో గేటువనంపల్లి గ్రామస్తులు కొందరు ఎమ్మెల్యే స్వగృహం వద్ద శనివారం విన్నవించారు. గ్రామంలో పలు సమస్యలు ఉన్నాయని వాటి పరిస్కారానికి తగిన నిధులు అందించాలని వారు ఎమ్మెల్యే ను కోరారు. ముఖ్యంగా భూగర్భ డ్రైనేజి, సీ సీ రోడ్ల నిర్మాణం, రైతు రోడ్ల నిర్మాణం లాంటి అత్యవసర సమస్యల పరిష్కరించాలని వారు కోరారు. ఎమ్మెల్యే ను కలిసిన వారిలో సర్పంచ్ భర్త అనిత ఆంజనేయులు, ఉప సర్పంచ్ బాలరాజు, సీనియర్ నాయకులు పరమానందం, వార్డు సభ్యులు మానయ్య, రాజు తదితరులు ఉన్నారు.

ఈ కార్యాలయాల్లో రోజూ నగదు దందే.!

పైకం ఇస్తేనే పత్రాలపై సంతకాలు.!

అధికారులకు, వినియోగదారులకు వారధులుగా, దళారులు,దస్తావేజులేఖరులు.!

నెలసరి వేతనాల కంటే రోజువారీ మామూళ్లే ఎక్కువ

స్టాంపులు,రిజిస్ట్రేషన్, ఆర్ టీ ఏ కార్యాలయాల్లో నిరంతర ప్రక్రియ

తెలిసినా తెలియనట్లు నటిస్తున్న ఉన్నతాధికారులు.!



హన్మకొండ, నవంబర్ 9 (సింగిడి): ప్రజలు పన్నుల రూపంలో చెల్లిస్తున్న డబ్బుతోనే అధికారులకు ప్రభుత్వం వేతనాలు చెల్లిస్తుంది. అవి చాలవనట్లు అదే ప్రజలకు పనులు కావాలంటే మళ్లీ వారి వద్ద లంచాల రూపేణా దోచుకుంటున్నారు. ప్రభుత్వ శాఖలల్లో ప్రధానంగా , స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, ఆర్టిఏ కార్యాలయాల్లో వినియోగదారులు ప్రభుత్వానికి చలానా రూపంలో నగదును జమచేస్తున్నా అధికారులకు ముడుపులు చెల్లించనిదే ఫైళ్ళ పై సంతకాలు కావు. ఈ క్రమంలోనే అధికారులకు రోజు వారి నగతు వ్యాపారం లేనిదే నిద్రపట్టని పరిస్థితులకు అలవాటు పడ్డారనడంలో అతియోశక్తి లేదు. వీరితో పాటు ఎక్సైజ్, పోలీసు అధికారుల ప్రోత్సాహంతోనే గ్రామాల్లో బెల్ట్ షాపుల నిర్వహణ మూడుపువ్వులు ఆరుకాయలుగా విరాజిల్లుతున్నాయి.

ఈ విషయంలో కొంత మంది అధికారులు బెల్ట్ షాపులా ద్వారా నెలసరి మామూళ్లు తీసుకుంటున్నారనటానికి గ్రామాల్లోని బెల్ట్ షాపులే సాక్ష్యంగా నిలుస్తున్నాయి. ప్రతి గ్రామానికి రెండు లేదా మూడు బెల్ట్‌షాపుల నిర్వహణ కొనసాగుతుంది. తద్వారా మద్యం ప్రియులు అర్ధరాత్రి నుండి తెల్లవార్లు తేడా లేకుండా మద్యం మత్తులో తూలుతున్నారు. ఈ క్రమంలోనే మద్యం ప్రియులు ప్రధాన రహదారులు, పాఠశాల ప్రాంగణాలు, దేవాలయ ప్రాంగణాలను సైతం అడ్డాలుగా వినియోగించుకుంటున్నారనే విమర్శలు వినవస్తున్నాయి. ఇంత జరుగుతున్నప్పటికీ ఎక్సైజ్, పోలీసు ఉన్నతధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం మూలంగా గొడవలు,ఆక్సిడెంట్లు లాంటి సంఘటనలకు దారి తీస్తుంది. జిల్లాలో 67 వైన్స్ 108 బార్లు కొనసాగుతుండగా బెల్ట్ షాపులు మాత్రం వందల సంఖ్యలో కొనసాగుతున్నాయి. మద్యం విక్రయాలలో భాగంగా గత సంవత్సరం 2025 అక్టోబర్ నెల వరకు 94.50 కోట్ల అమ్మకాలు జరపగా ఈ ఏడాది రూ 137.70% విక్రయాలు జరిగాయి. గతంలో కంటే ఏడాది మద్యం విక్రయాలు 46% పెరిగిందనీ అధికారులు పేర్కొంటున్నారు. బెల్టు షాపుల నిర్వహణ దారులు ఇతర రాష్ట్రాల నుంచి లిక్కర్ను దిగుమతి చేసుకున్నట్లు సమాచారం. అదేవిధంగా అక్రమ మద్యం తయారీదారులు పలు బ్రాండ్లకు సంబంధించిన వైన్ ను అదే బ్రాండెడ్ తో తయారుచేసి తక్కువ ధరలకు షాపుల్లో బెల్ట్ షాపుల్లో విక్రయాలు జరుగుతున్నట్లు ఆరోపణలు విలువ వస్తున్నాయి. పండగల నేపథ్యంలో కల్తీ మద్యం అమ్మకం దారులు విచ్చలవిడిగా మద్యం బాటిలను విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. తనిఖీలు చేయాల్సిన ఎక్సైజ్ పోలీసులు తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తూ ఇన్ డైరెక్ట్ గా ప్రోత్సహిస్తున్నారనే విమర్శలు కూడా వినవస్తున్నాయి.

ఇక సబ్ రిజిస్టార్ కార్యాలయాల్లో ఎండ్లతరబడి అవినీతి కంపు కొడుతూనే ఉంది. ఈ కార్యాలయాల్లో ప్రతి సేవకు ఒక ధరను నిర్ణయించారు. దళారులతో పాటు దస్తావేజు లేఖరులను మధ్యవర్తులుగా పెట్టుకొని డబ్బులు వసూలు చేస్తున్నారానిది నిత్య సత్యం. అధికారులకు దళారుల నుండి వాటా డబ్బులు వారి చేతికి అందితేనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. లేదంటే వినియోగదారుడు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిందే, ఇవి కాకుండా మండలాల్లో తహసిల్దార్ కార్యాలయంలోనూ భూముల రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. అక్కడ ఇలాంటి పరిస్థితి చోటుచేకుంది. వ్యవసాయ భూములకు సంబంధించి అన్ని రకాల సేవలు అక్కడే అందుతున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కొందరు డాక్యుమెంట్ రైటర్లకు లైసెన్సులు ఇచ్చినప్పటికీ వాటిని రద్దు చేశారు. భూములు ఇండ్లు ఖాళీ స్థలాల రిజిస్ట్రేషన్ నమోదులో దస్తావేజులేఖరులు, దళారులే ముఖ్యపాత్ర పోషిస్తున్నారు. నిత్యం కార్యాలయంలో తిష్ట వేసి పనులు చేస్తున్నారు.

సిబ్బంది సహకారంతోనే రిజిస్టార్లు పనులు చేసి పెడుతున్నారు. దస్త్రానికి ఇంత ధర నిర్ణయించి అధికారులకు వాటాలు పంచుతున్నారు. కార్యాలయంలోకి వెళ్లేందుకు ఎలాంటి అనుమతులు లేకుండా దర్జాగా వచ్చి నేరుగా సబ్ రిజిస్టార్ తో మాట్లాడుకొని రిజిస్ట్రేషన్లు పూర్తి చేయిస్తున్నారు. సర్వర్ గదిలోను వారే ప్రత్యక్షమవుతుండడం గమనార్హం. కార్యాలయంలోనీ గదుల్లో వారిదే హవా, ఒక మాటలో చెప్పాలంటే వారు లేకుండా ఒక దస్తం ముందుకు కదలదు దస్తావేజులు రాయడం మొదలుకొని రిజిస్ట్రేషన్ పూర్తి వరకు అంతా తామేనని నడిపిస్తున్నారు. నియం త్రించాల్సిన అధికారులే వారిని ప్రోత్సహిస్తున్నారు. కార్యాలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా దళారుల వ్యవస్థ అరికట్టలేని ధీన పరిస్థితి నెలకొని ఉంది. ఇలాంటి కార్యాలయాలపై ఏసీబీ నిఘా పెంచి దోపిడి దారులకు కళ్ళెం వేయాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

అమరవీరుల పోరాట స్ఫూర్తితో ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలి



- మందనపల్లిలో ఎర్రజెండా ఆవిష్కరణ..
- అమరవీరులకు ఘన నివాళులు

ఆలేరు, నవంబర్ 9 (సింగిడి): అమరవీరుల పోరాట స్ఫూర్తితో కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి ఇక్కిరి సహదేవ్ పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజలు ఐక్యంగా పోరాటాల్లోకి రావాలని కోరారు. ఆలేరు మండలం మందనపల్లి గ్రామంలో శనివారం అమరవీరుల సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ సీనియర్ నాయకుడు కామ్రేడ్ కర్రె స్వామి ఎర్రజెండాను ఆవిష్కరించారు. అనంతరం అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఇక్కిరి సహదేవ్ మాట్లాడుతూ ప్రజల హక్కుల కోసం, సమసమాజ స్థాపన కోసం పోరాడి ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని అన్నారు. వారి పోరాట స్ఫూర్తి ప్రజా ఉద్యమాలకు నిరంతరం ఉత్తేజాన్ని, చైతన్యాన్ని అందిస్తుందని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక హామీలు ఇచ్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. ప్రజలను ఆకట్టుకునే హామీలు ఇవ్వడమే తప్ప వాటిని ఆచరణలో పెట్టడం లేదని అన్నారు. గత 70 ఏళ్లుగా అధికారంలో కొనసాగుతున్న పాలకవర్గాలు ప్రజల సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యాయని, ప్రజలకు అందుబాటులో ఉండకుండా మాటలకే పరిమితమవుతున్నాయని విమర్శించారు. దేశంలో 'దున్నేవాడికే భూమి' అనే నినాదాన్ని కమ్యూనిస్టు విప్లవకారులు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లారని, ప్రజా పోరాటాల ఫలితంగా లక్షలాది ఎకరాల భూములను పేదలు సాధించుకున్నారని గుర్తుచేశారు. ప్రజల హక్కులు, భూమి, జీవనోపాధి కోసం సాగిన పోరాటాలే సమాజంలో మార్పునకు పునాదులని అన్నారు. దోపిడీ పాలకవర్గ పార్టీలకు ప్రత్యామ్నాయంగా విప్లవ ఉద్యమాలను బలోపేతం చేయాలని, ప్రజలు విప్లవ పార్టీ వెనుక ఐక్యంగా సమీకృతం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆర్. జనార్దన్, జిల్లా నాయకులు కల్లెపు అడివయ్య, ఆర్. సీత, మందనపల్లి ఉపసర్పంచ్ పద్మ శశిరేఖ, పీవోడబ్ల్యూ జిల్లా నాయకురాలు తమ్మడి ఉమా, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు మారుజోడు సిద్దేశ్వర్, నాయకులు మామిడాల బాల మల్లేష్, ఆర్. ఉదయ్, తమ్మడి అంజయ్య, తమ్మడి రమేష్, దార యాదగిరి, పురుమ చంద్రయ్య, కుర్రి మార్కండేయ, సుంచు రాములు, మావురపు కిష్టారెడ్డి, కొమ్మిడి గోపాల్ రెడ్డి, గోవింద్, పరమేశ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన విద్యార్థినికి రూ.80 వేల ఆర్థిక సాయం

మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి



చింతపల్లి, నవంబర్ 9 (సింగిడి): మండలంలోని గోడకొండ్ల గ్రామ పరిధిలోని వీటి నగర్ లో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న కీర్తి అనే విద్యార్థిని పాఠశాలకు వస్తుండగా ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడింది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి వెంటనే ఆసుపత్రికి వెళ్లి విద్యార్థినిని పరామర్శించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆ సమయంలో ముఖ్యమంత్రి తో మాట్లాడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం శనివారం విద్యార్థిని కుటుంబ సభ్యులను కలిసి రూ. 80 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆపద సమయంలో అండగా నిలిచి, ఇచ్చిన హామీని నెరవేర్చిన ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డికి విద్యార్థిని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కృష్ణవేణి, మండల విద్యాధికారి నీరుడు అంజయ్య, పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జాన్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి యాదయ్య, మహిళా అసోసియేట్ అధ్యక్షురాలు రమాదేవి, పాఠశాల ఉపాధ్యాయులు వీరేందర్, అన్వర్, సుధీర్ కుమార్, శివకోటి కిరణ్ కుమార్, స్టేట్ రిసోర్స్ పర్సన్, ప్రముఖ సైకాలజిస్ట్ శేషన్న తదితరులు పాల్గొన్నారు.

బీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు ఘన సన్మానం



మిర్యాలగూడ, నవంబర్ 9 (సింగిడి): మహాత్మ జ్యోతిరావు పూలే గుర్తించిన శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బీసీ జేఏసీ తరఫున శనివారం సన్మానించారు ఈ సందర్భంగా బీసీ జేఏసీ కన్వీనర్ మారం శ్రీనివాస్, దాసరాజు జయరాజు మాట్లాడుతూ. నియోజకవర్గానికి సంబంధించిన ఇందిరమ్మ ఇండ్ల కాలనీకి మహాత్మ జ్యోతిరావు పూలే గారి పేరుతో నామకరణం చేయడం పట్ల యావత్ బీసీ సంఘాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయని తెలిపారు. ఈ నిర్ణయంతో శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి గారి పేరు చిరస్థాయిగా గుర్తుంటుందని అన్నారు. ప్రభుత్వం నిరుపేద కుటుంబాలకు ఇస్తున్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను డ్రా సిస్టమ్ కాకుండా, క్షేత్రస్థాయిలో ఎంక్వయిరీ చేసి నిజమైన నిరుపేదలను గుర్తించి వారికే ఇండ్లు కేటాయించాలని శాసనసభ్యులు జేఏసీ నాయకులు విన్నవించారు. ఈ కార్యక్రమంలో చెనగోని యాదగిరి, బలుగూరి శ్రీనివాస్, పోలగాని వెంకటేశ్వర్లు, మనీ, ఎస్.కే. జానీ, బసవయ్య గౌడ్, వెంకన్న, యాదయ్య, బంటు కిరణ్, దళిత సంఘ నాయకులు పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

భర్తను హత్య చేసిన భార్య.. ప్రియుడు అరెస్ట్

- నిందితులను రిమాండ్‌కు తరలింపు
- 24 గంటల్లో కేసును చేదించిన భూపాలపల్లి పోలీసులు



భూపాలపల్లి, నవంబర్ 9 (సింగిడి): భూపాలపల్లి మండలం గొల్ల బుద్దారం గ్రామంలో గురువారం రాత్రి భర్తను హత్య చేసిన కేసులో భార్య పావని, ఆమె ప్రియుడు సంతోష్‌ను శనివారం అరెస్టు చేసి నట్లు పోలీసులు తెలిపారు. శనివారం విలేకరుల సమావేశంలో డిఎస్పి సంపద రావు హత్య జరిగిన తీరును వివరించారు. గొల్ల బుద్దారం గ్రామానికి చెందిన అజ్మీర చందు నాయక్ (36)తన భార్య పావనితో జీవనం కొనసాగిస్తున్నారు ఈ క్రమంలో గత ఆరు నెలల క్రితం వారిద్దరి మధ్యలో చిన్నపాటి ఘర్షణ ఏర్పడగా పావని కి మేనమామ వరస అయిన ధారావత్ సంతోష్ కు చెప్పుకోవడం జరిగిందన్నారు ఈ క్రమంలో పావని సంతోషి మధ్య అక్రమ సంబంధం ఏర్పడిందన్నారు. దీంతో భర్త చందు నాయక్ పావనిల మధ్య ఘర్షణ పడి కొట్టడంతో ప్రియుడు సంతోష్ కి ఫోన్ చేసి నీ మూలంగా నేను దెబ్బలు పడుతున్నానని ఆగ్రహంతో చెప్పడం జరిగింది. ఈ క్రమంలో సంతోష్ పథకం వేసి రాత్రి వేళలో చందు నాయక్ హత్యకు ప్లాన్ వేసుకున్నారని పేర్కొన్నారు. రాత్రి 12 గంటల సమయంలో ఇంటి పక్కన ఉన్న దారావత్ సంతోష్ తన వద్ద ఉన్న గొడ్డలితో చందు నాయక్ ఇంటిలోకి వెళ్ళాడు. చందు నాయక్ ముందు రూమ్లో నిద్రిస్తుండగా పావనిని లేపి చందు నాయకులు చంపుదామని చెప్పడం జరిగిందన్నారు. దీంతో చందు నాయక్ గొడ్డలితో తలపై బాధదంతో తీవ్రంగా గాయపడి కింద పడినట్లు తెలిపారు. అనంతరం అక్కడే ఉన్న భార్య పావని గుడ్డతో ముక్కు నోరు శ్వాస ఆడకుండా మూసివేయడంతో మృతి చెందాడని అన్నారు. అనంతరం సంతోష్ తన ఇంటికి వెళ్లి చెట్టు సంచులను తీసుకువచ్చి చందు శవాన్ని అందులో వేసి ఎద్ద బండిలో వేసుకొని చికెన్ పల్లి శివారులోకి వెళ్లి శవాన్ని పడవేశారు అని పేర్కొన్నారు. అంతేకాక హత్య విషయం బయటకు రాకుండా ఉండేందుకు ఇంట్లో ఉన్నరక్తపు మరకలను శుభ్రం చేసి తెలియనట్టుగా ఉన్నారు. అంతేకాక భయంతో నిందితులు పావని, సంతోష్ము అక్కడి నుండి మోటార్ సైకిల్ పై పరారైనట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం మృతుడి అన్న రాజు నాయక్ ఫిర్యాదుతో సంఘటన స్థలానికి వెళ్లిన భూపాలపల్లి సిఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో దర్యాప్తు కొనసాగించారు. భూపాలపల్లి లో అనుమానాస్పదంగా మోటార్ సైకిల్ పై వెళ్తున్న పావని సంతోషులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా చందు నాయక్ చంపిన విషయాలు ఒప్పుకోవడం జరిగిందని డీఎస్పీ పేర్కొన్నారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అరెస్టు చేసిన నిందితులు మృతుడి భార్య పావని,సంతోష్లను శనివారం రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. హత్య కేసును 24 గంటల్లో చేదించడంతో పోలీసులులను డిఎస్పి అభినందించారు. భూపాలపల్లి సిఐ శ్రీనివాస్ నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా చందు నాయక్ ను చంపిన విషయాలు ఒప్పుకోవడం జరిగిందని డిఎస్పి పేర్కొన్నారు. ఈ సమావేశంలో భూపాలపల్లి సిఐ శ్రీనివాస్, ఎస్సైలు పవన్,గీత తదితరులు ఉన్నారు.

పెద్దపల్లి ఎంపీపై టీపీసీసీ అధ్యక్షునికి ఫిర్యాదు



మహాదేవపూర్ నవంబర్ 9 (సింగిడి): పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పై జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు టీపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఐటి పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు పై సోషల్ మీడియాలో జరుగుతున్న అనుచిత ప్రచారాన్ని పార్టీ నాయకత్వం అధికారికంగా ఖండించాలని వారు కోరారు. మల్హార్ మండలంలో గడ్డం వంశీకృష్ణ స్థానిక సర్పంచ్ కు సమాచారం ఇవ్వకుండా బి ఆర్ ఎస్ నాయకులతో కలిసి పర్యటించాడని వారు ఆరోపించారు. పార్టీ కోసం జెండా మోసిన కార్యకర్తలను విస్మరించి ప్రతిపక్ష నాయకులకు ప్రాధాన్యత ఇవ్వడం ఎంత మాత్రం ఆమోదయోగము ఈ వ్యవహారంపై పార్టీ పరంగా కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహాదేవపూర్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు లేతకారి రాజబాబు, బ్లాక్ కాంగ్రెస్ మైనార్టీ అధ్యక్షుడు అస్రార్ ఖురేషి పాల్గొన్నారు.

మందనపల్లి అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తా

- గ్రామ సమస్యలను పరిష్కరించి నియోజకవర్గంలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా..
- ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



ఆలేరు, నవంబర్ 9 (సింగిడి): ఆలేరు మండలం మందనపల్లి గ్రామ అభివృద్ధికి అవసరమైన అన్ని విధాలా సహకారం అందిస్తూ, గ్రామాన్ని నియోజకవర్గంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య హామీ ఇచ్చారు. గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ గ్రామ ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇటీవల మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు వెళ్లే మార్గంలో గత 30 ఏళ్లుగా ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న పాత విద్యుత్ లైన్ సమస్యను ఎమ్మెల్యే సహకారంతో పరిష్కరించినట్లు గ్రామ ప్రజాప్రతినిధులు తెలిపారు. 11 కేవీ విద్యుత్ లైన్ షిఫ్టింగ్ పనులు పూర్తయ్యాయని ఎమ్మెల్యేకు వివరించి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా గ్రామస్థులు ఎదుర్కొంటున్న సమస్యకు పరిష్కారం లభించడంతో హర్షం వ్యక్తం చేశారు. గ్రామంలోని చెరువు పూర్తిస్థాయిలో నిండేందుకు కందిగడ్డ వద్ద కాలువ నిర్మాణ పనులను పూర్తి చేయాలని, గ్రామంలో మురుగునీటి సమస్య పరిష్కారానికి అండర్ డ్రైనేజీ వ్యవస్థను మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించి పెండింగ్ పనులను త్వరితగతిన చేపట్టేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సానుకూలంగా స్పందిస్తూ మందనపల్లి తన సొంత గ్రామం వంటిదని, గ్రామ అభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలిపారు. అవసరమైన సహకారం అందిస్తూ అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్తానని, ఆలేరు నియోజకవర్గంలోనే మందనపల్లిని అన్ని రంగాల్లో ముందంజలో నిలిపేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ శాఖ అధ్యక్షుడు, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తదితరులు పాల్గొని ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యను కలిసి గ్రామ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

జైపాల్‌రెడ్డి పేరు పెట్టే ఆలోచన విరమించుకోవాలి

మట్టి మనిషి పాండురంగారావు



మిర్యాలగూడ నవంబర్ 9 (సింగిడి): జిల్లాలకు వ్యక్తుల పేర్లు పెట్టడం కంటే ఆయా ప్రాంతాల చరిత్ర, సంస్కృతి, మూలాలను ప్రతిబింబించే పేర్లు పెట్టాలని మట్టిమనుషులు వేనేపల్లి పాండురంగారావు, మిట్టపల్లి అశోక్, మీసాల శ్రీను డిమాండ్ చేశారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కొత్త జిల్లాల ఏర్పాటు అవసరం లేదని, ఒకవేళ ఏర్పాటు చేసినా జైపాల్‌రెడ్డి పేరు పెట్టవద్దని స్పష్టం చేశారు. ఇప్పటికే ఉన్న రంగారెడ్డి జిల్లా పేరును కూడా తొలగించి, మహబూబ్‌నగర్‌కు పాత పేరైన పాలమూరును పునరుద్ధరించాలని కోరారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంగా కొనసాగిస్తూ జిల్లాకు నల్లమల పేరు పెట్టాలని సూచించారు. ప్రజల అభిప్రాయాలు, స్థానిక చరిత్రను పరిగణనలోకి తీసుకోకుండా వ్యక్తుల పేర్లను రుద్దడం అగ్రవర్ణ ఆధిపత్య ధోరణికి నిదర్శనమని విమర్శించారు. తెలంగాణ ఉద్యమ సమయంలోనూ, పాలమూరు వలస కార్మికుల సమస్యల విషయంలోనూ జైపాల్‌రెడ్డి ప్రజలకు ఆశించిన స్థాయిలో అండగా నిలవలేదని ఆరోపించారు. జిల్లాల పేర్లు ప్రజల అస్తిత్వానికి, ప్రాంతీయ గౌరవానికి ప్రతీకలుగా ఉండాలని వారు పేర్కొన్నారు.

ఎక్సరే విభాగానికి తాళం

- పారిశుధ్య నిర్వహణ అధ్వానం.. చిన్నారులకు కనీస వసతుల కరువు
- మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి

నల్లగొండ ప్రతినిధి నవంబర్ 9 (సింగిడి): నల్లగొండ ప్రభుత్వ మెడికల్ కళాశాల ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలు, నిర్వహణ లోపాలపై మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్పొరేటర్లతో కలిసి ఆయన ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి వివిధ విభాగాలు, వార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మూడు సంవత్సరాల క్రితమే మంజూరైన ఎంఆర్ఐ స్కాన్ సేవలు ఇప్పటికీ ప్రారంభం కాకపోవడంతో పేద రోగులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సిటీ స్కాన్ సేవలు సక్రమంగా అందడం లేదని, త్రీడీ ఎక్స్‌రే విభాగానికి తాళం వేసి ఉండటాన్ని గమనించి అధికారులను ప్రశ్నించారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు ఎలా అందుతాయని నిలదీశారు. చిన్నపిల్లల విభాగంలో న్యూబార్న్ బేబీ ర్యాప్‌లు అందుబాటులో లేకపోవడంతో అప్పుడే పుట్టిన శిశువులను పాత బట్టల్లో చుట్టి ఉంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో పారిశుధ్య నిర్వహణ కూడా సరిగా లేదని, గత జనవరి నెలతోనే పాత శానిటేషన్ కాంట్రాక్ట్ ముగిసినప్పటికీ ఇప్పటివరకు కొత్త కాంట్రాక్టర్‌ను నియమించకపోవడం వల్ల ఆసుపత్రి పరిసరాలు అపరిశుభ్రంగా మారాయని అన్నారు. వెంటనే కొత్త కాంట్రాక్టర్‌ను నియమించి పారిశుధ్య పనులను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో రూ. 35 కోట్లతో క్రిటికల్ కేర్ విభాగం నిర్మాణం చేపట్టామని తెలిపారు. ఇందులో 50 ఐసీయూ పడకలు, 25 డయాలసిస్ పడకలు ఏర్పాటు చేసి పేద రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనుకున్నామని చెప్పారు. అయితే ప్రస్తుతం ఆ విభాగం నిరుపయోగంగా ఉండటం బాధాకరమని అన్నారు. నల్లగొండ జిల్లా మంత్రి, జిల్లా కలెక్టర్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఆసుపత్రి ఉన్నతాధికారులు తక్షణమే సమీక్ష సమావేశం నిర్వహించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కంచర్ల భూపాల్ రెడ్డి కోరారు. ఏఎంసీ మాజీ చైర్మన్ చీర పంకజ్ యాదవ్ నగర పార్టీ అధ్యక్షులు బోనగిరి దేవేందర్, సింగం రామ్మోహన్ అభిమన్యు శ్రీనివాస్, సింగిల్ విండో చైర్మన్ దోటి శ్రీనివాస్... కార్పొరేటర్లు మారగోని భవాని గణేష్ పెరిక యాదయ్య పేర్ల మల్లీశ్వరి అశోక్,రత్నగిరి తారకమ్మ శ్రీనివాస్, కుందూరు దీపికా ప్రవీణ్ రెడ్డి,బాణావత్ దీప్లా, దొడ్డి రమేష్ గోపగోని స్వాతి రాజశేఖర్... కనగల్ మండల పార్టీ అధ్యక్షులు ఐతగోని యాదయ్య,మాజీ కౌన్సిలర్లు రావుల శ్రీనివాస్ రెడ్డి, మిర్యాల యాదగిరి భాష పాక హరికృష్ణ, దండంపెల్లి సత్తయ్య మెరుగు గోపి, లతీఫ్,జమాల్ ఖాద్రి, పెరిక కరణ్ జయరాజ్,అశ్వాక్, అష్వల్, శంషుద్దీన్, సింగం లక్ష్మి మిర్యాల యాదగిరి,వజ్జ శ్రీనివాస్,వంటల అవినాష్ అశోక్ రెడ్డికంకణాల వెంకటరెడ్డి కందుల లక్ష్మయ్య, అనిల్ నాయక్, నాగరాజు తదితరులు వెంట ఉన్నారు.

కార్తీకోత్సవాలకు మంత్రులకు ఆహ్వానం

ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



ఆలేరు, నవంబర్ 9 (సింగిడి): యాదాద్రి భువనగిరి జిల్లా ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఈ నెల 20, 21, 22 తేదీల్లో మూడు రోజులపాటు నిర్వహించనున్న కార్తీకోత్సవాలకు ఆలయ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉత్సవాలకు సంబంధించిన ప్రత్యేక పోస్టర్‌ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర మంత్రులను కలిసి కార్తీకోత్సవాలకు ముఖ్య అతిథులుగా హాజరుకావాలని ఆహ్వానించారు. ఉమ్మడి నల్గొండ జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో పాటు రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని బీర్ల ఐలయ్య మర్యాదపూర్వకంగా కలిసి ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం క

singidinews@gmail.com

వెలుగుల్ని నింపే ఆత్మీయ దీపావళి

దీపాల వెలుగుల్లో కాంతులీనే అందాల ఇళ్లు.. పటాకుల మోతలతో దద్దరిల్లే లోగిళ్లు.. రివ్వున నింగిలోకి దూసుకెళ్తూ మిరుమిట్లు గొలిపే తారాజువ్వలు.. ఆత్మీయ కలయికలు.. నోరూరించే పిండివంటలు.. దీపావళి పండుగ తెచ్చే సందడి అంతా ఇంతా కాదు. అందుకే ఈ టపాసుల పండుగంటే పిల్లలకీ.. పెద్దలకీ ఎంతో ఇష్టం. అయితే ఈ వెలుగుల పండుగతో తమకీ బోలెడన్ని జ్ఞాపకాలు ముడిపడి ఉన్నాయంటున్నారు అందాల నాయికలు రష్మిక, కయాదు లోహర్.





"నాదృష్టిలో దీపావళి కేవలం ఓ పండుగ కాదు. మనందరి జీవితాల్లోని చీకట్లని తొలగించి కొత్త వెలుగుల్ని నింపే ఓ ప్రత్యేకమైన సందర్భం. చిన్నప్పటి నుంచి నాకు దీపావళి చాలా స్పెషల్. చిన్నతనంలో అమ్మ వాళ్లతో కలిసి ఇంట్లో ముగ్గులేయడం.. దీపాలతో ఇల్లంతా అలంకరించడం.. ఎవరూ రాకముందే దొంగతనంగా స్వీట్లు తినేయడం.. ఇలా ఈ పండుగని తలుచుకోగానే నాకు గుర్తొచ్చే జ్ఞాపకాలెన్నో. నేను నటిగా మారాక ఒకటి రెండుసార్లు దీపావళికి ఇంట్లో వాళ్లతో గడపలేకపోయా. అయితే చిత్రీకరణలో ఎంత బిజీగా ఉన్నప్పటికీ పండుగ స్ఫూర్తిని తగ్గకుండా చూసుకునేదాన్ని. ఆ సమయంలో ఎక్కడున్నా కొన్ని దీపాలు వెలిగించడం.. మనసులో లక్ష్మీదేవిని ప్రార్థించడం.. కుటుంబ సభ్యులకు కాల్ చేసి మాట్లాడటం లాంటివి చేసేదాన్ని. ఇక దీపావళి రోజు నాకిష్టమైన కాజు కట్లీ స్వీట్ కనిపించిందంటే నన్ను నేను అసలు నియంత్రించుకోలేను. ఆ స్వీట్ బాక్స్ ఖాళీ చేయందే నా పండుగ పూర్తికాదు".

–రష్మిక

"దీపావళి లాంటి పండుగలు అందర్నీ ఒకే చోటికి చేర్చి ఆనందాన్ని నింపుతాయి. అందుకే నాకిది ఆత్మీయ పండుగలా అనిపిస్తుంది. చిన్నతనంలో దీపావళి వచ్చిందంటే అమ్మ ఇల్లు సర్దుకోవడం.. పూజ ఏర్పాట్లు చేయడంలో బిజీగా ఉండేది. రంగవల్లులు దిద్దడం.. దీపాలతో అలంకరించడం నా పనిగా ఉండేది. ఇక రాత్రి అమ్మ లక్ష్మీ పూజ చేస్తుంటే.. నేను, నా సోదరి గట్టిగా హారతి పాటలు పాడే వాళ్లం. అలాగే చిన్నప్పుడు నేనూ నా తమ్ముడితో కలిసి ఉత్సాహంగా టపాసులు కాల్చేదాన్ని. కానీ, పదో తరగతికి వచ్చాక కాల్చడం పూర్తిగా మానేశా. జంతు ప్రేమికురాలిగా టపాసుల శబ్దాలకు, పొగకు మూగజీవాలు ఎంత తీవ్రంగా భయాందోళన చెందుతాయో గమనించా. అందుకే అప్పటి నుంచి పర్యావరణ హితమైన దీపావళికి ప్రాధాన్యమిస్తున్నా".

– కయాదు లోహర్



సిన్మా Cinma Singidi

మంగళవారం
10-11-2026

ఒకవైపు వైవిధ్యమైన పాత్రల్లో.. యాక్షన్ కథల్లో నటిస్తూనే మరోవైపు ఓటీటీ వేదికగానూ ప్రేక్షకులను అలరిస్తున్నారు ప్రముఖ కథానాయిక ప్రియాంక చోప్రా. ప్రస్తుతం నిర్మాతగానూ సినీప్రియులను మెప్పించేందుకు సిద్ధమవుతున్నారు. 2016లో తన నిర్మాణంలో రూపొందిన మరాఠీ చిత్రం 'వెంటిలేటర్'కి సీక్వెల్‌గా 'వెంటిలేటర్ 2'ను అధికారికంగా ప్రకటించారు ప్రియాంక. ఈ నేపథ్యంలోనే తన నిర్మాణ సంస్థ 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఒక వీడియోను సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకున్నారు. "10 ఏళ్ల క్రితం పర్పుల్ పెబల్ పిక్చర్స్‌తో కలిసి అర్థవంతమైన కథలను చెప్పాలని నిర్ణయించుకున్నాను. మా సంస్థకు సంబంధించిన ముఖ్యమైన కథల్లో 'వెంటిలేటర్' ఒకటి. ఒక దశాబ్దం తర్వాత, ఇప్పుడు మరెన్నో విశేషాలతో మేము మళ్లీ తిరిగి వస్తున్నాం..." అంటూ రాసుకొచ్చారు ప్రియాంక. దీనికి మరోసారి రాజేశ్ మాపుస్కర్ దర్శకత్వం వహించనున్నారు. ఈ సినిమా 2027లో విడుదల కానుంది. వినాయక చవితి పండగకు మూడు రోజుల ముందు కామెర్కర్ కుటుంబంలోని ఓ వృద్ధుడు అనారోగ్యం పాలై ఆసుపత్రిలోని వెంటిలేటర్‌పై ఉండటమే 'వెంటిలేటర్' చిత్ర కథాంశం. కుటుంబ బంధాలు, తరాల మధ్య వ్యత్యాసాలను తెలియజేయడమే దీని ముఖ్య ఉద్దేశం.





ప్రియాంక... 'వెంటిలేటర్ 2'

ఆ ఘటనతో బాధపడ్డా..

ఉత్తరాఖండ్ వివాదంపై స్పందించిన సింగర్

ప్రముఖ పంజాబీ గాయకుడు దలేర్ మెహందీ ఉత్తరాఖండ్ వివాదంపై స్పందించారు. తన ప్రదర్శన సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలపై దీపావళి సందర్భంగా సోషల్ మీడియా వేదికగా ఓ భావోద్వేగ పోస్ట్ పెట్టారు. ఈ సందర్భంగా తనకు అండగా నిలిచిన అభిమానులకు, కుటుంబ సభ్యులకు, సంగీత పరిశ్రమకు కృతజ్ఞతలు తెలిపారు.

"ఇన్నేళ్లుగా నన్ను ఆదరిస్తున్నారు. ప్రదర్శనలు ఇచ్చిన ప్రతి వేదికపై ఎంతో ప్రేమను అందించారు. కానీ, ఇటీవల నేను ఎదుర్కొన్న అనుభవం మాత్రం మాటల్లో చెప్పలేనంతగా బాధపెట్టింది. మీరు నాకు అండగా నిలిచిన తీరు, నా తరఫున మాట్లాడిన విధానం, నాపై మీరు చూపించిన నమ్మకం, ప్రేమ అన్నీ నాకు ఎంత ధైర్యాన్ని ఇచ్చాయో మాటల్లో చెప్పలేను. మీ సందేశాలన్నీ చదివాను. నా మనసు కృతజ్ఞతతో నిండిపోయింది" అని అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు.

'తాగి పాడుతున్నావ్ ఆపు!'.. దలేర్ మెహందీని అడ్డుకున్న మంత్రి

"ఆ సమయంలో నా కుటుంబమే నాకు అతిపెద్ద బలంగా మారింది. నా సోదరుడు నాకు అండగా నిలబడ్డాడు. మొత్తం సంగీత ప్రపంచం నాకోసం నిలబడింది. ఇలాంటి వారు పక్కన ఉన్నందుకు ఎంతో అదృష్టవంతుడిని. ఒక కళాకారుడి ప్రయాణం గురించి, ఆయన సాధించిన విజయాల గురించి ఆయన ఈ లోకంలో లేనప్పుడు ఎక్కువగా మాట్లాడుకుంటారు. కానీ, నేను బతికుండగానే ఈ ప్రేమను చూడగలిగాను. ప్రతి సందేశానికి సమాధానం ఇవ్వలేకపోయి ఉండొచ్చు. కానీ, మీ ప్రేమను, అభిమానాన్ని నేను ఎప్పటికీ మర్చిపోలేను" అని దలేర్ మెహందీ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు.

ఇండస్ట్రీలో తన మార్క్ పాటలతో సినీ ప్రియులను అలరించిన దలేర్ మెహందీ.. తెలుగులోనూ పలు హిట్ సాంగ్స్ పాడారు. గేమ్ ఛేంజర్ (జరగండి.. జరగండి), బాహుబలి 2 (సాహోరే బాహుబలి), బాద్‌షా (బంతి పూల జానకి)లతో తెలుగు ఆడియన్స్‌ను ఆకట్టుకున్నారు.

ప్రభాతనవ | SINGIDI తెలుగు దినపత్రిక
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం

Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala Mohan, PRGI.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737